Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

ముహూర్తం

శ్రీ విళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: శుద్ధ పాడ్యమి ఉ.7.24 వరకు అనంతరం విదియ; నక్షత్రం: ఉత్తరాషాఢ రా.7.13 వరకు అనంతర శ్రవణం; అమృతకాలం: మ. 12.25 నుండి 2.10 వరకు; వర్జ్యం: రా.11.38 నుండి 1.24 వరకు; దుర్ముహూర్తం: మ.12.24 నుండి 1-12 వరకు, మ.2.48 నుండి 3.36 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు

సంపుటి:57 • సంచిక:263 • సోమవారం 7 జనవరి 2019 • హైదరాబాద్ * పేజీలు:12+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

10 మందితో కేబినెట్ విస్తరణ?

కనీసం 8 మందికి అవకాశం | **ఒకరిద్దరు కొత్త వారికి చాన్స్**

- 15 మంది పార్లమెంటరీ కార్యదర్శుల నియామకం..త్వరలో ఆర్డినెన్స్
- స్పీకర్ పదవికి పరిశీలనలో ఐదుగురు పేర్లు
- రాజధాని చేరుకున్న ఆశావహులు
- సీఎం కేసీఆర్‌ను కలిసే యత్నం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార తేదీ ఖరారవ్వడంతో మంత్రివర్గ విస్తరణపై తెరాస అధినేత కేసీఆర్ దృష్టిసారించారు. ఈ నెల 18వ తేదీ మంచి రోజు కావడంతో ఆ రోజునే మంత్రివర్గాన్ని విస్తరించేందుకు కేసీఆర్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విడత విస్తరణలో ఎనిమిది నుంచి పది మందికి చోటు దక్కవచ్చన్న ప్రచారం జరుగుతుండటంతో ఆశావహులు హైదరాబాద్‌లోని మకాం వేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే మంత్రి పదవులను ఆశిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హైదరాబాద్ చేరుకోగా సోమవారం మరికొంతమంది ఇక్కడికొచ్చే అవకాశం కనిపిస్తోంది. ఆదివారమే పలువురు ఎమ్మెల్యేలు పార్టీ అధినేత కేసీఆర్‌ను, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిసేందుకు ప్రయత్నించినట్లు ప్రచారం జరుగుతుండగా.. కేసీఆర్ వ్యక్తిగత పనుల్లో నిమగ్నమై ఉండటంతో ఆయన ఎవరినీ కలవలేదని సమాచారం. సీఎంతో పాటు మరో 17 మందికి మంత్రివర్గంలో చేర్చుకునే అవకాశం ఉంది. ఈ దఫా ఎనిమిది లేదా పది మందిని తీసుకుని లోక్‌సభ ఎన్నికల తర్వాత మరోసారి కేబినెట్ విస్తరణ చేసే అవకాశం కనిపిస్తోంది.

ఇటీవల ప్రగతి భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేసీఆర్ మంత్రి వర్గాన్ని రెండు దఫాలుగా విస్తరిస్తానని ప్రకటించారు. అందులో భాగంగానే ఈ నెల 18న మంత్రివర్గంలోకి కొత్త మంత్రులను చేర్చుకునేందుకు ముహూర్తాన్ని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం పిదప శాసనసభాధిపతి, ఉప సభాపతి ఎన్నికను చేపట్టవల్సి ఉన్నందున ఈ రెండు పదవులలో ఎవరిని ఎంపిక చేయాలన్న అంశంపై కేసీఆర్ పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు చెబుతున్నారు. అనంతరం మంత్రి పదవులను ఎవరికి కట్టబెట్టాలన్న అంశంపై స్పష్టత వస్తుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అనుభవం, శాసనసభ నిర్వహణా సామర్థ్యం, సామాజిక వర్గాల సమీకరణలను దృష్టిలో పెట్టుకుని సభాపతి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. సభాపతి పదవికి ప్రధానంగా ఐదుగురు పేర్లు పరిశీలనకు వచ్చినట్లు తెలుస్తోంది. బీసీ వర్గాల నుంచి మాజీమంత్రి ఈటల రాజేందర్, రెడ్డి సామాజిక వర్గం నుంచి 2వ పేజీలో...

నేడు కేబినెట్ తొలి భేటీ

అసెంబ్లీ సమావేశాలు, నామినేటెడ్ ఎమ్మెల్యే కేబినెట్ విస్తరణ, స్పీకర్ ఎన్నికపై చర్చ?

వివరాలు 2లో...

తొలి ఫైట్‌కు సై



పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

4,480 గ్రామ సర్పంచ్ స్థానాలు | **39,832** వార్డు మెంబర్ సీట్లకు

నేటి నుంచి నామినేషన్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారం తొలివిడతలోని గ్రామ పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. రాష్ట్రంలో 197 మండలాల పరిధిలోని 4480 గ్రామ పంచాయతీ సర్పంచ్, 39832 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. సోమవారం నుంచి ఈ పంచాయతీల్లో నామినేషన్ల ప్రకియ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఏర్పాట్లన్నింటినీ పూర్తిచేసి ఉంచినట్టు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికలు జరిగే మండలాల్లో ఉన్న గ్రామ పంచాయతీలను క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. ఒక్కో క్లస్టర్ పరిధిలో రెండు నుంచి నాలుగు గ్రామపంచాయతీలను చేర్చారు. క్లస్టర్ కేంద్రంగా ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ఆ క్లస్టర్ పరిధిలోని పంచాయతీల నామినేషన్ల ధాఖలుకు ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలో గ్రామ పంచాయతీల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట క్లస్టర్ల సంఖ్యను పెంచి నామినేషన్ల కార్యక్రమం సాఫీగా జరిగేలా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు వివరించారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ బుధవారం వరకు కొనసాగనుంది. ఎన్నికల్లో పోటీ చేసే వారు ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకూ నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు సమయం కేటాయించారు. ఈనెల 10న నామినేషన్ల స్క్రూటిని నిర్వహించి అదే రోజు సాయంత్రం 5గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాలు ప్రకటిస్తారు. నామినేషన్ల తిరస్కరణపై అప్పీళ్లకు 11న సాయంత్రం 5వరకూ సమయం కేటాయించారు. 12న అప్పీళ్లను పరిష్కరించనున్నారు. నామినేషన్ల ఉప సంహరణకు 13న ఉదయం పది నుంచి సాయంత్రం 3గంటల వరకు సమయం కేటాయించారు. 3గంటల తరువాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాలు ప్రకటిస్తారు. తొలివిడతలోని గ్రామ పంచాయతీలకు 21న పోలింగ్ నిర్వహించి అదేరోజు ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలు ప్రకటించనున్నారు. ఉప సర్పంచ్ 9వ పేజీలో...

సర్వేపై వేటు

కాంగ్రెస్‌పార్టీ నుంచి సస్పెన్షన్

ఎన్నికల సమీక్షలో సత్యనారాయణ, బొల్లు కిషన్ మధ్య వాగ్వాదం

ఒకరిపై ఒకరు సీసాలు విసిరివేత





అంతా మీవల్లే

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఘోర పరాజయంపై మూడోరోజు జరిగిన కాంగ్రెస్ సమీక్ష కార్యక్రమం రసాభాసగా మారింది. అభ్యర్థుల ఎంపిక, ప్రచారం, ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సభల ఏర్పాటులో వివక్ష చూపారని, అందువల్లే ఓటమి పాలయ్యామని పలువురు పరాజిత అభ్యర్థులు సూటి విమర్శలు చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ 3వ పేజీలో...

- కుంతియా, ఉత్తమ్‌లపై నేతల విమర్శ
- భగ్గుమన్న విభేదాలు.. బాహాబాహీ
- ఆరోపణలు.. ప్రత్యారోపణలు.. నిందలు..
- మూడో రోజు సమీక్ష గరం గరం
- మళ్లీ కనిపించిన కాంగ్రెస్ పాత సంస్కృతి

అయ్యప్ప దర్శనానికి వెళ్తూ.. అనంతలోకాలకు



ప్రమాదంలో నుజ్జు నుజ్జయిన వ్యాన్, ఇన్‌సెట్‌లో లారీ ముందు భాగం

- తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం
- 10 మంది తెలంగాణ భక్తుల దుర్మరణం
- మరో ఐదుగురికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం
- మృతులంతా మెదక్ జిల్లా వాసులే.. 4గ్రామాల్లో విషాదం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రోజులతరబడి దీక్షచేసి... నియమనిష్టలతో అయ్యప్పను కొలిచి... దర్శనం చేసుకోవడానికి వెళ్తుండగా తమిళనాడులో జరిగిన రోడ్డుప్రమాదంలో తెలంగాణకు చెందిన 10మంది భక్తులు దుర్మరణం పాలయ్యారన్న వార్త అందరినీ కలచివేసింది. ఆదివారం జరిగిన ఈ ప్రమాదం గురించి తెలిసి రాష్ట్రం నివ్వెరపోయింది. అందరి గుండె చెదిరిపోయింది. మృతులంతా మెదక్ జిల్లాలోని నాలుగు గ్రామాలకు చెందినవారిగా గుర్తించారు. నిన్నమొన్నటిదాకా శరణుఘోష మధ్య.. ఆధ్యాత్మిక వాతావరణంతో ఆ ఊళ్లు కళకళలాడాయి. కానీ ఆదివారం ఆ కళ తప్పింది. అయ్యప్ప దర్శనం చేసుకోవడానికి వెళ్తున్న తమవాళ్లంతా రోడ్డుప్రమాదంలో మరణించారని తెలియడంతో ఆ పల్లెలు మరణఘోషతో విలవిలలాడాయి. తమిళనాడులోని పుదుకొట్టై వద్ద అయ్యప్ప భక్తులు వెళతున్న వ్యాన్‌ను ఎదురుగా వస్తున్న కంటైనర్ ఢీకొన్న ఘటనలో 10 మంది అయ్యప్ప భక్తులు మృతి చెందారు. వీరంతా ఏపీ-20 టీడీ 6809 రిజిస్ట్రేషన్ కలిగిన వ్యాన్‌లో ప్రయాణించారు. నాలుగు రోజుల క్రితం వీరు వ్యాన్‌లో బయల్దేరి వెళ్లారు. వ్యాన్ డ్రైవర్‌తో సహా మొత్తం 16 మంది అయ్యప్ప స్వాములు అయ్యప్ప దర్శనం కోసం 7వ పేజీలో...



విద్యుదాఘాతంతో ముగ్గురు మృతి

మంచిర్యాలజిల్లా ముల్కలపేటలో విషాదం

7లో

మానుకోట విద్యార్థిపై అమెరికాలో కాల్పులు

దుండగుల దాడిలో యువకుడికి తీవ్ర గాయాలు



ఫైల్

కలుషిత ఆహారంతో 107 మంది విద్యార్థినులకు అస్వస్థత



7లో

కేటీఆర్‌కు హార్వర్డ్ వర్సిటీ ఆహ్వానం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హార్వర్డ్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వార్షిక సదస్సుకు హాజరు కావాల్సిందిగా మాజీమంత్రి, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీరామారావుకు ఆహ్వానం అందింది. ఫిబ్రవరి 16,17తేదీలలో మెసాచుసెట్స్‌లో జరగనున్న ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన ప్రముఖ వ్యక్తులు హాజరుకానున్నారు. సమకాలీన భారతదేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళు వివిధ అభివృద్ధి అంశాలపై రెండురోజుల పాటు ఈ సమావేశంలో చర్చించనున్నారు. సుమారు వేయిమంది విద్యావేత్తలు, విద్యార్థులు, యువ వృత్తినిపుణులు హాజరుకానున్న ఈ సమావేశానికి కేటీఆర్‌కు ఆహ్వానం లభించింది. ఇండియా ఎట్ ఇన్‌ఫ్లెక్షన్ పాయింట్ అనే థీమ్ ఆధారంగా సాగనున్న ఈ సమావేశంలో 2వ పేజీలో...

ఔరా..!





మళ్లీ జోన్ల సవరణ

- ములుగు, నారాయణపేట జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో మారనున్న జోన్ల పరిధి
- కేడర్ స్ట్రెంగ్త్ ఇంకా తేలలేదు
- ఉద్యోగుల విభజన ఆ తర్వాతే

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలో ఏర్పాటైన కొత్త జోన్లను మరోసారి సవరించేలా కసరత్తు జరుగుతోంది. కొత్తగా రెండు జిల్లాల ఏర్పాటుతో ఈ సవరణ అనివార్యమైంది. అదేవిధంగా కేడర్ స్ట్రెంగ్త్ నిర్ధారణ, ఉద్యోగుల విభజనపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల్లోపే ఈ తతంగం ముగించాలని చూస్తోంది. తాజాగా ములుగు, నారాయణపేట రెండు కొత్త జిల్లాలను 2వ పేజీలో...



నిండు ప్రజాస్వామ్యం... సగం తీర్పు!

2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌ఓట్లు 28.3 కోట్లు

28 కోట్ల మంది ఓటర్లు పోలింగ్‌కు దూరం

వలసలు, పట్టణ ప్రాంత ఓటర్ల నిర్లక్ష్యమే కారణం

నాలుగో వంతు ఓట్లతోనే కొలువుదీరుతున్న ప్రభుత్వాలు

న్యూఢిల్లీ: ప్రపంచంలోకెల్లా అతిపెద్ద, శక్తివంతమైన ప్రజాస్వామ్య దేశం మనది. 120 కోట్ల మంది జనాభాలో 83.4 కోట్ల మంది ఓటు హక్కు కలిగివున్నారు. దేశ అభివృద్ధికి, భద్రతకు, పౌరుల శ్రేయస్సుకు పాటుపడే సమర్ధవంతమైన ప్రభుత్వాన్ని ఎన్నుకునే బాధ్యత వీరిదే. కానీ, వేర్వేరు కారణాలతో మూడింట ఒకవంతు వయోజనులు ఓటుకు దూరంగా ఉండిపోతున్నారు. మొత్తం ఓట్లలో వీరిసంఖ్య దాదాపు 28 కోట్లు. మిగతా రెండొంతుల ఓటర్లలో కొందరు జాతీయపార్టీలైన, కాంగ్రెస్, బీజేపీవైపు నిలుస్తుండగా, మిగతావారు ఇతర 8వ పేజీలో...

మళ్లీ జోన్ల సవరణ

(మొదటిపేజీ తరువాయి)

సీఎం కేసీఆర్ ఆమోదించారు. వీటిపై గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో మరోసారి 31 జిల్లాల తెలంగాణ 33 జిల్లాలకు మార్పు సంతరించుకుంది. దీంతో అందుకు అనుగుణంగా జోనల్ వ్యవస్థను మార్చాల్సిందే. ఈ రెండు జిల్లాలను జోనల్ వ్యవస్థలో కలుపుతూనే వికారాబాద్ జిల్లాను జోగులాంబ జోన్‌నుంచి చార్మినార్ జోన్‌లోకి మార్చాల్సి రానుంది, జనగామ జిల్లాలోని గుండాల మండలాన్ని యాదాద్రి భువనగిరి జిల్లాలోకి మార్చాలి. ఇవి చేసేందుకు మరోసారి జోన్ల సవరణ అవశ్యం.

రాష్ట్రంలోని 61 రకాల పోస్టుల వర్గీకరణను సత్వరమే పూర్తిచేసేలా అధికారులు కృషి ఆరంభించారు. ప్రధానంగా పోస్టులు, ఉద్యోగులు, క్యాడర్‌లపై సమగ్ర నివేదిక అవసరమని యోచిస్తున్నారు. శాఖల వారీగా వాటిని సిద్దం చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. గత ఆగస్టు 29న కొత్త జోనల్ విధానాన్ని రాష్ట్రపతి ఆమోదించి ది తెలంగాణ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ (ఆర్గనైజేషన్ ఆఫ్ లోకల్ కేడర్స్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్) ఆర్డర్-2018 పేరుతో కేంద్రం ఆగస్టు 29న గెజిట్ ఉత్తర్వులను జారీ చేసింది. ఈ గెజిట్‌లోనే స్పష్టంగా తెలంగాణ ప్రభుత్వం కొత్త నిబంధనలను 36నెలల్లోపు అమలులోకి తేవాలని, తద్వారా నూతన జోనల్ విధానాన్ని అమలు చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో ఆయా జోనల్‌లకు అనువుగా పోస్టులు, ఉద్యోగుల విభజన ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలను ఆరంభించింది. అన్ని ప్రభుత్వ శాఖలనుంచి ఉద్యోగులు, పోస్టుల వివరాలను సేకరించేందుకు ఆరు రకాల్లో వివరాలను సేకరిస్తోంది. ఆర్థిక శాఖ వెబ్‌సైట్‌లో



శాఖలవారీగా ఉద్యోగులు, పోస్టుల వివరాలు అప్‌డేట్ అవుతున్నాయి.

విభజనలోనూ...

తెలంగాణలో నూతన జోన్లు అమలులోకి వచ్చిన తర్వాత ఈ మార్పులు చోటు చేసుకున్నాయి, తెలంగాణ రాష్ట్రం కొత్తగా 7 జోన్లు, రెండు మల్టీ జోన్లతో మార్పులు సాకారం చేసుకుంది.

ప్రాంతాల మధ్య అసమానతలను తొలగించేలక్ష్యంతో ఏర్పాటు చేసిన కొత్త జోన్లు నిరుద్యోగులకు, ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మేలు చేకూర్చేడమే దీని లక్ష్యం. అయితే కొత్త విధానాల ప్రకారం స్థానిక క్యాడర్లలో ఉద్యోగాలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం కేడర్‌లను నిర్ధారించాల్సి ఉంది. ఉద్యోగుల వయసు, సీనియార్టీ, స్థానిక భాష, పనిచేసే శాఖలోని చట్టాలపై అవగాహన, ప్రభుత్వ అవసరాలను పరిగణలోకి తీసుకుని క్యాడర్‌ను కేటాయించాలని భావించారు. అన్ని స్థానిక క్యాడర్లలో పదోన్నతికి సమాన అవకాశాలు కల్పించేందుకు అవకాశాలు పరిశీలిస్తున్నారు. ఈ దిశలో అన్ని శాఖలనుంచి సీఎస్ జోషి సమాచారం సేకరించారు. కానీ ఎన్నికల నిర్వహణతో పురోగతి మందగించింది.

కేడర్ స్ట్రెంగ్త్‌పై...

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించినట్లుగా ఏ కేటగిరీ పోస్టులైనా ప్రతీ ప్రాంతానికి ఒక లోకల్ కేడర్, నియామకాల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటుకు ప్రతిపాదించింది. అన్ని కేడర్లలోని ఉద్యోగులకు ఉన్నతస్థాయి పదోన్నతులకు సమాన అవకాశాలు వర్తిస్తాయని స్పష్టంచేసింది. లోకల్ కేడర్ నుంచి ఇతర కార్యాలయాలకు, సంస్థలకు ఒక ఉద్యోగిని బదలీ చేయాలంటే ఈ ఉత్తర్వులు వర్తించవని, బదలీ ఒక లోకల్ కేడర్‌నుంచి మరో లోకల్ కేడర్‌కే జరగాలని నిబంధన విధించింది. ప్రతీ బహుళ జోన్ ఒక లోకల్ ఏరియాగా గుర్తిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ అన్ని పోస్టులు, స్థానిక సంస్థల పోస్టులు వీటి పరిధిలో ఉంటాయని నిర్ధేశించింది. ఇంకా వీటిపై పూర్తి నివేదికలు రూపొందించాల్సి ఉంది.

నియామకాలకు...

నూతన విధానంతో అనేక ప్రయోజనాలు చేకూరనుండగా గతంలోని అనిశ్చితులు పూర్తిగా తొలగనున్నాయి. ప్రత్యక్ష నియామకాలన్నింటికీ ఈ విధానం వర్తించనుంది. దీంతో ప్రభుత్వ పరిధిలోని అన్ని రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలకు ఇదే విధానం అమలవుతుంది. ప్రస్తుతం 371 డి కింద విధినిర్వహణలో ఉన్న ఉద్యోగులను అవే క్యాడర్లలో కొనసాగించాలని గెజిట్‌లో పేర్కొన్నారు. అంతర్ జిల్లా, అంతర్ జోనల్ బదలీలకు గతంలో ఉన్న నిషేదం తొలగించారు. దీంతో సీనియార్టీని పరిరక్షిస్తూనే బదలీలకు ఆస్కారం కల్గనుంది. ప్రతీ జిల్లా ఒక లోకల్ ఏరియాగా పరిగణించబడుతుందని గెజిట్ వెల్లడించగా, ప్రతీ జోన్‌ను ఒక లోకల్ ఏరియాగా పరిగణించనున్నారు. మల్టీ జోన్ విషయంలోనూ ఇదే అంశం అమలు కానుంది. ఒకటికంటే ఎక్కువ జిల్లాల్లోని ఒకే క్యాడర్ పోస్టులను ప్రత్యేక క్యాడర్‌గా గుర్తిస్తారు. జోన్, మల్టీ జోన్‌కు ఇదే విధానం అవలంభిస్తారు. కాగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కు అర్హత సాధించే వ్యక్తి అక్కడ స్థానికుడుగా గుర్తిస్తారు. సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, ప్రత్యేక కార్యాలయాలు, కొత్తగా ఏర్పాటు చేసే కార్యాలయాలు, రాష్ట్ర స్థాయి కార్యాలయాలకు జోనల్ విధానంలోని నిబంధనలు వర్తించవని చట్టంలో పేర్కొన్నారు. ఆయా కార్యాలయాల్లోని సిబ్బందిని మాత్రం జిల్లాలకు పరస్పరం బదలీ చేసుకోవచ్చు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు



శ్రీసుదర్శన నృసింహయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్‌రావు

సిద్దిపేట, ప్రభ న్యూస్ : రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆకాక్షించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దీకొండ మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో మూడురోజుల పాటు జరుగుతున్న శ్రీ సుదర్శన నృసింహ యాగం, మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. ప్రజలంతా సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని, సీఎం కేసీఆర్ పాలనలో బంగారు తెలంగాణ సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. స్వామి అనుగ్రహంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వం మరోసారి ఏర్పాటు జరిగిందని తెలిపారు. ప్రజల సంక్షేమం అందించే విధంగా టీఆర్ఎస్ ప్రభుత్వ పాలన ఉండబోతుందని, సిద్దిపేట పట్టణాన్ని ఆధ్యాత్మిక నెలవు, ఎన్నో యజ్ఞ యాగాలకు సిద్దిపేట కేంద్రంగా మారిందన్నారు. పట్టణంలో మూడు రోజుల పాటు ఈ యాగం నిర్వహించడం సంతోషంగా ఉందని, ప్రప్రథమంగా ఆరుబయట శ్రీనివాస కళ్యాణం సిద్దిపేటలో నిర్వహించడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రాలతో మంత్రి హరీష్‌రావును ఆశీర్వదించారు.

అధికారుల పనితీరు భేష్

- వ్యవసాయ శాఖ డైరీ ఆవిష్కరణలో హరీష్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారుల పనితీరు దేశానికే ఆదర్శమని మాజీమంత్రి టి. హరీష్‌రావు కొనియాడారు. దేశం మొత్తం మన పథకాలనే కాపీకొడుతున్నారంటే అది తెలంగాణకే గర్వ కారణమన్నారు. గత ప్రభుత్వాల్లో రైతు ఆత్మహత్యలు, ధర్నాలే కనిపించేవని, ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు పక్షపాతి కావడమే తెలంగాణ రైతుల్లో గుణాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. స్వామినాథన్‌ను కూడా తిట్టిపోసిన ఘనత కాంగ్రెస్ నేతలదని, అందుకే వారికి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. తెలంగాణలోని వ్యవసాయ అధికారులకు గౌరవ విలువలు పెరిగాయన్నారు. ఆదివారం వ్యవసాయ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్‌ని మాజీ మంత్రులు హరీష్‌రావు, పోచారం శ్రీనివాసరెడ్డి, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు కలిసి ఆవిష్కరించారు.

కేసీఆర్‌కు పోటీ నేతలే లేరు - పోచారం

రాష్ట్రంలో పదిహేనేళ్ళ వరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పోటీ వచ్చే నాయకులెవరు ప్రతిపక్షంలో లేరని, రైతాంగానికి కేసీఆర్ ఏమి చేశారో అర్థం చేసుకునే స్థితి కూడా ప్రతిపక్షనేతలకు లేదని మాజీమంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి ఎద్దేవ చేశారు. మరోపదేళ్ళలో దేశంలోనే ధనవంతులైన రైతులు ఎక్కడున్నారంటే అంతా తెలంగాణ వైపే చూస్తారని అన్నారు. రైతు కష్టాలు తెలిసిన వ్యక్తిగా కేసీఆర్ రైతుబంధు పథకాన్ని అమలుచేస్తున్నారని ఆయన కొనియాడారు. రాష్ట్రంలో దాదాపు 185000 వేల మంది ఎకరంలోపు భూమి ఉన్న రైతులే ఉన్నారనీ, చిన్న, సన్నకారు రైతులకు కేసీఆర్ సర్కార్ చేసిన సేవ వృధా కాదన్నారు. 42 లక్షల ఎకరాల కొత్త ఆయుకట్టు అందుబాటులోకి రానుందని, దీంతో 1.50 లక్షల కోట్ల పంట చేతికొస్తుందన్నారు.

కేసీఆర్ పథకాలు తెలంగాణకు దిక్సూచి - గుత్తా

రైతాంగం కోసం ఆలోచించే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు తెలంగాణకు దిక్సూచి అని ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు, రైతుబీమా పథకాల పట్ల ఇతర రాష్ట్రా లు ఆసక్తి కనబర్చుతున్నాయని ఆయన అన్నారు. వ్యవసాయాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన శాఖగా తీర్చిదిద్దాలని కేసీఆర్ యోచిస్తున్నారని ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీ పదవులకు తీవ్రపోటీ

- పట్టభద్రుల నియోజకవర్గానికి పెరుగుతున్న ఆశావహులు
- టీచర్ ఎమ్మెల్సీ నుండి పాతూరికి గ్రీన్‌సిగ్నల్
- ఎమ్మెల్సీ ఖాళీల భర్తీకి నెలాఖరులో షెడ్యూల్?

ఆంధ్రప్రభ, హైదరాబాద్: మార్చిలో ఎన్నిక జరగనున్న గ్రాడ్యుయేట్, టీచర్ నియోజకవర్గ ఎమ్మెల్సీ పదవులకు తీవ్రపోటీ నెలకొంది. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండగా, ఈనెలాఖరులో నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ త్వరలో అభ్యర్థిని ప్రకటించనున్నారు. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించిన గ్రూప్-1 అధికారుల సంఘం నేత చంద్రశేఖరగౌడ్ ప్రయత్నాలు చేసుకోవడంతో పాటు ఓటరునమోదు కార్యక్రమాల్లో క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. ఇక మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ కూడా ఓటరునమోదు కార్యక్రమాల్లో బిజీగా పనిచేస్తున్నారు. రెండురోజుల క్రితం తెలంగాణభవన్ వచ్చి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా కలిశారు. ఎన్నికలకు ముందే తనకు ఎమ్మెల్సీ హామీ ఉందని, ఓటరు నమోదు కూడా చేయించమని పార్టీనేతలే సూచించారని ఆయన సన్నిహితులతో చెప్పినట్లు తెలుస్తోంది. ఇక కరీంనగర్ మేయర్ రవీందర్ సింగ్ పేరు కూడా సీఎం మదిలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మైనారిటీ నేత కావడం వల్ల జాతీయస్థాయి రాజకీయాలకు పరిచయాలను, సంబంధాలను వాడుకునే యోచన ఉన్నట్లు సమాచారం. ఇక సీఎం కేసీఆర్‌కు సన్నిహితునిగా ఉండి, ఓఎస్‌డిగా పనిచేసిన దేశపతి శ్రీనివాస్ పేరు కూడా ఇదే ఎమ్మెల్సీకి వినబడుతోంది. బ్రాహ్మణసామాజిక వర్గానికి చెందిన దేశపతి శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీగా పంపాలని సీఎం యోచిస్తున్నా, ఇదే నియోజకవర్గానికి అతని అభ్యర్థిత్వం పరిశీలిస్తారా? భవిష్యత్‌లో ఇతరత్రా సమీకరణాలను దృష్టిలో పెట్టుకుంటారా? అన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఈ పట్టభద్రుల నియోజకవర్గం నుండి మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, మళ్ళీ ఆయనను అదే నియోజకవర్గం నుండి మండలికి పంపే అవకాశాలు లేవు. ఒకవేళ మండలి ఛైర్మన్‌గా స్వామిగౌడ్‌ను కొనసాగించదలుచుకుంటే ఎమ్మెల్యే కోటా నుండి ఎంపికచేయవచ్చని పార్టీవర్గాలు భావిస్తున్నాయి. స్వామిగౌడ్ చేవెళ్ళ లేదా మల్కాజగిరి నుండి ఎంపీగా బరిలోకి దిగాలని ఆశిస్తున్నారు. సీఎం మదిలో ఏముందో మరికొద్దిరోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మార్చి 29 వరకు ప్రస్తుత మండలి ఛైర్మన్ పదవీకాలం ఉంది.

పాతూరి సుధాకర్‌రెడ్డికి గ్రీన్‌సిగ్నల్

మండలి చీఫ్‌విప్‌గా ఉన్న పాతూరిసుధాకర్‌రెడ్డి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి మరోసారి పోటీచేయడం ఖాయమైంది. శాసనమండలిలో టీఆర్ఎస్ చీఫ్‌విప్‌గా ఉన్న సుధాకర్‌రెడ్డికి ఇప్పటికే సీఎం ఈ దిశగా సంకేతాలిచ్చారు. ఇక ఉపాధ్యాయసంఘం నేతలు కూడా తమ అభ్యర్థిగా పాతూరి సుధాకర్‌రెడ్డినే ప్రకటించాయి. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి ప్రస్తుతం పూలరవీందర్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, గతంలో పిఆర్‌టియు అభ్యర్థిగానే పోటీచేసి విజయం సాధించారు. టీఆర్ఎస్ కూడా మద్దతునిచ్చింది. ఈదఫా ఆయన అభ్యర్థిత్వంపై ఉపాధ్యాయసంఘాల నుండి, నేతల నుండి కొన్ని అభ్యంతరాలు పార్టీ నాయకత్వానికి చేరినట్లు సమాచారం. అయితే ఆయనే తిరిగి పోటీచేసే అవకాశం ఉందని పార్టీవర్గాలలో చర్చ జరుగుతోంది. ఈ మూడు ఎమ్మెల్సీలతో పాటు ఇప్పటికే ఖాళీ అయిన, ఖాళీ కానున్న ఎమ్మెల్సీలకు ఈనెలాఖరులోనే షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని పార్టీవర్గాలు భావిస్తున్నాయి.

10 మందితో కేబినెట్ విస్తరణ?

(మొదటిపేజీ తరువాయి)



పోచారం శ్రీనివాసరెడ్డి, చర్లకోల లక్ష్మారెడ్డి, పద్మాదేవేందర్, ఎస్టీ సామాజిక వర్గం నుంచి రెడ్యా నాయక్ పేర్లను కేసీఆర్ పరిశీలిస్తున్నట్లు సమాచారం. గత శాసనసభలో బీసీ వర్గానికి చెందిన సిరికొండ మధుసూదనాచారి సభాపతిగా కొనసాగారు. ఉప సభాపతిగా మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ పనిచేశారు. ఒకవేళ తిరిగి బీసీ వర్గానికే సభాపతిగా అవకాశం ఇవ్వాలనుకుంటే ఈ పదవి ఈటల రాజేందర్‌ను వరించే అవకాశం కనిపిస్తోంది. గతంలో పనిచేసిన అనుభవంతో పాటు రెడ్డి సామాజిక వర్గం.. అందునా మహిళను నియమించాలనుకుంటే పద్మా దేవేందర్‌ను ఎంపిక చేసే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మంత్రిగా సుదీర్ఘ అనుభవం, సామాజిక సమీకరణలను పరిగణనలోనికి తీసుకోవాలనుకుంటే రెడ్యానాయక్, పోచారం శ్రీనివాసరెడ్డి, లక్ష్మారెడ్డి అభ్యర్థిత్వాలను పరిశీలించే అవకాశం ఉంది. సభాపతి పేర్లను పరిశీలిస్తున్న వారంతా మంత్రి పదవులను ఆశిస్తుండటం, తమను ఎలాగైనా సరే మంత్రివర్గంలోకి తీసుకోవాలని వారంతా ఇప్పటికే కేసీఆర్‌ను కలిసి కోరడంతో స్పీకర్ పదవి ఎవరికి దక్కుతుందోనన్న సస్పెన్స్ కొనసాగుతోంది. స్పీకర్‌గా పనిచేస్తే తదుపరి జరిగే ఎన్నికల్లో ఓటమి పాలవుతారన్న అపోహ కూడా ఉండటంతో ఈ పదవిని తీసుకునేందుకు ఎవరూ అంతగా ఆసక్తి కనబర్చడం లేదని సమాచారం. మంత్రివర్గ విస్తరణకు వేళ కావడంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

విస్తరణలో మంత్రి పదవులు దక్కే వారిలో తన్నీరు హరీష్‌రావు, కల్వకుంట్ల తారక రామారావు, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బాల్క సుమన్, కడియం శ్రీహరి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, పద్మారావు గౌడ్, వేముల ప్రశాంతరెడ్డి, ఎర్రబెల్లి దయాకరరావు, పల్లా రాజేశ్వరరెడ్డి, ఆరూరి రమేష్, వినయ్‌భాస్కర్, రెడ్యానాయక్, రేఖానాయక్, గొంగిడి సునీత తదితరుల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా సామాజిక వర్గాలు, మంత్రులుగా పనిచేసిన అనుభవం, గతంలో వారి పనితీరు ఆధారంగా మంత్రివర్గంలో చోటు కల్పించాలని కేసీఆర్ భావిస్తున్నారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన వారిలో కూడా ఒకరిద్దరినీ మంత్రివర్గంలోకి తీసుకోవాలన్న ఆలోచనతో కేసీఆర్ ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో వరంగల్ మేయర్‌గా పనిచేసి ఇటీవలి ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించిన నన్నపనేని నరేందర్, అంబర్‌పేట నుంచి గెలిచిన కాలేరు వెంకటేష్, చొప్పదండి నుంచి నెగ్గిన సుంకే రవిశంకర్‌లు కూడా మంత్రి పదవులను ఆశిస్తున్న వారిలో ఉన్నారు. అయితే, నన్నపనేని నరేందర్ మేయర్ పదవిని త్యజించి ఎమ్మెల్యేగా పోటీకి దిగారని.. విస్తరణలో ఆయనకు అవకాశం ఉంటుందన్న అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది.

15 మంది పార్లమెంటరీ కార్యదర్శుల నియామకం?

పార్లమెంటరీ కార్యదర్శులుగా 10 నుంచి 15 మందిని నియమించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటివరకు మంత్రి పదవులను చేపట్టని వారికి మాత్రమే పార్లమెంటరీ కార్యదర్శులుగా ఎంపిక చేయాలన్న నిర్ణయానికి కేసీఆర్ వచ్చినట్లు చెబుతున్నారు. మంత్రివర్గంలో చోటు దక్కని వారిలో చాలా మందిని ఈ పదవులలో సర్దుబాటు చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని పార్లమెంటరీ కార్యదర్శుల ఎంపికను చేపట్టాలని కేసీఆర్ ప్రతిపాదించారు. ఈ నియామకాలకు సంబంధించి త్వరలోనే ఓ ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు ఆయన ఈ అంశంపై న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణులతో సమాలోచనలు జరిపినట్లు తెలుస్తోంది. ఆర్డినెన్స్‌ను రూపొందించే పనిలో రాష్ట్ర న్యాయశాఖ నిమగ్నమైంది. గతంలో ఆరుగురు పార్లమెంటరీ కార్యదర్శులను కేసీఆర్ నియమించగా ఈ పదవులు చెల్లనేరవంటూ అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో ఉన్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి న్యాయపోరాటం చేయడంతో హైకోర్టు ఈ నియామకాలను రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. తిరిగి ఈ తరహా చిక్కులు తలెత్తకుండా ఉండాలన్న ధ్యేయంతోనే ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చి ఆ తర్వాతే పార్లమెంటరీ కార్యదర్శుల నియామకాలను చేపట్టాలని సీఎం కేసీఆర్ ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.

ఐటీ ఉద్యోగులకు అండగా టీటా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) జిల్లాల కార్యదర్శుల వివరాలను టీఎస్‌పీఎస్‌సీ సభ్యులు సి. విఠల్ ప్రకటించారు. తెలంగాణలోని జిల్లాలతో పాటు కర్నాటక కార్యదర్శుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా టీటా గ్లోబల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్ మక్తాల మాట్లాడుతూ, వివిధ దేశాల నుంచి మొదలుకుని క్షేత్రస్థాయిలోని ఐటీ ఉద్యోగులను కనెక్ట్ చేసే వేదికగా టీటా కొనసాగనుందని వెల్లడించారు. ఇందులో భాగంగానే ప్రపంచ వ్యాప్తంగానే కాకుండా క్షేత్రస్థాయిలో కూడా ఐటీ ఉద్యోగులకు అండగా ఉండేందుకు తమ కమిటీల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

జిల్లాల వారీగా కార్యదర్శులు వీరు. భద్రాద్రి కొత్తగూడెం - కొండా శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ - నాగరాజు మర్యాల, జగిత్యాల - చిక్కులపల్లి విష్ణు, కామారెడ్డి - ప్రదీప్ నీలగిరి, కరీంనగర్ - మహిరతన్ దేవ, ఖమ్మం - మాధురీ కృష్ణచైతన్య, మహబూబాబాద్ - అనిల్‌కుమార్ గుండ్ల, మహబూబ్‌నగర్ - వీరబొమ్మ ప్రణీత్‌కుమార్, మంచిర్యాల - భాస్కర్ పిన్న, మేడ్చల్ - రాజేష్‌కుమార్ ఎండ్ల, నల్గొండ - స్వాతి చిలుకూరి, నిజామాబాద్ - రవీందర్ రాయడ, పెద్దపల్లి - తంగెళ్ళ సాయికుమార్‌రెడ్డి, రాజన్న సిరిసిల్ల - శ్యామ్ మేరుపు, సంగారెడ్డి - వరికుప్పల చక్రవర్తి, రంగారెడ్డి - వివేక్ బొద్దం, సిద్దిపేట - తలారి కిషన్, సూర్యాపేట - రవిచంద్రారెడ్డి ముడెం, వికారాబాద్ - రాజేందర్‌రెడ్డి శేరి, వనపర్తి- రాజేంద్ర ప్రసాద్ సాగర్‌సుగూర్, వరంగల్ - విద్యాధర్ కొత్తకొండ, వరంగల్ (అర్బన్) - నిర్మల్ బండారి, యాదాద్రి భువనగిరి - గంపా ఉపేందర్, జనగాం - దీక్షిత్‌రెడ్డి రావుల, ములుగు - కిరణ్ మిట్టకోల, కర్నాటక - శ్రీచక్ర నెల్లుట్ల, దక్షిణాఫ్రికా - కిశోర్ పుల్లూరి, కువైట్ - మహ్మద్ సమీముద్దీన్, హైటెక్ సిటీ సెజ్ - చిన్ని ఆనంద్, ఆదిబట్ల సెజ్ - వివేక్ చింతలగట్టులను ఎంపిక చేశారు.

కేటీఆర్‌కు హార్వర్డ్ వర్శిటీ ఆహ్వానం

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకవక్తగా హాజరై ప్రసంగించాల్సిందిగా కేటీఆర్‌ను యూనివర్శిటీ వార్షికసదస్సు నిర్వాహకులు కోరారు.

నా పేరుతో అభిమాన సంఘాలు వద్దు: కేటీఆర్

తనపేరుమీద ఏర్పాటుచేస్తున్న సంఘాలు, యువసేనలు, అభిమానసంఘాలకు తన నుండి ఎలాంటి మద్దతులేదని తెలంగాణ రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీరామారావు తెలిపారు. కేటీఆర్ యువసేన, కేటీఆర్ సేవాదళ్, కేటీఆర్ అభిమానసంఘం వంటి పేర్లతో పలు సంఘాలు ఏర్పాటుచేసినట్లు తన దృష్టికి వచ్చిందని, ఇలాంటి వాటిని తాను ఆమోదించబోనని ఆదివారం స్పష్టం చేశారు. ఇప్పటికే పలు జిల్లాల్లో తనపేర్లతో ఏర్పాటుచేసిన ఇలాంటి సంఘాలన్నింటినీ వెంటనే రద్దుచేసుకోవాలన్నారు. దీంతోపాటు ఫేస్‌బుక్, సామాజిక మాధ్యమాల్లో కేటీఆర్ యువసేన, కేటీఆర్ అభిమానసంఘం వంటి పేర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారు సైతం వాటిని ఆపేయాలని కోరారు. పార్టీపైన, తనపైన అభిమానముంటే కేసీఆర్ నాయకత్వంలో, తెలంగాణ రాష్ట్రసమితితో కానీ, పార్టీ అనుబంధసంఘాలతో కానీ పనిచేయాలన్నారు. కేటీఆర్ యువసేన పేరుతో తనను కలిసిన పలువురు కార్యకర్తలను వెంటనే సంఘం రద్దుచేసుకోవాలని కేటీఆర్ సూచించారు. వారందరినీ టీఆర్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాల్సిందిగా సూచించారు.

తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టేలా పుష్ప ప్రదర్శనలు

- మేజర్ జనరల్ శ్రీనివాసరావు







ఆంధ్రప్రభ, హైదరాబాద్: అందమైన పుష్ప ప్రదర్శనల ద్వారా అలంకరణల్లో తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టాలని తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ జనరల్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఇకేబాణ ఇంటర్నేషనల్ హైదారాబాద్ చాప్టర్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినూత్న పుష్ప ప్రదర్శనను మేజర్ జనరల్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జపాన్ దేశంలో అతి పురాతన సంస్కృతి ఇకేబాణ అని ఈ తరహా సంస్కృతిని తెలంగాణ రాష్ట్రంలో ఇకెబాణ ఇంటర్నేషనల్ హైదరాబాద్ చాప్టర్ ఫ్లవర్ ఎగ్జిబిషన్‌ల ద్వారా ఏర్పాటు చేయటం వల్ల రాష్ట్రానికి పర్యాటకపరమైన ప్రోత్సాహం ఇచ్చినట్టవుతుందన్నారు. ఇకేబాణ , తెలంగాణ సాంస్కృతిక శాఖ పరస్పర సహకారాలతో పర్యాటక రంగం అభివృద్ధికి కృషి చేయాలని శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ అరుదైన పుష్పాలతో రూపొందించిన ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసిన ఇకేబాణ సంస్థ హైదరాబాద్ చాప్టర్ మహిళా సభ్యులు పర్యాటక రంగాభివృద్ధికి కూడా మరింత సహకారం అందిచాలని కోరారు. బతుకమ్మ సంబరాల్లో ఇకేబాణ సంస్థ సభ్యులు ఎంతో సహకారం అందిస్తున్నారన్నారు. బతుకమ్మ పండుగను అంతర్జాతీయ స్థాయిలో తీసుకుపోయేందుకు ఇకేబాణ ఇంటర్నేషన్ సంస్థ చేస్తున్న ప్రయత్నాలను అభినందిచారు. ఇటువంటి ప్రదర్శనల వల్ల రాష్ట్రానికి గణనీయంగా విదేశీ పర్యాటకులను ఆకర్షించే అవకాశ ఉందన్నారు. ఈ సందర్భంగా ఇకేబాణ న్యూస్ లెటర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అనురాధారావు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేబినెట్ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ మంత్రి మండలి తొలి సమావేశం సోమవారం ఉదయం ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరగనుంది. ప్రగతి భవన్‌లో ఉదయం 11-30 గంటలకు జరిగే భేటీకి హోంమంత్రి మహమూద్ అలీ హాజరవుతారు. ఈ నెల 15 నుంచి నిర్వహించ తలపెట్టిన శాసనసభ ప్రత్యేక సమావేశాలు, శాసనసభకు ఆంగ్లో ఇండియన్ తరపున ఎంపిక చేసే నామినేటెడ్ సభ్యుడు ఎవరన్నది సోమవారం నాటి సమావేశంలో ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వంలో వివిధ అంశాలపై కూడా చర్చించి ఒక నిర్ణయానికి రానున్నారు. ఇప్పటికే మంత్రి మండలి సమావేశానికి సంబంధించిన అజెండాను సిద్ధం చేసి మంత్రి మహమూద్ అలీకి పంపించినట్లు తెలుస్తోంది. త్వరలో విస్తరించే మంత్రిమండలి, శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎంపికపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నట్లు సమాచారం.

అంతా మీవల్లే

(మొదటిపేజీ తరువాయి)

కుంతియా, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డివల్లే పార్టీ ఓటమిపాలైందని వారు నేరుగా విమర్శించారు. ఆ సమయంలో మరికొందరు విమర్శిస్తున్నవారిని అడ్డుకోగా నేతల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. ఓటమికి మీరే కారణమంటూ పరస్పర నిందలు, నిష్ఠూరాలు, ఘర్షణలు, దాడులతో దారితప్పింది. చాలా రోజుల తరువాత మళ్లీ పాత కాంగ్రెస్ సంస్కృతి కళ్లముందు కనిపించింది. చివరకు కేంద్ర మాజీ మంత్రి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి పోటీచేసి ఓటమిపాలైన మాజీ మంత్రి సర్వే సత్యనారాయణను పార్టీ నుంచి సస్పెన్షన్ వేటుపడేలా పరిస్థితులు మారిపోయాయి.



మూడు రోజులుగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై గాంధీభవన్‌లో సమీక్షలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సమీక్ష సమావేశాలకు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఆయా జిల్లాలకు చెందిన డీసీసీ అధ్యక్షులు హాజరై కాంగ్రెస్ ఓటమికి గల కారణాలు, వచ్చే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంతో పాటు పార్టీ బలోపేతానికి తీసుకునే చర్యలపై చర్చిస్తున్నారు. మొదటి రెండు రోజు సమావేశాలు కొంతమేర సాఫీగానే సాగాయి. అయితే ఆదివారం జరిగిన మల్కాజ్‌గిరి, చేవెళ్ల, సికింద్రాబాద్, హైదరాబాద్ ,మెదక్ పార్లమెంట్ నియోజక వర్గాల సమావేశం రసాభాస అయింది.



సికింద్రాబాద్ లోక్‌సభ సమావేశం వాడివేడిగానే జరిగినట్లు తెలిసింది. సికింద్రాబాద్ అసెంబ్లీకి పోటి చేసిన కాసాని జ్ఞానేశ్వర్ కూడా

రైలు వెళ్లిపోయాక.. ప్లాట్ ఫాంపైకి వచ్చినట్లుగా ఉంది... కాసాని జ్ఞానేశ్వర్

కుంతియా, ఉత్తమ్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ' రైలు వెళ్లిపోయాక .. ప్లాట్ ఫాం ' పైకి వచ్చినట్లుగా కాంగ్రెస్ పార్టీ సమీక్ష ఉందని ఎద్దేవ చేసినట్లుగా తెలిసింది. ఎన్నికల సమయంలో పార్టీ పరిస్థితిపైన పట్టించుకునే నాధుడే కరువయ్యాడని, తీరా ఫలితాలు వచ్చి మూడు వారాల తర్వాత సమీక్షలు చేయడమా..? అంటూ ఆయన నిలదీశారు.

కుంతియాపై విమర్శతో...

టికెట్ల కేటాయింపుల్లో అవకతవకలు, ఆలస్యం, ప్రచారం చేయడంలో వైఫల్యంతోనే కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రామచంద్ర కుంతియాను ఉద్దేశించి సర్వే సత్యనారాయణ వ్యాఖ్యానించడంతో పరిస్థితి అదుపుతప్పింది. సర్వే విమర్శలు చేస్తున్నప్పుడు అక్కడే ఉన్న టీపీసీసీ కార్యదర్శి బొల్లు కిషన్ జోక్యం చేసుకుని సర్వే సత్యనారాయణను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో మరింత ఆగ్రహంతో ఊగిపోయిన సత్యనారాయణ 'పోటీ చేసిన అభ్యర్థులతోనే సమావేశమన్నారు. ఈ సమావేశంలో ఇతరులెందుకున్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని పెంచి పోషిస్తున్నారు' అంటూ విమర్శించారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగి చొక్కాలు పట్టుకునే స్థాయికి వెళ్లింది. సమావేశంలో ఉన్న నేతలందరు ఇద్దరినీ వారించారు. ఆ తర్వాత సర్వే సత్యనారాయణ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. అక్కడ జరిగిన పరిణామాలపై సర్వే సత్యానారాయణను బాధ్యుడిగా చేస్తూ కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.

పార్టీలో లేకున్నా టికెట్లిచ్చారు..

హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో టికెట్ల కేటాయింపుల్లో నిజమైన కాంగ్రెస్ నేతలకు అన్యాయం జరిగిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జి. నిరంజన్ పార్టీ నేతలను ప్రశ్నించినట్లుగా తెలిసింది. పార్టీలో సభ్యత్వం లేని వారికి, ఎంఐఎంతో అంటగాకే వారికి టికెట్లు ఇచ్చారని, కనీసం టికెట్లు కేటాయించే సమయంలో తమను ఎందుకు పరిగణలోకి తీసుకోలేదన్నట్లు సమాచారం. ఇటీవల పోటి చేసిన పోటీ చేసిన అభ్యర్థులు ముగ్గురు అభ్యర్థులు ఎంఐఎం పార్టీతో తిరుగుతున్నారని ఆయన వివరించారు.



నన్నే సస్పెండ్ చేస్తారా.. మీ భరతం పడతా: సర్వే

కాంగ్రెస్ పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేసే అధికారంలో టీ పీసీసీలో ఎవరికి లేదని సర్వే సత్యనారాయణ అన్నారు. తాను కేంద్ర మంత్రిగా పని చేయడమే కాకుండా ఏఐసీసీ సభ్యుడనని, కాంగ్రెస్ పార్టీకి, సోనియాగాంధీకి విధేయుడనని ఆయన తెలిపారు. నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వారి భరతం పడుతానని ఆయన హెచ్చరించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి కొంత మంది రౌడీ మూకలను పెంచి పోషిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. నాపై దాడికి కిషన్, మహేష్ కుమార్‌గౌడ్‌ను ఎగదోశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కుంతియా, ఉత్తమ్ వల్లే ఓడిపోయిందని ఆయన విమర్శించారు. కుంతియా, ఉత్తమ్‌ను పార్టీ పదవుల నుంచి తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ ఓటమికి కారణమైన వాళ్లే తిరిగి సమీక్ష సమావేశాలు ఎలా నిర్వహిస్తారని సర్వే సత్యనారాయణ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధిష్టానం సమీక్ష చేయమని చెప్పలేదని, ఎన్నికల్లో పోటి చేయని వాళ్లు సమీక్షలో ఎలా కూర్చుంటారని ఆయన నిలదీశారు. అయితే పార్టీ ఓటమికి గల కారణాలను వివరిస్తూ.. వచ్చే ఎన్నికల్లో విజయానికి గల సలహాలు ఇస్తుంటే ఇది నచ్చని వారు కొందరూ తనపై దాడికి దిగారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌లో ఏం జరగుతోందో మరిన్ని వివరాలు సోమవారం వెల్లడిస్తానని ఆయన వివరించారు.

రాహుల్ సభలు ఏర్పాటులోనే వివక్ష : మాజీ మంత్రి ప్రసాద్



చేవెళ్ల పార్లమెంట్ సమీక్షా సమావేశంలో కూడా మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ రామచంద్ర కుంతియా, టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ ఓటమికి పార్టీలోని పెద్దలు కూడా కారణమని ఆయన విమర్శలు చేశారు. రాహుల్‌గాంధీ సభలు ఒకే సామాజిక వర్గానికి చెందిన నేతలు పోటీ చేసిన నియోజక వర్గాల్లోనే నిర్వహించారని, తాను ఖర్చు భరిస్తాను చెప్పినా వికారాబాద్‌లో రాహుల్ సభ ఏర్పాటు చేయలేదని ఆయన అన్నారు. ఒక రంగారెడ్డి జిల్లాలోనే తాండూరు, పరిగి, మేడ్చల్‌తో పాటు కొడంగల్ నియోజక వర్గాల్లో రాహుల్ సభలు నిర్వహించారని వివరించారు. ఇదే విధానం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిందని, మిగతా సామాజిక వర్గాల అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీకి అవసరం లేదా..? అంటూ ప్రసాద్‌కుమార్ నిలదీసినట్లు సమాచారం.

వేటులో వివక్షా?

తప్పులను ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా..?

- సామాజిక న్యాయం అంటూనే ఎస్సీ, ఎస్టీ, బీసీలపై చర్యలు
- కుంతియాపై బహిరంగ విమర్శలు చేస్తే మౌనమా?
- పార్టీకి వ్యతిరేకంగా పనిచేసినవారిని వదిలేశారేం...
- ఇదేం పక్షపాతం... సర్వే సస్పెన్షన్‌పై కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: కాంగ్రెస్‌లో సస్పెన్షన్లపై వివాదం ముదురుతోంది. రాష్ట్ర పార్టీ వ్యవహరాల ఇన్‌ఛార్జ్ కుంతియాపై ఒక వర్గం నేతలు బాహాటంగా విమర్శలు చేసినా పట్టించుకోని టీపీసీసీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణ సంఘం.. ఎస్సీ, ఎస్టీ బీసీ నాయకుల విషయంలో పక్షపాతంగా వ్యవహరి స్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్‌లోనే సామాజిక న్యాయం ఉందంటూనే షోకాజ్‌లు, సస్పెన్షన్ వంటి చర్యల విషయంలో వివక్షత కొనసాగుతోందని పార్టీలో కొందరు విమర్శిస్తున్నారు. ఇటీవల జరిగిన పరిణామాలపై కాంగ్రెస్ సీనియర్లు కూడా గుర్రుగా ఉన్నారు. ఒక వర్గం నేతలు పార్టీకి వ్యతిరేకంగా పని చేసినా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ కుంతియాతో పాటు టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌పైన విమర్శలు చేసినా చర్యలు వెనుకాడుతున్న విషయాన్ని పలువురు కాంగ్రెస్ నేతలు గుర్తు చేస్తున్నారు.



రాజ్ గోపాల్ రెడ్డి వ్యవహారంలో ఏం చేశారు

అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రామచంద్ర కుంతియాపైన చేసిన ఘాటైన విమర్శలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీకి కుంతియా శనిలా దాపురించాడని, ఆయన ఇన్‌చార్జీగా ఉంటే కాంగ్రెస్ విజయం సాధించదని కూడా బాహాటంగానే వ్యాఖ్యానించారు. అయితే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి టీ పీసీసీ క్రమశిక్షణ సంఘం షోకాజ్ నోటిసు జారీ చేసి.. గాంధీభవన్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని కోరింది. రాజగోపాల్‌రెడ్డి మాత్రం తన అనుచరులతో ఒక నోటును పంపారే తప్ప గాంధీభవన్‌కు మాత్రం రాలేదని , అతనిపై చర్యలకు కనీసం కూడా తీసుకోలేదని ఆ పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత వాపోయారు.

ఇంత అన్యాయమా?

తాజాగా కేంద్ర మాజీ మంత్రి, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సర్వే సత్యనారాయణను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం కూడా తొందరపాటు చర్య అన్న అభిప్రాయం వ్యక్తం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే ఎన్నికల తర్వాత పార్టీకి వ్యతిరేకంగా పని చేశారని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఎ. చంద్రశేఖర్, మిర్యాలగూడకు చెందిన స్కైలాబ్ నాయక్‌ను ఇటీవలనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు క్యామ మల్లేష్ యాదవ్ విషయంలోనూ ఇదే జరిగిందని చెబుతున్నారు. ఇబ్రహీం పట్నం నియోజక వర్గం టికెట్‌ను ఆశించారు. పొత్తులో భాగంగా ఇబ్రహీం పట్నం టీడీపీకి కేటాయించిన విషయం తెలిసిందే. కాగా ఇదే నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ టికెట్‌ను మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా ఆశించారు. రంగారెడ్డికి టికెట్ రాకపోవడంతో ఆయన బీఎస్పీ నుంచి బరిలోకి దిగారు. ఎన్నికలకు ఒక రోజు ముందు మాత్రం టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాత్రం ఇబ్రహీంపట్నంలో టీడీపీకి కాంగ్రెస్ మద్దతు లేదని, మల్‌రెడ్డి రంగారెడ్డికే కాంగ్రెస్ మద్దతు ఇస్తున్నట్లుగా ప్రకటన చేశారు. పొత్తు ధర్మాన్ని విస్మరించడమేంటని టీడీపీ నేతలు ప్రశ్నించారు.

షోకాజ్ ఇవ్వకుండా వేటా

కాగా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జరిగిన తప్పులను సమీక్షా సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తే కొంత మంది నేతలు తట్టుకోవడం లేదంటున్నారు. తప్పుడు వ్యాఖ్యలు చేస్తే ముందుగా షోకాజ్ నోటీసు ఇచ్చాక చర్యలు తీసుకుంటే బాగుండేదని అంటున్నారు.

కోర్ కమిటి సమావేశం నిర్వహించాలి - వీ హెచ్



ఎన్నికల ఫలితాలు, పార్టీ ఓటమికి గల కారణాలపై చర్చించేందుకు కాంగ్రెస్ కోర్ కమిటీని ఏర్పాటు చేస్తే ఇలాంటి గొడవలకు అస్కారం ఉండేది కాదని ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు అభిప్రాయపడ్డారు. ఫలితాలు వచ్చి మూడు వారాలు గడిచిన తర్వాత సమీక్షలు చేపట్టం కూడా పెద్ద తప్పిదమేనని ఆయన అన్నారు.

టీడీపీతో కలిసా... కటీఫా!

- కాంగ్రెస్‌లో తాజా చర్చ
- పార్లమెంట్ ఎన్నికల వ్యూహంపై తలోమాట
- డీకే అరుణ ఫామ్‌హౌజ్‌లో కాంగ్రెస్ నేతలకు విందు

పార్లమెంట్ ఎన్నికల వ్యూహమేంటి.?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తులు ఉంటాయా..? లేదా కాంగ్రెస్ పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగుతుందా..? అనే అంశంపైన తీవ్ర చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీతో కట్టిన జట్టే కాంగ్రెస్‌ను కొంప ముంచిందని కొందరు నేతలు బాహాటంగానే విమర్శ లు చేస్తుండగా.. మరి కొందరు మాత్రం లాభం జరిగిందని కుండబద్దలు కొట్టినట్లుగా చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వచ్చే పార్లమెంట్ ఎన్నిల్లో కాంగ్రెస్ పార్టీ ఎలా అనుసరిస్తుందనే విషయంపైన కేడరల్ తీవ్ర చర్చ జరుగుతోంది. టీడీపీతో పొత్తు వల్లే కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం జరిగిందని మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించగా.. అదే రోజు కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు భట్టి విక్రమార్క అందుకు భిన్నంగా స్పందించారు. టీడీపీతో కలిసి పని చేయడం వల్ల ఖమ్మం జిల్లాలో లాభమే జరిగిందని చెప్పిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై మెదక్ జిల్లాకు చెందిన సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కూడా పొత్తుల వల్ల కాంగ్రెస్‌కు లాభమే జరిగిందని అభిప్రాయపడ్డారు. పొత్తులపై కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని జగ్గారెడ్డి కొట్టిపారేశారు. మెదక్ పార్లమెంట్ టికెట్ తన భార్యకు ఇస్తే గెలిపించుకుని వస్తానని ఆయన తెలిపారు. లేదంటే ఎవరైనా బలమైన అభ్యర్థికిచ్చినా పర్వాలేదన్నారు. సీఎల్పీ పదవి తనకు ఇవ్వాలని ఆయన కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తులు ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఇదే అంశంపై మాజీ మంత్రి డీకే అరుణ స్పందిస్తూ పొత్తుల వల్ల అన్ని ప్రాంతాల్లో లాభం జరగలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం ఒంటరిగి వెడితేనే మేలని డీకే అరుణ అభిప్రాయపడ్డారు. అయితే కాంగ్రెస్ ఓటమికి కేవలం పొత్తులే కారణం కాదని, అనేక కారణాలు ఉన్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. టీఆర్ఎస్ ఒక్కో చోటా ఒక్కో విధంగా వ్యూహాలను అనుసరించిందని తెలిపారు. కాంగ్రెస్‌కు కంచుకోటలాంటి పాలమూరులో పార్టీ ఓటమిని చూస్తేనే ఎందో జరిగిందనే అనుమానం వ్యక్తం అవుతోందని ఆమె చెప్పారు. పార్టీలో ప్రక్షాళన ఎప్పుడుంటోందో చూడాలని అన్నారు.



ఎమ్మెల్యేలు, పోటీ చేసిన వారందరం ఒకసారి మాట్లాడుకోవాలనే సమావేశం అయ్యామని, ఇది విందు సమావేశం కాదని ఆమె తెలిపారు. ఎక్కడి వారు అక్కడనే ఉంటే సరికాదనే ఈ సమావేశం ఏర్పాటు చేసుకున్నట్లుగా అరుణ వివరించారు. తాను పార్లమెంట్ ఎన్నికల్లో పోటి చేసే అంశంపైన ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు.

నష్టం చేసేలా మాట్లాడొద్దు - వీ హెచ్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి టీడీపీతో పొత్తే కారణమని కోమటిరెడ్డితో పాటు పలువురు నేతలు చేసిన వ్యాఖ్యలు ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి నష్టం చేసేలా ఉన్నాయని ఏఐసీసీ కార్యదర్శి వి. హనుమంతరావు అభిప్రాయపడ్డారు. దేశంలో ఒక వైపు పొత్తుల కాలం నడుస్తుంటే.. ఇక్కడి నేతలు మాత్రం వ్యతిరేకించడం సరికాదన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని రాహుల్‌గాంధీ చెప్పడం, ఇదే అంశంపై బీజేపీ మోసం చేయడం వల్ల చంద్రబాబు కాంగ్రెస్‌తో కలిసి వచ్చారని ఆయన తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌కు అన్ని పార్టీల మద్దతు అవసరం ఉంటుందనే విషయం గుర్తుంచుకోవాలని వీహెచ్ హితవు పలికారు. చంద్రబాబుపై విమర్శలు చేస్తున్న కొంత మంది నేతలు.. అదే టీజేఎస్, సీపీఐ విషయంలో ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఆ రెండు పార్టీలకు ఓటు బ్యాంక్ ఎంతో ఉందో తెలుసుకోవాలన్నారు.

ఉద్యమాలు చేశామా..?: దామోదర

కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేయడంలో విఫలమైందని కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ ఉప ముఖ్యమంత్రి





దామోదర రాజనరసింహ అభిప్రాయప్డారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన అంశం తప్ప.. మరెక్కడ కూడా ఉద్యమాలు చేయలేదన్నారు. ఆదివారం ఆయన గాంధీభవన్‌లో తనను కలిసిన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలో అనేక సమస్యలు వచ్చాయని, నేరెళ్ల ఘటన, రైతులకు బేడీలు వేయడం అంశాలపైన స్పందించలేదన్నారు. ఓటర్ ఆలోచన మారినందున 'పార్టీ లైన్ ఆఫ్ థింకింగ్' కూడా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ ప్రియారిటీ మారిపోయిందని, ఆ ఇరవై రోజులు ఏం చేశామన్నదే ముఖ్యమైందని ఆయన వివరించారు.

అభివృద్ధికి, గెలుపునకు, ఓట్లకు సంబంధం లేకుండా పోయిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. అధికార దుర్వినియోగంతో పాటు ఎన్నికల కమిషన్ తీరుపైన అనేక అనుమానాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ఈసీ నిర్ణయం టీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉందని ఆయన ఆరోపించారు. డబ్బు, మద్యం ప్రభావం విపరీతంగా ఉందన్నారు. ఇవే కాకుండా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోయామన్నారు.

ఎంఈవోల్లేరు! ఇన్‌ఛార్జులే!!

- రెగ్యులర్ ఎంఈవోలు 36 మందే
- 503 మండలాలకు ఇన్‌ఛార్జ్‌లే
- ఒకరికే రెండు, మూడు మండలాల బాధ్యత
- 45 మండలాలకు ఎంఈవో పోస్టులే మంజూరు కాలేదు
- 8 నెలలుగా రాని గ్రాంట్స్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో రెగ్యులర్ మండల విద్యాధికారులు లేకపోవడంతో విద్యా వ్యవస్థ కునారిల్లుతోంది. 584 మండలాల్లో కేవలం 36 మండలాలకు మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు కొనసాగుతున్నారు. మిగిలిన వాటిలో ఇన్‌ఛార్జ్‌లే దిక్కుగా మారారు. పాఠశాలలను పర్యవేక్షించాల్సిన అధికారులు లేకపోవడంతో పాఠశాలలు సక్రమంగా నడుస్తున్నాయో లేదో తెలియని పరిస్థితిలో పాఠశాల విద్యా వ్యవస్థ కొనసాగుతోంది. పాఠశాలలకు పర్యవేక్షణాధికారులే కాదు స్కూల్స్‌కి రావల్సిన గ్రాంట్స్ కూడా గత 7 నెలలుగా రాకపోవడంతో స్కూల్‌లో కనీస సౌకర్యాలు కల్పించడానికి నిధులు లేకుండా పోయాయి. విద్యార్థులకు క్లాస్ చెప్పడానికి రాయాల్సిన చాక్‌పీస్ కొనడానికి డబ్బులు లేవు... రాసిన అక్షరాలను తుడిచేయడానికి డస్టర్ కోసం నిధులు లేవు.



36 మండలాలకే రెగ్యులర్ ఎంఈవోలు...

రాష్ట్రంలో 584 మండలాలు ఉన్నాయి. వాటిలో కేవలం 36 మండలాలకు మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు కొనసాగుతున్నారు. మిగిలిన 503 మండలాలకు ఇన్‌చార్జ్‌లే దిక్కుగా మారారు. వీటిలో ఇప్పటికీ 45 మండలాలకు ఎంఈవో పోస్టులే మంజూరు కాలేదు. దీంతో ఆయా మండలాలకు కూడా అవి విడిపోయిన మండల విద్యాధికారే ఇన్‌ఛార్జ్‌గా కొనసాగుతున్నారు.

కొందరు ఎంఈవోలు రెండు, మూడు మండలాలకు కూడా ఇన్‌ఛార్జ్‌లుగా కొనసాగుతున్నారు. రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడంతో ఆ మండలంలోని ప్రధానోపాధ్యాయుల్లోని సీనియర్‌ను చూసి ఎంఈవోగా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు. వారు తన పాఠశాలకు స్కూల్‌లోని ఉపాధ్యాయుల్లో సీనియర్ ఉపాధ్యాయున్ని ఇన్‌ఛార్జ్ హెడ్‌మాస్టర్‌గా నియమించుకొని ఆయన ఎంఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్రంలో 10 జిల్లాలను పరిపాలన సౌలభ్యం కోసం 31 జిల్లాలుగా మార్చిన నేపథ్యంలో అదనంగా ఏర్పడిన మండలాల్లో ఇప్పటికీ 45 మండలాలకు ఎంఈవో పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయలేదు.

7 నెలలుగా విడుదల చేయని గ్రాంట్స్

రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌కి మంజూరు చేయాల్సిన స్కూల్ గ్రాంట్స్ నిధులను ప్రభుత్వం గత 7 నెలలుగా విడుదల చేయలేదు. దీంతో స్కూల్‌లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని స్కూల్స్‌లో అయితే విద్యార్థులకు పాఠాలు బోధించడానికి చాక్‌పీస్ లేకపోవడమే కాకుండా రాసింది తుడిచే డస్టర్‌లు కూడా కొనలేని పరిస్థితి నెలకొంది. స్కూల్స్‌కి గ్రాంట్స్‌గా సర్వశిక్షా అభియాన్, మాధ్యమిక శిక్షా అభియాన్ నుంచి కలిపి రూ. 65000 నిధులను మంజూరు చేసే వారు. ఇప్పుడు ఎస్ఎస్ఏ, ఆర్ఎంఎస్ఏ కలిపి సమగ్ర శిక్షా అభియాన్ పేరుతో ఏర్పాటైన నేపథ్యంలో కేంద్రం ఇచ్చే మ్యాచింగ్ గ్రాంట్స్‌కి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కేంద్రం తన వాటాగా రూ. 400 కోట్లు కేటాయించగా... రాష్ట్ర వాటా రూ. 240 కోట్లు ఇవ్వాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేవలం రూ. 46 కోట్లు మాత్రమే జమ చేసింది. దీంతో కేంద్రం నుంచి రావల్సిన నిధులు కాస్త ఆగిపోయాయి.

గ్రాంట్స్‌ను వెంటనే మంజూరు చేయాలి : గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఇవ్వాల్సిన గ్రాంట్స్‌ను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సింగిడి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. గత 7 నెలలుగా నిధులు ఇవ్వకపోవడంతో విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర వాటా నిధులు వేసి గ్రాంట్స్ రాబట్టాలి: టీఎస్ యూటీఎఫ్

సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా వచ్చే కేంద్ర నిధులు రావడానికి రాష్ట్ర వాటా నిధులు వేసి వెంటనే గ్రాంట్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు. గ్రాంట్స్ రాక విద్యార్థులు ఇబ్బందులెదర్కొంటున్నారని తెలిపారు.

శాస్త్రి డెత్ మిస్టరీపై సినిమా

న్యూఢిల్లీ: 2019 లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ రాజకీయ ప్రముఖుల బయోపిక్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ జీవితగాథ ఆధారంగా తెరకెక్కుతున్న ది యాక్సిడెంటర్ ప్రైమ్ మినిస్టర్ సినిమా ట్రైలర్‌పై తీవ్ర వివాదం నడుస్తుండగానే.. మరో మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జీవిత చరిత్ర ఆధారంగా బాలీవుడ్ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి ది తాష్కెంట్ ఫైల్స్ పేరుతో చిత్రాన్ని తీస్తున్నట్లు ప్రకటించారు. భారత్ రెండో ప్రధాని అయిన లాల్ బహదూర్ శాస్త్రి రష్యా పర్యటనకు వెళ్లి అక్కడే మరణించారు. జనవరి 10,1966లో శాస్త్రి రష్యాలో తాష్కెంట్ ఒప్పందంపై సంతకం చేసిన గంటలోనే మరణించడంపై ఎన్నో అనుమానాలున్నాయి. శాస్త్రి గుండె పోటుతో మరణించారని ప్రాథమికంగా నిర్ధారించినా.. ఇంకేదైనా కారణంతో ఆయన మృతి చెందారా అనే అనుమానాలు వ్యక్తమౌతున్న నేపథ్యంలో అగ్నిహోత్రి సినిమాపై ఆసక్తి నెలకొంది. ఎల్.బీ శాస్త్రి రష్యా పర్యటనలో ఏం జరిగింది.. చనిపోయియే ముందు శాస్త్రి ఎవరెవరిని కలిశారా...ఆయన మరణం వెనక కుట్ర కోణం ఏమైనా ఉందా అనే అంశాలను తీసుకుని చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ది తాష్కెంట్ ఫైల్స్ సినిమాలో ప్రముఖ నటులు నసీరుద్దీన్ షా, మిథున్ చౌదరి కీలక పాత్రలు పోషిస్తున్నాయి. ఫిబ్రవరి చివరి వారంలో లేదా మార్చి నెలలో ఈ సినిమా విడుదలకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు దర్శకుడు అగ్నిహోత్రి తెలిపారు.

కుటుంబీకులు కోరినా పోస్టుమార్టం చేయలేదు..

ఎల్.బీ శాస్త్రి మరణించిన వెంటనే శవపరీక్ష నిర్వహించాలని ఆయన కుటుంబీకులు నాటి తాత్కాలిక ప్రధాని గుల్జారీలాల్ నందాను అభ్యర్థించినా.. పోస్టుమార్టం జరగలేదని అగ్నిహోత్రి తెలిపారు.ఈ మిస్టరీని చేధించాలని భారత ప్రధానులైన ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలకు కూడా శాస్త్రి కుటుంబీకులు కోరినా ఫలితం దక్కలేదు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లోనే మాజీ ప్రధాని మరణానికి గల కారణాలు తెలిపే పత్రాలు లేకుంటే సామాన్యుల పరిస్థితేంటని డైరెక్టర్ అగ్నిహోత్రి ప్రశ్నించారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

సాహితీగవాక్షం

చెట్టు...పక్షి...భవబంధం!



బంధాల గ్రంథాలు పఠిస్తేనే
అనుబంధాల భాష్యాలు
అర్థమయ్యేది!
బంధాల ప్రబంధాలు లిఖిస్తేనే
జన్మ బంధాల భవబంధాలు
వెలుగుచూసేది!
బంధాల గంధాలు పూయిస్తేనే
మనసుల మకరందాలు
ఊటలై ఊరేది!
భావాల లావాలు పెల్లుబికితేనే
మనోభావాల ఉద్వేగాలు
సునామీలయ్యేది!
మనోగతాల శూన్యాన్ని
ఛేదిస్తేనే
జీవనవెలుగులు
విరబూసేది!
బాధ్యతల బాహువుల్లో
ఇమిడిపోతేనే
మనసుల మధ్య
వారధి నిర్మితమయ్యేది!
ఇవేవీ మాటలకందేవి కావు
మనసులకే చిక్కుకునేవి!
చెట్టుమీది పక్షిని చూస్తే
ఎవరికేమీ కానట్టే ఉంటుంది!
చెట్టుతో బంధమే లేనట్టుంటుంది
ఖాతరు చేయనట్టే కనిపిస్తుంది
కాని తాను నిల్చున్న కొమ్మకు
లోలోన రుణపడి ఉంటుంది!
ఆ భావనతోనే చెట్టుతో కన్నా
కొమ్మతో సన్నిహితమౌతుంది
చెట్టు విలువ తెలీదని కాదు!
చెట్టుకున్న చేతులు ముఖ్యమని
వాటి అవసరమింకా ఎక్కువని!
ఆ కొమ్మల రెమ్మల్నే
గూడుగా మల్చుకుంటుంది
ఆ రెమ్మలకున్న ఆకుల్నే
ఆహారం చేసుకుంటుంది!
చెట్టుతో నాకేమిటనుకుంటే
వీటికి దగ్గర కాగలదా?
బంధాల అస్తిత్వాన్ని
గుర్తించకుంటే
చెట్టుమీద నిలవగలదా!
నేనైనా నువ్వయినా
ఉన్నవారితోనే ఉన్నదంతా
అనుకుంటేనే జీవన ఆదరువు!
బాహుబంధాలైనా...రక్తసంబంధాలైనా
సుమగంధాలైనా...మకరందాలైనా
మనలో నుంచే పుట్టుకు రావాలి!
మనుషుల విలువలు తెలిస్తేనే
ఆ ఉరవడి వెల్లువలై వచ్చేది!

- వయ్యుస్సారెస్
9000013367

కవితల ప్రత్యేకం

మా మొలగొలుకులు



నెల్లూరు సీమమట్టిలో
ఏ తియ్యందనాలు ఉబికి వెల్లువలై
మొలకొలుకులై మొలకెత్తాయో ఏమోకాని
సత్తువనిచ్చే వరిపైరు మొలగొలుకులు!
నెల్లూరు తీపిజ్ఞాపకం మొలగొలుకులు
మొలగొలుకు వెన్నలతో
మాగాళ్లలో రాజసం ఉట్టిపడేది
నెల్లూరు మొలగొలుకులకు
మనిషిని మైమరపించే గుణం ఉండేది
ధైర్యాన్ని నింపే గొప్ప సుగుణం ఉండేది
పెన్నమ్మ నీటి మహిమ ఏపాటిదో
తెలియదు కాని
మొలగొలుక్కు తీపిని తెచ్చిపెట్టింది
మొలగొలుకుల అన్నాన్ని
నెల్లూరు చేపల పులుసుతో కలిపితింటే
స్వర్గమే భువిపై నాట్యం చేసేది
నెల్లూరు మొలగొలుకులకు
తెలుగువారి గోంగూర పట్టిస్తే
ఆ రుచి చెప్పనలివయ్యేది కాదు
పంటచేలు కల్లాంలో తిరిపెంగ ఇచ్చే
మొలగొలుకులు
బిచ్చగాళ్ల పాలిట సంక్రాంతులయ్యేవి!
మళ్లీ మొలగొలుకు పంట విస్తరిస్తే
సన్నాలు సన్నబడిపోతాయి
నెంబర్లు నెంబర్లాట ఆడేస్తాయి
నెల్లూరు 'పైరు'గాలికి ఏ సృజన తేమ
తగిలిందో ఏమోకాని తిక్కన చేత
మహాభారతాన్ని తెనిగింపజేశాయి
అమరజీవి గుండెల్లో త్యాగం నింపి
ఆంధ్రరాష్ట్రానికి బాటలు వేసాయి
ఓ జానెడు వెన్ను వరిపై ఊరేగినట్లు
ఊగుతుంటే-
నెల్లూరు పెద్దారెడ్డి కోడలేమో
డాబు చూపించినట్టు బడాయిపోయేది
మొలగొలుకు
మరో వెన్ను పచ్చపచ్చగా పైకి వస్తుంటే
రైతు కుటుంబాలు
మమతల మాగాణులయ్యేవి
నెల్లూరుకూ మొలగొలుక్కు
అనుబంధం ఇప్పటిదా?
బండ్ల మీద బస్తాలై మొలకొలుకులు
కులుకుతూ ఇంటికి వస్తుంటే
ధాన్యలక్ష్మి నడచి వస్తున్నట్టుండేది
నేలతల్లి స్తన్యంలో తీపిని మొలగొలుకు
గ్రోలిందేమో ఆ అద్భుత రుచి
అంగిట్లోకి జారి అమృతాన్ని అందించే మొలగొలుకు
రండి మళ్లీ మనం మొలగొలుకులవుదాం
చక్కగా కాసిన మాగాణులవుదాం
మొలకెత్తే కలుపును పీకేసి
స్వచ్ఛ నెల్లూరు బాటలు వేద్దాం!

- చిన్ని నారాయణరావు
9440202942

చైతన్య మోహం



మిత్రమా!
నేను కలల ముక్కల్ని ఏరుకొంటూ
జీవించడం మొదలపెట్టా
ఆశ శిరస్సు మీద
కాంతిమేకులు దింపుతోంది!
నీ కంఠస్వరం
ఎప్పుడూ లేనంత తియ్యగా
రగిలే అరణ్యాలు సెగగా
జీవితాన్ని భయపెడుతూ
చైతన్య మోహంతో
మిరుమిట్లు గొలుపుతుంది
ఎవరో కవాతు చేస్తున్న దృశ్యం
నా చెవుల్లోంచి, కళ్లలోంచి
కదిలిపోతుంటుంది
పులిపంజా నీడలో పాడిన పాట
దేశమంతా వ్యాపిస్తోంది
ఇప్పుడు నీకు ప్రతి చౌరస్తా కొత్తదే
వెతుకులాట కూడా కొత్తదే!

- యేటూరి నాగేంద్ర
7416665323

అసూయ

నువ్వొక మహావృక్షమైతే కావచ్చు
మొక్కలను కూడా ఎదగనివ్వు
ఎవరో పాదు చేసి, ఇన్ని నీళ్లు పోస్తుంటే
ఏడ్చి ఏడ్చి పాడు చేస్తావెందుకు?
ఏదో ఒకనాడు నువ్వు మోడువైతే
తీగెలా నిన్నల్లుకొని పచ్చదనం పులుముతుంది

నువ్వొక మహాసంద్రమైతే కావచ్చు
పొంగే వాగులను కుంగదీయకు



ఎండిన బీళ్లను చల్లబరుస్తుంటే
కుళ్లి కుళ్లి ఏడుస్తావెందుకు?
నీ మనసుకు పట్టిన మలినాన్ని
ఎప్పుడో ఒకప్పుడు కడిగి పారేస్తుంది

ఈ ప్రపంచమొక ప్రశాంత రంగస్థలం
ప్రవేశం నీ ఒక్కడి జన్మ హక్కు కాదు
పరిమళించే పువ్వులు, పారే సెలయేళ్లు
పరిచయం అవసరం లేని నీ సహచరులు
చేతనైతే చేయూతనిచ్చి చేరదియ్యి
చెలిమికి దూరమైతే చెదపురుగవుతావు

- బలభద్రపాత్రుని ఉదయ శంకర్
9494536524

కొత్త సన్నివేశం

అందరిలా బతకడం మాకెట్టా కుదిరుద్ది
మా జాతి అంగుట్లో
శవాక్షరాలు రాయబడ్డాయిగా
వేదంసాక్షిగా మా బతుకులు గిరిగీయబడ్డాయిగా



నీ కలంపోటు ఓ తీర్పై
మా గాయాలను కెలుకుతుంది
కత్తి మారణాయుధమైన చరిత్రలో
చిత్రంగా కలం కూడా
మా కుత్తుకలపై కత్తికడుతున్న
కొత్త సన్నివేశమిప్పుడు చూస్తున్నాం

జంతువులకు రాజపూజ్యాలు
ఆపాదించబడుతున్న కర్మభూమిలో
దాని పేడకడి దగ్గర
మా ప్రస్థానాన్ని పాతరేసుకుంటున్నాం

మీలా పంచభక్ష్యాలు మాకెట్టా వస్తాయి
మీలా పట్టుపరుపులు మాకెట్టా వస్తాయి
మీలా మీకుమల్లె
మా తాతలు లౌక్యం తెలియనోళ్లు
కాలికీ మెడకీ ముళ్లేసి
బతుకు వడుపు తెలుసుకోనోళ్లు
మీతో మాకెట్టా సాపత్యం

మేము గంజిమెతుకుల్లో
పచ్చిమిరపకాయ నంజుకుంటాం
పచ్చిపులుసులో

- కంఠ బంగార్రాజు
8500350464

నిరీక్షణ

అదో మారుమూల గ్రామం
కొన్ని వందల యేళ్ల కిందటి వటవృక్షం
నేనప్పుడో బచ్చాగాడిని
ఇప్పుడది మహావటవృక్షం
అయ్యి ఉంటుంది
స్వర్గం నుంచి
నిచ్చెనలు వేసినట్లు
వ్రేలాడే ఊడలు పట్టుకుని
ఊగినప్పుడే తెలుస్తుంది



కుహూ...కుహూ...రవాలతో
కోకిలలు కూసిన తీయని
స్వరామృత రసరాగాలు
ఇప్పటికీ నా చెవులలో
మారుమ్రోగుతూనే ఉన్నాయి.

ఈ యాంత్రిక నగర
రణగణధ్వనుల మధ్య
చిక్కుకున్న నాకు
ఇప్పుడా దృశ్యం
కళ్లల్లో సుళ్లు తిరుగుతుంటే
మరోసారి
ఆ మహావటవృక్షాన్ని
దర్శించుకోవాలన్న తపన
అనుక్షణికం
కలవరపరుస్తూనే ఉంది
ఆ రోజుకైనా నా నిరంతర నిరీక్షణ

- కె. హరనాథ్
9703542598

కవి కలం



అతని కవితలలో
ఏమిటా 'ఘోష'లు
బతుకుపోరులో
జనం 'గోస'లు

***

తన కవితల నిండా
ప్రజల ఆవేదనే!
జనగళమే
ఆ కవి కలం!!

***

తన కవితాశరం
ఎదను తాకింది
ఐనా మదిలో
మధుర భావనే

***

మనుషులకే
కులమతాలు
కలాలకుండవు
ఏ కమతాలు


***

కత్తితోనే కాదు
కలంతోను కొయ్యొచ్చు
కుత్తుకలను
పదాల్లో పదునుంటే!

- సిరా (సింగారపు రాజయ్య)
9945744332

పల్లెతల్లి

మనోమాలిన్యం కడిగేయి
మనసవుతుంది
మరకలు లేని
కాగితం



వెలితి కుండకే
కాదు మిత్రమా!
వెర్రి వాగుడుకూ
నిలకడుండదు.
అలలు జోకొడుతుంటే
హాయిగా, నిద్రపోతోంది
నదీ ఒడ్డున
నావ.

మమకారం మాటల్లో
ఉందా? మనిషివే!
సాయం చేతల్లో
ఉందా? మహాత్ముడివే!

పల్లె హాయిగా
నిద్రపోతోంది
చల్లగాలే కదా
జోలపాడే తల్లి

- ఎ. నాగాంజనేయులు
9959017179

నాన్న

నాన్న
ప్రపంచం మొత్తం
చూడగల్గుతున్నాను
నాన్నభుజం
ఎవరెస్టు శిఖరం!




పాదాలు జారుతున్నా
నిలబడి ఉన్నా
నాన్న చేయి భవితకు భరోసా!

చిట్టిపాదాలు
నాట్యం నేర్చుకుంటున్నాయి
నాన్న గుండె
నటరాజ నిలయం!

- డా॥ పెంకి. విజయ్‌కుమార్
9553392949

మరీ-చికలు



రంగూ వాసనా సరే
గులాబి ముల్లు
రుచి తెలుసా!

పాము ప్రాణం
చీమల
గుంపులో!

మరిపిస్తే
ఆగేవి ఎక్కిళ్లు
వెక్కిళ్లు ఆగవు

చావూ
ఓ అసమాపక క్రియే
యోధుడికి

అలలు
కడలి పిల్లడు రాసే
ఇంపోజిషన్.

-కర్లపాలెం హనుమంతరావు
8142283676

చెట్టు-పిట్ట-కవిత

పాట నేర్పి
పిట్ట ఎగిరిపోయింది



అటుకొన్ని ఇటు కొన్ని
ఆకులు రాల్చని కొమ్మలతో
ఆకాశం చీలినచోట నిలబడ్డది
ఒంటరిగా చెట్టు


చెట్టుకింద
తపతపరెక్కలాడిస్తూ
నీడలు

- నవీన్‌కుమార్
9951979399

దిశ

స్కూల్ బయట గాలిపటాలు
ఎగురవేస్తున్న చిన్న పిల్లవాడిని
హిమాలయాలు ఎక్కడున్నాయని అడిగాను?

పిల్లవాడన్నాడు అక్కడే అక్కడే
ఎక్కడైతే తన గాలిపటం ఎగురుతోందో
అక్కడే హిమాలయాలున్నాయని...



నేను స్వీకరించాను...
నాకు తొలిసారి తెలిసొచ్చింది
హిమాలయాలెక్కడున్నాయి అన్నది...

-హిందీమూలం: కేదార్నాథ్ సింగ్
తెలుగు:అఖిలాశ
7259511956

అత్తాకోడలు

పాతరోజులకి
నవవధువు ప్రొద్దునే అత్త చేతికిచ్చెను కాఫీ!
కొత్తకోడలు మురియ కాసులబేరెట్టె అత్తమ్మ!
కట్నపు తాలూకు బాకీకై పట్టుబట్టక, పతితో
పరవశముగా షికారుకెళ్లగ అనుమతించె!

ఇప్పటికి-
నవవధువు ప్రొద్దునే అత్తచేతికిచ్చెను కాఫీ!



కొత్తకోడలు మురియ కాసులబేరెట్టె అత్తమ్మ!
పతిమురిసి సహధర్మచారిణి ప్రేమను గని
పరవశమున షికారునకు గొనిపోయెన్ సతిన్!

- రవి పెంట్రాల

నల్లమొహం



ఒక స్వేదవాగు
సముద్రం నుంచి వేరుపడి
ఉప్పు వాము వరకు ప్రవహిస్తుంది
అలల కాళీ నడకన
దారంతా నీటి తడి
నేల గుండెని తాకి
దాహం తీరుస్తుంది తృప్తిగా...

కయ్యల నిద్రపొయ్యే
సముద్రం కరడు గట్టిపోతుంది
అయినా సముద్రపు పొగరు తగ్గదు
కణికలు కణికలుగా
నిప్పు కణికంత కిర్రెక్కి
ఉప్పగా నవ్వుతుంది
ఉప్పు రైతు రౌతులా
ఊపిరి పీల్చుకుంటాడు
ఎండలో కారిన చెమట తుడిచి...

నిప్పుకు పట్టదు కానీ
పరాయీకరణ నీడలో
ఉప్పుకు చెదపట్టింది
పారిశ్రామీకరణ దాడిలో
ఉప్పు కయ్య నల్లమొహమేసింది...!!

- డాక్టర్ పెరుగు రామకృష్ణ
9849230443

సాహిత్య వార్తలు

కొలకలూరి విశ్రాంతమ్మ పరిశోధన పురస్కారం-2019

ప్రతిష్టాత్మకమైన కొలకలూరి విశ్రాంతమ్మ పురస్కారం-2019కిగాను ముద్రిత పరిశోధనకు ప్రదానం చేయాలని నిర్ణయించాము. జనవరి2016 నుంచి 2018 వరకు ముద్రితమైన పరిశోధన గ్రంథాలను రచయితలుగానీ, ప్రచురణ కర్తలుగానీ మూడేసి ప్రతుల చొప్పున పంపగోరుచున్నాము. ఒకే రచయిత ఒకటి కంటే ఎక్కువ గ్రంథాలు ఎన్నయినా పంపవచ్చు. పురస్కారం పదివేల నగదు, శాలువ, మెమొంటో ప్రదానం చేస్తాం. చివరితేది 20-1-2019. ఫిబ్రవరి 26, 2019న హైదరాబాద్‌లో జరిగే సభలో పురస్కార ప్రదానం చేస్తాం. ముద్రిత గ్రంథాలు పంపవలసిన చిరునామా: డా. కొలకలూరి సుమకిరణ్, ప్రొఫెసర్, ఆంగ్ల శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి-517502, ఆం.ప్ర.

- డా. కొలకలూరి సుమకిరణ్
9963564664

కొలకలూరి భాగీరథీ విమర్శ పురస్కారం-2019

ప్రతిష్టాత్మకమైన కొలకలూరి భాగీరథీ పురస్కారం-2019కిగాను ముద్రిత విమర్శకు పురస్కారం ప్రదానం చేయాలని నిర్ణయించాము. జనవరి 2016నుంచి డిసెంబరు 2018 వరకు ముద్రితమైన విమర్శ గ్రంథాలను రచయితలుగానీ, ప్రచురణ కర్తలు గానీ మూడేసి ప్రతుల చొప్పున 20-1-2019లోగా పంపాలని కోరుతున్నాము. ఒకే రచయిత ఒకటి కంటే ఎక్కువ గ్రంథాలనైనా పంపవచ్చు. పురస్కారంగా పదివేల నగదు, శాలువ, మెమొంటో 26-2-2019న హైదరాబాద్‌లో జరిగే సభలో ప్రదానం చేస్తాం. గ్రంథాలు పంపవలసిన చిరునామా-ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, ఆంధ్రాచార్యులు, తెలుగు శాఖ, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి-517502.

- ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
9441923172

నాగభైరవ పురస్కారానికి విమర్శ గ్రంథాలకు ఆహ్వానం

డా॥ నాగభైరవ కోటేశ్వరరావు ప్రతిభా పురస్కారానికి 2014 జనవరి నుంచి 2018 డిసెంబర్‌లోపు ప్రచురించబడిన సాహితీ విమర్శ గ్రంథాలను ఆహ్వానిస్తున్నాం. ఒకే రచయిత రాసిన విమర్శ గ్రంథాలు లేదా విమర్శ వ్యాస సంపుటాలు మాత్రమే పరిశీలింపబడతాయి. నాలుగు ముద్రిత ప్రతులను 2019 జనవరి 31లోపు అందేలా పంపాలి. ఉత్తమ సంపుటికి ఫిబ్రవరి 24న నెల్లూరులో జరిగే 10వ నాగభైరవ అవార్డు సభలో బహుకరించబడతాయి. సంపుటాలు పంప వలసిన చిరునామా: చిన్నినారాయణరావు, ప్రధమ కార్యదర్శి, డా॥నాగభైరవ అవార్డు కమిటీ, డోర్ నెం. 27-1-171, శ్రీనికేతనమ్, ఆదిత్యనగర్, చిల్డ్రన్ పార్కు రోడ్, నెల్లూరు-524002, సెల్-9440202942

- చిన్ని నారాయణరావు- ప్రధాన కార్యదర్శి

బండ్లకు సహృదయ సాహితీ పురస్కారం

బండ్ల మాధవరావుకు రాసిన అనుపమకు ప్రధాన పురస్కారం, అనిల్ డ్యాని రాసిన ఎనిమిదవ రంగు, విల్సన్‌రావు కొమ్మవరపు రాసిన దేవుడు తప్పిపోయాడులకు ప్రోత్సాహక బహుమతులు లభించాయి. న్యాయ నిర్ణేతలుగా మాకినీడు విజయభాస్కర్, గుణాలు వ్యవహరించారు.

-వేదుల శ్రీరామశర్మ - అధ్యక్షులు, సహృదయ సాహితి

కవి సంధ్య -జైనీ ఫౌండేషన్ కవితల పోటీ

మార్చి 21 ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా కవిసంధ్య సాంస్కృతిక సంస్థ జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో కవితల పోటీ-2019 నిర్వహిస్తున్నది. కవిత్వంలో కొత్త తరాన్ని ప్రోత్సహించడం ఈ కవితల పోటీ ప్రధాన ఉద్దేశం. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరసగా 3000/-, 2000/-, 1000/-మరియు పది మంచి కవితలకు 500/- నగదు చొప్పున ఇవ్వబడతాయి. ఈ పోటీలో పాల్గొనదలచినవారు రూ. 200/-ఎంట్రీ ఫీజును ఎం.ఓ ద్వారా గానీ కవిసంధ్య అకౌంట్ నెం. 1557111-0000236/IFSCకోడ్...ANDB0001557కు గాని పంపాలి. పోటీలో బహుమతి పొందినవారి ఎంట్రీ ఫీజు కవిసంధ్య సంవత్సర చందాగా పరిగణించబడుతుంది. కవితలు పోస్టుద్వారాగానీ, కొరియర్ ద్వారాగానీ పంపాలి. కవితలు పంపడానికి చివరితేది 30, జనవరి 2019, చిరునామా-దాట్ల దేవదానం రాజు, ఉపాధ్యక్షులు, కవిసంధ్య, 8-1-048, జక్రియనగర్, యానాం-533404, తూ.గో.జిల్లా,ఎ.పి. సెల్. నెం. 94401105987

- దాట్ల దేవదానం రాజు
కన్వీనర్- కవితలపోటీ

ఆకాశవాణి జాతీయ కవిసమ్మేళనానికి డా॥సి. భవానీదేవి ఎంపిక

ఆకాశవాణి, ప్రసారభారతి జాతీయస్థాయిలో ప్రతిఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించి ప్రసారం చేసే జాతీయ కవి సమ్మేళనంలో భాగంగా 2019 సంవత్సరానికి జాతీయ కవిసమ్మేళనంలో తెలుగు కవిగా ప్రసిద్ధ కవయిత్రి, రచయిత్రి డా. సి.భవానీదేవి 'అమ్మ నిజం చెప్పదు' కవిత ద్వారా ఎంపిక అయ్యారు. 2019 జనవరి 10వ తేదీన చెన్నైలో జాతీయస్థాయి కవిసమ్మేళనంలో పాల్గొంటారు.

కావ్యపరిమళం

తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా 'కావ్యపరిమళం' పరంపరలో భాగంగా 11వతేదీన సాయంత్రం 6గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో డా॥ దాశరథి కృష్ణమాచార్య "అగ్నిధార" కావ్యంపై దేశపతి శ్రీనివాస్ ప్రసంగం ఉంటుంది. డా॥నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు.

- డా॥ఏనుగు నరసింహారెడ్డి
కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి

పెనుగొండలో 90 అడుగుల

కన్యకాపరమేశ్వరి పంచలోహ విగ్రహం

400 కిలోల వెండి రథం • రూ. 45 కోట్లతో ఆలయ అభివృద్ధి

• మీడియాతో మాజీ సీఎం కె.రోశయ్య



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని రూ.45 కోట్లతో అభివృద్ధి పరుస్తున్నట్టు మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కె.రోశయ్య తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన 90 అడుగుల అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. విగ్రహ నిర్మాణానికే రూ.15 కోట్లు వ్యయం కానుందన్నారు. 4వందల కిలోలతో అమ్మవారికి వెండి రథాన్ని కూడా ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే వాసవీ విశ్వవిద్యాలయం కూడా ఏర్పాటు కానుందని వెల్లడించారు. ఫిబ్రవరి 14న అమ్మవారి పంచ కలశ ప్రతిష్ఠాపన, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమ ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, కర్ణాటక సీఎం కుమారస్వామి, మాజీ పీఎం దేవేగౌడ తదితరులను ఆహ్వానించినట్టు తెలిపారు. 55 కిలోల పంచలోహంతో 90 అడుగుల ఎత్తున నిర్మిస్తున్న కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహం ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. ఫిబ్రవరి 11నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు 16న వసంతోత్సవం వరకూ కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అఖిల భారత శ్రీ వాసవి పెనుగొండ ట్రస్ట్ అధ్యక్షుడు డా.పి.ఎన్, గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి కె.ఆర్.కృష్ణ సతీష్ మూర్తి పాల్గొన్నారు.

కేటీఆర్‌వన్నీ అబద్ధాలే!

కేంద్రం రూ. 2 లక్షల కోట్లిస్తే పైసా ఇవ్వలేదంటారా : దత్తాత్రేయ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓట్లేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉంటే వారిని గందరగోళంలోకి నెట్టేసేందుకే తెరాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని సికింద్రాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన దత్తాత్రేయ కేంద్ర ప్రభుత్వంపై కేటీఆర్ చేసిన విమర్శలు పూర్తి అవాస్తవమన్నారు. నాలుగున్నర సంవత్సరాలలో తెలంగాణకు కేంద్రం నయాపైసా ఇవ్వలేదనడం సరైంది కాదని, రెండు లక్షల కోట్ల రూపాయలను వివిధ గ్రాంట్ల కింద కేంద్రప్రభుత్వం అందించిందని పేర్కొన్నారు. తెలంగాణలోని 11 సాగునీటి ప్రాజెక్టులకు, 24 గంటల విద్యుత్ సరఫరాకు వీలుగా ఉత్తర, దక్షిణ గ్రిడ్‌లను అనుసంధానం చేసేందుకు, యాదాద్రి పవర్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ. 50 వేల కోట్లు కేటాయించారని దత్తాత్రేయ గుర్తు చేశారు. ఎన్‌టీపీసీలో 4 వేల మెగావాట్లు, మహబూబ్‌నగర్‌లో వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును కేంద్రం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2400 కిలోమీటర్ల జాతీయ రహదారులుండగా వాటిని 5600 కిలోమీటర్లకు పెంచింది వాస్తవం కాదా అని అడిగారు. ఇందుకోసం కేంద్రం రూ. 60 వేల కోట్లను ఖర్చు చేస్తున్న విషయం తెలియదా అని నిలదీశారు. రామగుండంలో ఎరువుల కర్మాగారాన్ని తెరిపించామని, ఎయిమ్స్‌ను మంజూరు చేశారని తెలిపారు. ఇళ్ళు లేని పేదవారి కోసం రాష్ట్రా నికి 2.10 లక్షల ఇళ్ళను కేంద్రం మంజూరు చేసింది వాస్తవం కాదా అని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం వల్ల ప్రధాన మంత్రి సడక్ యోజన కింద రూ. 1700 కోట్లు వెనక్కి పోయే పరిస్థితి వచ్చిందని, దీనికి ఎవరు కారణమో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు.



యాదాద్రి పనులు వేగవంతం చేయాలి

• సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి

యాదగిరికొండ, ప్రభ న్యూస్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి ఆదివారం అధికారులను ఆదేశించారు. కొండ పైన జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. శిల్పాలు రూపొందించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధి పనులను చేపట్టిన వైటీడీఏ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనుల మందగమనం పై ఆయన ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అంతకు ముందు బాలాలయంలో శ్రీ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సమీక్షా సమావేశంలో వైటీడీఏ వైస్ ఛైర్మన్ కిషన్‌రావు, ఈఎన్‌సీ రవీందర్‌రావు, ఆర్ అండ్ బీ ఈఈ వసంతనాయక్, ఆలయ ఈవో ఎన్. గీతారెడ్డి పాల్గొన్నారు.

ఆ జాబితాలో సీఎం కూడా ఉన్నారు

డీజీపీ మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను వాడినందుకు రాష్ట్రం మొత్తం మీద 33 మంది నేతలకు నోటీసులిచ్చామని, వాహనాలలో వారు తిరిగిన మేరకు డబ్బులు కట్టాలని ఆదేశించామని డీజీపీ మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.నోటీసులందుకున్న వారిలో టీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్‌రావు, స్పీకర్ మధుసూధనాచారిలతో పాటు పలువురు మాజీ మంత్రులు, సీఎల్పీ నేత కె. జానారెడ్డి, మండలి విపక్ష నేత షబ్బీర్ అలీలతో పాటు బీజేపీ నేత కిషన్‌రెడ్డి, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఓవైసీ తదితరులున్నారు. రూ. 53 వేల నుంచి రూ. 7.7 లక్షల రూపాయలు చెల్లించాల్సిన వారు 33 మంది ఈ జాబితాలో ఉన్నారన్నారు.

బ్రాహ్మణుల కోసం కేసీఆర్ ఎన్నో పథకాలు

బేవరేజస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవి ప్రసాద్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలోని బ్రాహ్మణుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో పథకాలను అమలుచేస్తున్నారని బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవి ప్రసాద్ అన్నారు. కేసీఆర్ చేపట్టిన అనేక కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. ఆదివారం బ్రాహ్మణుల ఉద్యోగ సంఘాల డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. దీనిలో అతిథులుగా స్వామి సద్గురు సచ్చిదానంద సరస్వతి, బేవరేజేస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవి ప్రసాద్, ఎమ్మెల్యే డి. శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ ఎన్. రామచంద్రరావు సహా బ్రాహ్మణ ఉద్యోగ సంఘం ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవి ప్రసాద్ మాట్లాడుతూ..బ్రహ్మణ సంక్షేమ కార్యక్రమాల కోసం బ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి కెసీఆర్‌కే దక్కుతుందన్నారు. బ్రహ్మణ పరిషత్‌లో పేద బ్రాహ్మణులకు ఏఏ పథకాలు ఉన్నాయనే అంశాలను తెలియజేయాలని బ్రాహ్మణ ఉద్యోగ సంఘాన్ని ఆయన కోరారు. గచ్చిబౌలిలో ఐదు ఎకరాల్లో బ్రాహ్మణ కమ్యూనిటీ హాలును నిర్మిస్తున్నామని చెప్పారు. బ్రహ్మణులంతా ఐక్యంగా ఉన్నప్పుడే ముందుకు పోతారని ఆయన సలహా ఇచ్చారు. పోటీ పరీక్షల్లో పేద బ్రాహ్మణ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు బ్రాహ్మణ అధికారులు చొరవ చూపాలని సూచించారు.

ఆ ప్రొటెం స్పీకర్ ఉంటే ప్రమాణం చేయను

బీజేపీ ఎంఎల్ఏ రాజాసింగ్ సంచలన నిర్ణయం

హైదరాబాద్,ఆంధ్రప్రభ: మజ్లిస్ ఎంఎల్ఏ ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేయడంపై బీజేపీ ఎంఎల్ఏ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో అరాచకశక్తులుగా ఉన్న మజ్లిస్ ఎమ్మెల్యే ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించనున్న నేపథ్యంలో ప్రమాణ స్వీకారోత్సవానికి తాను దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సంచలన ప్రకటన చేశారు. మజ్లిస్‌కు చెందిన వ్యక్తికి ప్రొటెం స్పీకర్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఆ పార్టీకి తోడుగా ఉన్నట్లు తేటతెల్లమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటివారి సమక్షంలో తాను ప్రమాణస్వీకారం చేస్తేఎంఐఎం ఆగడాలకు మద్దతిచ్చినట్లవుతుందని, అందుకే ఆ ప్రమాణ కార్యక్రమానికి దూరంగా ఉంటానని తెలిపారు. పూర్తి స్థాయి స్పీకర్ బాధ్యతలు సీకరించాకే తాను ప్రమాణస్వీకారం చేస్తానని ప్రకటించారు. తనకు అందుతున్న సమాచారం ప్రకారం టీఆర్ఎస్‌కు చెందిన ఎంఎల్ఏ స్పీకర్‌గా, ఎంఐఎంకు చెందిన ఎంఎల్ఏ డిప్యూటీ స్పీకర్‌గా ఎంపికయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదే నిజమైతే డిప్యూటీ స్పీకర్ చైర్‌లో ఉన్న సమయంలో తాను అసెంబ్లీకి వెళ్ళనని రాజాసింగ్ పేర్కొన్నారు.

ఈవీఎంలను రద్దు చేయాలి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల విశ్వసనీయతకు విఘాతం కల్పిస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల వినియోగ పద్ధతిని రద్దు చేయాలని బ్యాక్‌వర్డ్ అండ్ మైనారిటీ కమ్యూనిటిస్ ఎంప్లాయిస్‌ఫెడరేషన్ (బామ్‌సెఫ్) డిమాండ్ చేసింది. ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బామ్‌సెఫ్ జాతీయ అధ్యక్షుడు వామన్ మిశ్రాంజి మాట్లాడుతూ ఎన్నికల్లో ఈవీఎంలు ప్రజల విశ్వసనీయతను కోల్పోయాయన్నారు. ఈవీఎంల ద్వారా జరిగే ఎన్నికల్లో ఫలితాల ట్యాంపరింగ్‌కు అవకాశాలు ఉన్నట్టు పలు సందర్భాల్లో రుజువైందన్నారు. బామ్‌సెఫ్ ప్రధాన కార్యదర్శి చింతల శ్రీకాంత్ మాట్లాడుతూ ఈవీఎంలు ట్యాంపరింగ్‌కు గురికావని ఎన్నికల సంఘం కూడా చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే 21 దేశాలు ఈవీఎంలను చెత్తబుట్టలో పడేశాయన్నారు. . ఈవీఎంలు ఏవిధంగా ట్యాంపరింగ్‌కు గురయ్యేది సచిత్రాల ప్రదర్శన ద్వారా వివరించారు.

సార్వత్రిక సమ్మెకు టీచర్ల మద్దతు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా 8, 9 తేదిల్లో కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ మధ్యాహ్న భోజన విరామ సమయంలో ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించినట్టు యూఎస్‌పీఎస్సీ నాయకులు తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, ధరల పెరుగుదలను నియంత్రించాలని నాన్ డిటెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.



ఎరిక్సన్ బకాయిలు తీరుస్తా:అనిల్ అంబాని

ముంబై : పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన రిలయన్స్ కమ్యూనికేషన్ ఛైర్మన్ అనిల్ అంబానీ స్విడిష్ టెలికం దిగ్గజం ఎరిక్సన్‌పై ఆదివారం ధ్వజమెత్తారు. సంచలనాల కోసం మీడియాను వినియోగించుకొని బకాయిలు రాబట్టుకోవాలనుకుంటోందని అనిల్ మండిపడ్డారు. దీంతో బ్యాంకుల ప్రయోజనాలు కూడా కొత్త దెబ్బతింటాయని చెప్పారు.ఎరిక్సన్ చెల్లించాల్సిన బకాయిలు పూర్తిగా చెల్లిస్తానని, తమ స్పెక్ట్రమ్ అమ్మకాలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వాటి అనుమతి లభించిన వెంటనే ఎరికసన్‌కు బకాయిలు పూర్తిగా చెల్లిస్తానని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గత శుక్రవారం నాడు ఎరిక్సన్ తమకు రావాల్సిన బకాయిలు రూ.550 కోట్లు చెల్లిస్తామని ఆర్ కామ్ హామీ ఇచ్చి మాట నిలబెట్టుకోలేదని సుప్రీంకోర్టు కెక్కారు. తమ బకాయిలు చెల్లిం చే వరకు అనిల్ అంబానీని సివిల్ జైల్లో పెట్టా లని కోర్టును కోరారు. అలాగే అంబానీని, రిలయన్స్ టెలికం లిమిటెడ్ ఛైర్మన్ సతీష్ సేథి, రిలయన్స్ ఇన్ ఫ్రాటెల్ లిమిటెడ్ ఛైర్‌పర్సన్ చాయ విరానీని దేశం నుంచి పారిపోకుండా హోంమంత్రిత్వశాఖకు ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును ఎరిక్సన్ కోరింది. ఇదిలా ఉండగా ఆర్‌కామ్ అధికార ప్రతినిధి మాట్లాడుతూ.. ఇటీవల ఎరికసన్ కోర్టులో వేసిన ధిక్కార పటిషన్ నోటీసు తమకు అందలేదని, ఈ విషయం మీడియాలో ప్రముఖంగా చోటుచేసుకుందన్నారు. కావాలని ఎరిక్సన్ మీడియాకెక్కి రాద్ధాంతం చేస్తోందన్నారు. ఇప్పటి వరకు సుప్రీంకోర్టు ఎరిక్సన్ లేవనెత్తిన అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదని ఆయన తెలిపారు. ఎరిక్సన్ తాజా లేవనెత్తిన అంశంతో ఆర్‌కామ్‌కు నిజాయితీగా రుణాలు ఇచ్చిన 38 బ్యాంకులు వాటిలో 17 పీఎస్‌యు బ్యాంకులు 13 విదేశీ బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

ఆర్థిక వ్యవస్థకు చమురు సెగ



● పెరిగిపోతున్న ధరతో.. ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు ● వృద్ధిరేటుపై ప్రభావం

● ఆర్బీఐ తాజా నివేదికలో వెల్లడి



ముంబై : ఇటీవల కాలంలో ముడిచమురు ధరలు తగ్గినట్టే తగ్గి తిరిగి పుంజుకోవడం పట్ల రిజర్వుబ్యాంకు ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చమురు ధరలు పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వంపై ప్రభావం చూపుతుందని.. ముఖ్యంగా కరెంటు ఖాతాలోటు పెరిగిపోవడంతో పాటు ద్రవ్యోల్బణం, వృద్ధిరేటుకు గండిపడుతుందని ఆర్‌బీఐ తాజా అధ్యయనంలో హెచ్చరించింది.

దేశీయ ఇంధన అవసరాలకు 80 శాతం వరకు దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని, ముడిచమురు ధరలు పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపతుందని నివేదికలో వివరించింది. ధరలు పెరిగితే ప్రధానంగా కరెంటు ఖాతాలోటు పెరిగిపోతుంది. ద్రవ్యోల్బణం పెరిగిపోవడంతో పాటు ద్రవ్యలోటు పెరుగుతుందని ఆర్‌బీఐ నివేదికలో వివరించింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ముడిచమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్లో 12 శాతం వరకు పెరిగాయి.

గత ఏడాది ద్వితీయార్ధంలో ముడిచమురు ధరలు పెరగడానికి ప్రధాన కారణం డిమాండ్ పెరగడమేనని తేల్చి చెప్పింది. దీంతో పాటు గ్లోబల్ వృద్ధిరేటు క్రమంగా పెరుగుతుందన్న అంచనాతో పాటు ప్రపంచంలోని కొన్ని దేశాల్లో ఏర్పడినే రాజకీయ సంక్షోభాల వల్ల ముడిచమురు సరఫరా తగ్గిందని దీంతో ధరలు పెరిగాయని పేర్కొంది. అయితే నవంబర్ నెల ద్వితీయార్ధం నుంచి ముడిచమురు ధరలు తగ్గడం ప్రారంభమైందని, అయినా ఇప్పటికి ఒడిదుడుకులు కొనసాగుతున్నాయని నివేదికలో వివరించింది.

ముడిచమురు ధరలు పెరిగితే కరెంటు ఖాతాలోటుపై ఒత్తడి పెరుగుతుందని, (క్యాడ్.. దేశంలోకి వచ్చే విదేశీ మారకద్రవ్యం.. దేశం నుంచి తరలిపోతున్న విదేశీ మారకద్రవ్యానికి మధ్య వ్యత్యాసమే క్యాడ్.. లేదా కరెంటు ఖాతాలోటు) అని గుర్తించుకోవాలి. క్యాడ్ పెరగడమే కాకుండా జీడీపీ వృద్ధిరేటుపై ప్రభావం చూపుతుంది. ముడిచమురు ధరలు పెరగడంతో జీడీపీలో క్యాడ్ నిష్పత్తి పెరుగుతుందని.. ఆర్‌బీఐ తాజాగా విడుదల చేసిన 'ముడిచమురు ధరల ప్రభావం క్యాడ్, ద్రవ్యోల్బణం, ద్రవ్య లోటు' అనే నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను రిజర్వుబ్యాంకు చెందిన ఆర్థికవేత్తలు అధ్యయనం చేశారు.


ఒక వేళ ముడిచమురు ధరలు పీపా 85 డాలర్లకు చేరితో జీడీపీ వృద్ధిరేటుపై 43 బేసిస్ పాయింట్ల ప్రభావం చూపుతుందని, చమురు బిల్లు ఏకంగా 106.4 బిలియన్ డాలర్లు చేరుతుందని, ఈ మొత్తం చూస్తే దేశ జపీడీలోకి 3.61 శాతానికి చేరుతుందని నివేదికలో వివరించింది.

ముడిచమురు ధర పీపాకు 10 డాలర్లు పెరిగితే అదనంగా 12.5 బిలియన్ డాలర్ల లోటు ఏర్పడుతుంది. దీని ప్రభావం దేశ జీడీపీపై 43 పాయింట్లు ఉంటుందని పేర్కొంది. ప్రతి పీపా పది డాలర్లు పెరిగితే జీడీపీలో క్యాడ్ నిష్పత్తి 43 పాయింట్లు పెరుతుందని నివేదికలో తెలిపింది.

ద్రవ్యోల్బణంపై ప్రభావం : తాజా అధ్యయనంలో ఒక వేళ ముడిచమురు ధరలు పెరిగితే దాని ప్రభావం ద్రవ్యోల్బణంపై పడుతుందని, ధరలు పెరిగితే అదే నేరుగా వినియోగదారుడిపై ప్రభావం చూపుతుందని వెల్లడించింది. తమ అంచనా ప్రకారం తక్కువలో తక్కువ పీపా పది డాలర్లు పెరిగి.. పీపా 65 డాలర్లకు చేరితే ద్రవ్యోల్బణం 49 బేసిస్ పాయింట్లు పెరుగుతుందని అంచనా వేసింది. ఒక వేళ పీపా 55 డాలర్లు పెరిగితే ద్రవ్యోల్బణం 58 బేసిస్ పాయింట్లు పెరుగుతుందని వెల్లడించింది.

ఒక వేళ ధరలు పెరిగినా.. వినియోగదారుడిపై పడకుండా ప్రభుత్వమే భరిస్తే.... ఉదాహరణకు పీపాకు 10 డాలర్లు పెరిగితే దాని ప్రభావం ద్రవ్యలోటుపై 43 బేసిస్ పాయింట్లు ప్రభావం చూపుతుందని తెలిపింది. ఒక వేళ ముడిచమురు ధరలు పెరిగినా.. వాటిని వినియోగదారుడిపై రుద్దకుండా ప్రభుత్వమే భరిస్తే ద్రవ్యలోటు భారీగా పెరిగిపోతుందని వివరించింది. అయితే ప్రభుత్వం ఎంత వరకు భరిస్తుందనే దానిపై వాస్తవ ద్రవ్యోల్బణం.. ద్రవ్యలోటు ఆధారపడి ఉంటుందని, (పన్నుల్లో మార్పులు - సబ్సిడీ) తదితర అంశాలపై కూడా ఆధారపడి ఉంటుందని ఆర్‌బీఐ తాజా అధ్యయనంలో వివరించింది.

ఆంధ్రాబ్యాంక్ బిజినెస్ కరస్పాండెట్ల నియామకం



హైదరాబాద్ : ప్రభుత్వరంగానికి చెందిన ఆంధ్రాబ్యాంకు వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి 1,600 బిజినెస్ కర్పస్పాండెట్లను (బీసీ)లను నియమించుకుంది. వీరి ద్వారా ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగణాల్లో మారుమూల ప్రాంతాల్లో కూడా బ్యాంకు సేవలను విస్తరిస్తుంది. వాటిలో భాగంగా ఖాతాలు తెరిపించడం, ఇంటివద్దనే బ్యాంకింగ్ సేవలందించడం, ఏటీఎం సేవలందించడం, మొండిబకాయిలు వసూలు చేయడం తదితర అంశాలను బీసీలు చూస్తారు. కాగా బ్యాంకు 2010 నుంచి ఫైనాన్షియల్ ఇంక్లూజెన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. తాజాగా అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని మైక్రో ఎటీఎంలు/ కియాస్క్ సేవలందిస్తోంది. ఈ బీసీలు ఆర్థికసేవలతో పాటు ఆర్థికేతర లావాదేవీలను కూడా చూస్తారు. ఉదాహరణకు బ్యాంకు మొండి బకాయిలు వసూలు చేయడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక భద్రత స్కీంలలో పేర్లు నమోదు చేయించడం, బ్యాంకు కొత్త వ్యాపారాలకు విస్తృత ప్రచారం కల్పించడం తదితర అంశాలను కూడా బీసీలు చేపడతారు. దీంతో పాటు ప్రభుత్వం పథకాలు.. ఆధార్‌తో మొబైల్, పాన్‌కార్డు అనుసంధానం చేయించడం, బీమా పాలసీ అమ్మకా లు, బ్యాంకుల్లో వచ్చే కొత్త స్కీంల గురించి ఎప్పటికప్పుడూ ఖాతాదా రులకు వాటిపై అవగాహన కలిగించడం తదితర పనులు వీరు చేపడతారు.

2018 మ్యూచువల్ ఫండ్స్ ఆస్తులు

రూ. 1.24 లక్షల కోట్లు పెరిగాయి

న్యూఢిల్లీ : రోజు రోజుకు మ్యూచువల్‌ఫండ్స్‌కు ఆదరణ పెరుగుతోంది. 2018లో ఏకంగా రూ.1.24 లక్షల కోట్ల ఆస్తులు పెరిగాయి. సిప్ నుంచి పెట్టుబడులు పెరగడంతో పాటు రిటైల్ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో ఎంఎఫ్‌లలో పెట్టుబడులు పెట్టడమే దీనికి కారణం. అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఏయుఎం) కింద గత ఏడాది ఏకంగా రూ.1.24 లక్షల కోట్లు పెరిగి డిసెంబర్ చివరి నాటికి ఎంఎఫ్ ఆస్తులు రూ.23.61 లక్షల కోట్లకు ఎగబాకాయి. అంతకు ముందు అంటే డిసెంబర్ 2017 చివరి నాటికి ఇవి రూ.22.37 లక్షల కోట్లుగా నమోదైందని అసోసియేషన్ ఆఫ్ మ్యుచువల్‌ఫండ్స్ ఇన్ ఇండియా (ఎఎంఎఫ్ఐ) గణాంకాలు తెలియజేస్తున్నాయి. అయితే 2017లో పోల్చుకుంటే 2018లో ఏయూఎం తగ్గినట్లే భావించాల్సి ఉంటుంది. 2017లో మ్యుచువల్‌ఫండ్స్‌లోకి ఏకంగా 5.4 లక్షల కోట్లు అదనపు పెట్టుబడులు రావడంతో 32 శాతం వృద్ధి కనిపించింది. పెట్టుబడులు తగ్గడానికి మార్కెట్లు ఒడిదుడుకులకు గురికావడంతో పాటు ఐఎల్‌అండ్ఎఫ్ఎస్ డిఫాల్ట్‌తో పాటు ఎన్‌బీఎఫ్‌సీ రంగం నగదు కటకట ఏర్పడ్డం తదితర అంశాలే కారణాలని ఈ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు.

బ్యాంకుల్లో కొలువులే కొలువులు



న్యూఢిల్లీ : ప్రభుత్వరం గానికి చెందిన బ్యాంకుల్లో రాబోయే రోజుల్లో పెద్దెత్తున రిటైర్మెంట్‌ల ద్వారా పెద్ద మొత్తంలో ఖాళీలు ఏర్పడు తున్నాయి. వాటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్‌లో నియామకాలు చేపట్టబోతోంది. ఖాళీల విషయానికి వస్తే 95 శాతం ఖాళీలు జీఎం స్థాయిలో ఉంటే, 75 శాతం డిప్యూటీ జీఎం స్థాయిలో ఉంటాయి. 58 శాతం అదనపు జీఎం స్థాయిలో ఉంటాయని వీరంతా 2019-20 నాటికి రిటైర్మెంట్ అవుతారు. వీరితో పాటు క్లరికల్, ప్రొబేష నరీ ఆఫీసర్, స్పెషలిస్టు ఆఫీసర్ హోదాల్లో కూడా ఖాళీలు ఏర్పడతాయని ఇన్సిస్ట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సొనల్ సెలక్షన్ నుంచి అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. పార్లమెంటరీ ప్యానెల్ నివేదిక ప్రకారం బ్యాంకు కొలువులకు అభ్యర్థులు పెద్దగా ఆసక్తి చూపడానికి ప్రధాన కారణం. పని ఒత్తడి ఎక్కువ కావడంతో పాటు పనిగంటలు ఎక్కువ, దీని తగ్గట్టు జీతాలు / ఇన్సెంటివ్ ప్యాకేజీ ప్రోత్సహకరంగా లేకపోవడంతో బ్యాంకు ఉద్యోగాలు ఆకర్షణీయంగా లేవని గత వారం పార్లమెంటుకు సమర్పించిన పార్లమెంటరీ ప్యానెల్ నివేదికలో పేర్కొన్నారు. ఈ ప్యానెల్‌కు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎం వీరప్పమొయిలీ నేతృత్వం వహించారు. పీఎస్‌యు బ్యాంకులో సమీప భవిష్యత్తులో పెద్దమొత్తంలో ఖాళీలు ఏర్పడ్డం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

విదేశీ పీఎస్‌యు బ్యాంకుల్లో కోత

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన విదేశీ బ్రాంచీల కోతకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వచ్చే కొన్ని నెలల్లో 69 బ్రాంచీలను మూసివేసి ఖర్చును తగ్గించుకోవాలనుకుంటోంది. గతేడాది 216 పీఎస్‌యు బ్యాంకులను మూసివేయాలని ప్రభుత్వం అధ్యయనం చేసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. సమీక్ష తర్వాత ఇప్పటికి 35 విదేశీ బ్యాంకులను మూసివేయడం జరిగింది.. త్వరలోనే మరో 69 బ్యాంకులను మూసివేసే ఆలోచనలో ఉన్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. లాభదాయకం కానీ బ్యాంకులను మూసివేయడంతో పాటు ఒకే నగరంలో పలు బ్రాంచీలు ఉండి లేదా ఒకే నగరంలో దగ్గర దగ్గరగా బ్రాంచీలు ఉంటే కూడా బ్రాంచీలను మూసివేయాలని నిర్ణయించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. జనవరి 31,2018 నాటికి విదేశాల్లో 165 పీఎస్‌బీ బ్యాంకులు పనిచేస్తున్నాయి. దీంతో పాటు అనుబంధ బ్యాంకులు, భాగస్వామ్యంతో చేపట్టిన రెప్రజెంటెటివ్ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. అత్యధికంగా ఎస్‌బీఐకి 52 బ్రాంచీలు ఉంటే, బ్యాంకు ఆఫ్ బరోడాకు 50, బ్యాంకు ఆఫ్ ఇండియాకు 29 బ్రాంచీలున్నాయి. బ్రిటన్‌లో 32, హాంకాంగ్, యూఏఈలో చెరో 13, సింగపూర్‌లో 12 బ్రాంచీలు పనిచేస్తున్నాయి. 2016-17 లో మొత్తం 41 బ్రాంచీలు నష్టాలను చవిచూశాయి. అన్నీ ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులు ఉదాహరణకు అలహాబాద్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్‌బరోడా, బ్యాంకు ఆఫ్ ఇండియా, కెనెరాబ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు, ఇండియన్ ఒవర్‌సీస్ బ్యాంకు, పంజాబ్ నేషనల్ బ్యాంకు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకులకు విదేశాల్లో బ్రాంచీలున్నాయి. ఈ బ్యాంకులన్నీ కలిసి ఒక నోట్ తయారు చేసి విదేశాల్లో బ్రాంచీలను తగ్గించుకోవాలనే నిర్ణయానికి వచ్చాయని చెబుతున్నారు.

షిండ్లేర్ ఆర్ అండ్ డీ హబ్



ముంబై : స్విస్‌కు చెందిన ఎస్కేలేటర్, ఎలివేటర్ దిగ్గజం షిండ్లేర్ భారత్‌లో గ్లోబల్ మాన్యూఫ్యాక్చరింగ్ హబ్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు కంపెనీ అధికారి తెలియజేశారు. షిండ్లేర్ గత 20 సంవత్సరాల నుంచి భారత్ మార్కెట్లో వ్యాపారాలు కొనసాగిస్తోంది. ఇక్కడే పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి.. డిజిటైజేషన్‌తో పాటు డేటా ఎనలిటిక్స్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. కాగా ప్రభుత్వం విమానాశ్రయాలతో పాటు మెట్రో, రైల్వేలపై పెద్దమొత్తంలో వ్యయం చేస్తుండటంతో దీన్ని అవకాశంగా తీసుకొని తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆలొచిస్తున్నట్లు కంపెనీ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అశోక్ రామచంద్రన్ చెప్పారు. అలాగే రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌తో పాటు వాణిజ్య సెగ్మెంట్‌లో కూడా ఎలవేటర్స్, ఎస్కలేటర్స్‌పై పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో ఎలివేటర్స్‌లు, ఎస్కలేటర్స్ ఏడాదికి 80వేల యూనిట్ల డిమాండ్ ఉంటుందని.. వాటిలో 10వేల యూనిట్లు మాన్యువల్‌గా వినియోగించే లిఫ్టులున్నాయన్నారు.

ఈ 70వేల యూనిట్లే కాకుండా అసంఘటితరంగంలో కూడా ఎలవేటర్స్ అమ్మకా లు జరుగుతున్నా యని, రాబోయే సంవత్సరాల్లో దీని మార్కెట్ సైజు లక్ష యూనిట్లకు చేరుతుందని రామచంద్రన్ అభిప్రాయ పడుతున్నారు. స్థానికంగా అమ్మకాలు పెంచుకోవడానికి పూనేలో ఉన్న ప్లాంట్‌ను మరింత మెరుగు పరుస్తామన్నారు. ప్రస్తుతం ఇక్కడ ఏడాదికి 10వేల యూనిట్లను ఉత్పత్తి చేయడం జరుగుతోందన్నారు. ఇక ఎగుమతుల గురించి వివరిస్తూ.. భారత్ నుంచి బంగ్లదేశ్, శ్రీలంకకు ఎగుమతి చేస్తున్నామని.. ఇక నుంచి మధ్యప్రాచ్య దేశాలతో పాటు ఆఫ్రికా దేశాలకు ఎగుమతులు చేయనున్నట్లు ఆయన వివరించారు. స్కిల్ ఇండియా లో భాగంగా యూనివర్శిటీ ట్రెయినింగ్ సెంటర్‌తో పాటు ఉద్యోగులతో పాటు ఇతరులకు నాణ్యత ప్రమాణాలతో పాటు భద్రతపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

లౌరేటి నుంచి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ డియాన్ ఎక్స్



న్యూఢిల్లీ : లండన్‌కు చెందిన లౌరేటి ఆటోమెటివ్ కార్పొరే షన్ భారత్ మార్కెట్లో 2021 నాటికి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ డియాన్ ఎక్స్‌ను విడుదల చేయాలనే ఆలోచనలో ఉంది. దీనికి కోసం పుదుచ్చేరి ప్లాంట్‌పై 370 మిలియన్ డాలర్లు లేదా రూ.2,577కోట్లు పెట్టుబడులు పెట్టి తయారీప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఏడాదికి 10వేల యూనిట్లను ఉత్పత్తి చేయాలనే ఆలోచనలో ఉంది. 2023 నాటికి వీటిని 20వేల యూనిట్లకు విస్తరిస్తుంది. పుదుచ్చేరిలోని విడిభాగాలను ఉత్పత్తి చేయడంతో పాటు స్థానికంగానే అసెంబ్లింగ్ చేస్తుంది. 2021 మూడవ త్రైమాసికం నుంచి వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభిస్తుందని లౌరెటి ఆటోమొటివ్ కార్పొరేషన్ సీఈవో మార్కస్ పాలేట్ చెప్పారు. ఇక ఫీచర్ల విషయానికి వస్తే సింగిల్ చార్జితో 540 కిలోమీటర్లు ప్రయాణం చేస్తుంది. భారత్ మార్కెట్‌తో పాటు యూరోపియన్ మార్కెట్ కోసం 2021లోనే ఒకేసారి రెండు మార్కెట్లో విడుదల చేస్తుం ది. ఈ కారు ధర గురించి అడిగినప్పుడు సుమారు రూ.40 లక్షల వరకు ఉంటుందని చెప్పారు. కేవలం 5.4 సెకన్లలో 0-100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీనికి అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేసినట్లు సీఈవో వివ రించారు. సింగిల్ చార్జీతో 540 కిలోమీటర్లు ప్రయా ణిస్తుందా లేదా అని ఈ ఏడాది ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తుంది. 12 చార్జీలతో మొత్తం 6,000 కిలోమీ టర్లు ప్రయాణి స్తుందా లేదా అని చూస్తున్నామని, ముఖ్యంగా లెహ (జమ్ము -కాశ్మీర్) నుంచి చెన్నై తమిళనాడు వరకు దారి మధ్యలో ఉండే నగరాల ద్వారా ఈ కారును పరీక్షిస్తామని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభు త్వాల సహకారంతో చార్జింగ్ స్టేషన్‌లను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కేంద్రప్రభు త్వం దేశవ్యాప్తంగా లక్ష చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపుదిద్దుతుందని తమ కంపెనీ కూడా దీనికి చేయూనిస్తుందని మార్కస్ చెప్పారు. ప్రస్తుతం లౌరేటి ఆపరేషన్ డిజైన్, ఆర్‌అండ్‌డి, ప్రొటోటైపింగ్ బ్రిటన్, స్పెయిన్‌లో చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ వారం మార్కెట్

ఫలితాలు గణాంకాలు కీలకం

ముంబై : ఈ వారం స్టాక్ మార్కెట్లకు కీలకం కానున్న అంశాల విషయానికి వస్తే.. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం ఫలితాల బోణి మొదలుకానుంది. ముందుగా టీసీఎస్, ఇన్ఫోసిస్ ఫలితాలతో క్యూ3 ఫలితాల సీజన్ మొదలవుతుంది. దీంతో పాటు అమెరికా - చైనాల మధ్య వాణిజ్య చర్చలు దేశీయ మార్కెట్లను ముందుకు నడుపుతాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక దేశ సూక్ష్మ ఆర్థిక గణాంకాల విషయానికి వస్తే ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు కీలకం కానున్నాయి. ఈ వారంలోనే తయారీరంగానికి చెందిన పీఎంఐ గణాంకాలతో పాటు పారిశ్రామికోత్పత్తి గణాంకాలు, ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడనున్నాయి. దీంతో మార్కెట్లు ఒడిదుడకులకు గురయ్యే అవకాశాలను కొట్టిపారేయలేమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ నెల 10వ తేదీన జీఎస్టి కౌన్సిల్ సమావేశం జరగనుంది. దీంతో పాటు డాలర్ మారకంతో రూపాయి, ముడిచమురు ధరలు, విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్లో పెట్టే పెట్టుబడులు మార్కెట్లపై ప్రభావం చూపనున్నాయి. ఈ వారంలోనే పారిశ్రామికోత్పత్తి గణాంకాలు వెలువడనున్నాయి. దీని ప్రభావం మార్కెట్లపై ఖచ్చితంగా ఉంటుంది. చైనా -అమెరికాల మధ్య వాణిజ్య చర్చలు జరుగనున్నాయని వార్తలు రావడంతో గత శుక్రవారం నాడు గ్లోబల్ మార్కెట్లు పుంజుకున్నాయి. ఈ వారం ప్రారంభంలో అమెరికా అధికారులు చైనాకు పర్యటించి ముఖాముఖి వాణిజ్య చర్చలు మొదలుపెడతారు. ఇరు దేశాల అధ్యక్షులు, ట్రంప్, జిన్‌పింగ్ వాణిజ్య యుద్ధానికి తెరదించుతామని ఒక అంగీకారానికి వచ్చారు. కాగా గత వారం సెన్సెక్స్ 381.62 పాయింట్ల వరకు నష్టపోయింది.

రూ.83వేల కోట్లు వెనక్కి

● 2018లో విదేశీ పెట్టుబడులు

● ముడి చుమురు ధరలు, రూపాయి పతనమే కారణం



న్యూఢిల్లీ : విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్‌పీఐ)లు 2018లో దేశీయ క్యాపిటల్ మార్కెట్ నుంచి రూ.83వేల కోట్లు తరించుకు పోయారు. అంతకు ముందు ఏడాది రికార్డుస్థాయిలో రూ.2 లక్షలకోట్ల వరకు దేశీయ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాయి. అమెరికా సెంట్రల్ బ్యాంకు .. ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లు పెంచడం, గ్లోబల్ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడం, డాలర్ మారకంతో రూపాయి బలహీన పడ్డం తదితర కారణాల వల్ల ఎఫ్‌పీఐలు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులు ఉపస ంహరించారు. ఈ ఏడాది 2019 విషయానికి వస్తే పెట్టుబడులు పరిమితి స్థాయిలోనే రావచ్చునని మార్కెట్ విశ్లేషకులు చెబుతు న్నారు. ఎందు కంటే వచ్చే వేసవిలో జరిగే ఎన్నికల తర్వాత కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పడే వరకు పరిస్థితులు ఇలానే ఉండవచ్చునని వారు అభిప్రాయప డుతున్నారు. విదేశీ పోర్టుపో లియో ఇన్వె స్టర్లు గత ఏడాది మొత్తానికి రూ.83,146 కోట్లు దేశీయ క్యాపిటల్ మార్కెట్ నుంచి తరలించుకు పోయారు. వాటిలో రూ.33,533 కోట్లు ఈక్విటి మార్కెట్ నుంచి రూ.49,593 కోట్లు డెట్ మార్కెట్ నుంచి ఉపసంహరించినట్లు డిపాజిటర్స్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఎఫ్‌పీఐ పెట్టుబడుల విషయానికి వస్తే 2002 తర్వాత ఈ స్థాయిలో పెట్టుబడులు తరలిపోవడం ఇదే మొదటిసారి. ఇక విదేశీ ఇన్వెస్టర్ల విషయానికి వస్తే 2017లో రూ.51వేల కోట్లు పెట్టుబడులు పెడితే.. 2016లో రూ.20,500 కోట్లు, 2015లో రూ.17,800 కోట్లు, 2014లో రూ.97వేల కోట్లు, 2013లో రూ.1.13 లక్షల కోట్లు రూ.2012లో 1.28 లక్షల కోట్లు దేశీయ మార్కెట్లో పెట్టబడులు పెట్టాయి. అంతకు ముందు అంటే 2011లో ఎఫ్‌పీఐలు దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడులు తరలించుకు పోగా.. అంతకు ముందు 2008లో కూడా పెద్ద మొత్తంలో షేర్లు విక్రయించి తమ పెట్టుబడులు తరలిచుకుపోయినట్లు రికార్డులు చెబుతున్నాయి. డెబిట్ మార్కెట్ విషయానికి వస్తే 2016లో రూ.43,600 కోట్లు ఉపసంహరించుకోగా.. అటు తర్వాత 2017లో రూ.1.5 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు తరలించాయి. 2018 ప్రారంభంలో పెద్దమొత్తంలో పెట్టుబడులతో మొదలుపెట్టినా.. తర్వాత తర్వాత పరిస్థితులు మారిపోవడంతో ఎఫ్‌పీఐలు పెట్టుబడులు ఉపసంహరించారు. గ్లోబల్ మార్కెట్లు బలహీనంగా ట్రేడ్ కావడంతో పాటు కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాలికానికి క్యాపటిల్ గెయి న్ టాక్స్‌ను ప్రవేశపెట్టడం తదితర కారణాల వ ల్ల విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్ల నుంచి క్రమంగా పెట్టుబడులను ఉపసంహరించడం మొదలు పెట్టారని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

అయ్యప్ప దర్శనానికి వెళ్తూ...
అనంతలోకాలకు





సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి

తమిళనాడులోని పుదు కొట్టై వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లాకు చెందిన 10 మంది అయ్యప్ప భక్తులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంతాపం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

దుర్ఘటన పట్ల మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతదేహాలను స్వస్థలానికి పంపడానికి సహాయ పడాలని కలెక్టర్‌ను హరీష్‌రావు కోరారు.

జగన్ విచారం

అయ్యప్ప భక్తులు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందడం పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాం తి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

(మొదటిపేజీ తరువాయి)

శబరిమలై ఆలయానికి వెళుతుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మృతులంతా తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లా వాసులుగా గుర్తించారు. పుదుకొట్టై సమీ పంలోని జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనాస్థలిలో ఏడుగురు మృతి చెందగా పుదుకొట్టై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మృతి చెందారు. మృతుల్లో ఒక్కరు మినహా అందరూ పాతికేళ్లలోపువారే. చేతికందివచ్చిన కుమారులు ఇలా ప్రాణాలు కోల్పోవడంతో ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి.

మృతుల వివరాలు...

మృతులు మెదక్ జిల్లా నర్సాపూర్, హత్నూర్ మండ లాల్లోని ఖాజీపేట, మంతూర్, రెడ్డిపల్లి, చిన్న చింతకుంట, మంగాపూర్ గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులుగా గుర్తిం చారు. మృతులను నాగరాజు(35), మహేష్(28), కుమార్ (22), శ్యా మ్(22), ప్రవీణ్(22), సురేష్(25), కృష్ణ(35), సాయి(22), ఆంజనేయులు (25), వ్యాన్ డ్రైవర్ మృతి చెందినట్లుగా పోలీసులు గుర్తించారు. ఘటనాస్థలిని జిల్లా కలెక్టర్ గణేష్ పరి శీలించారు. సహాయక చర్యలు కొనసాగు తున్నాయి. ప్రమా దంలో తీవ్రంగా గాయపడి తిరుమయం ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న ఐదుగురు క్షతగాత్రులు వెంకటేశ్వర్లు, రాజీ, నరేష్బా, మాగోలి శ్రీశైలంలుగా పోలీసులు గుర్తించారు. వీరిలో నలు గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. తమిళనాడు ఆరోగ్య శాఖ మంత్రి విజయ్ భాస్కర్ బాధితులను పరామర్శిం చారు.



నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద రోదిస్తున్న మృతుల బంధువులు

తెలంగాణ అధికారులు ఆరా..

ప్రమాద ఘటనకు సంబంధించి సమాచారం తెలిసిన వెంటనే తెలంగాణ అధికారులు తమిళనాడు అధికారులతో మాట్లాడారు. మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి పుదుకొట్టై జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరారు. ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని కలెక్టర్ ధర్మారెడ్డి తెలిపారు. అయితే మృతిచెందిన అయ్యప్ప భక్తులకు వారి బంధువులు వచ్చిన తరువాతే పోస్ట్‌మార్టమ్ నిర్వహిస్తారని, తాము తమిళనాడు ప్రభు త్వంతో సంప్రదిం పులు చేస్తున్నట్లు కలెక్టర్ ధర్మారెడ్డి తెలి పారు. బంధువులను తమిళనాడు పంపడా నికి కూడా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

మిన్నంటిన రోదనలు

నర్సాపూర్ మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఖాజిపేట, మంతూర్, చిన్నచింతకుంట, రెడ్డిపల్లిగ్రామా ల్లో విషాధఛాయలు నెలకొన్నాయి. మృతుల వార్త విని కుటుంబ సభ్యులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున నర్సా పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. దీంతో పోలీస్ స్టేషన్ ప్రాంతమంతా రోదనలతో నిండి పోయింది. ఒకే సారి ఇంత మంది చనిపోవ డంతో జిల్లాప్రజలను షాక్‌కు గురిచేసింది.

తమిళనాడుకు ప్రత్యేక బృందం

మృతదేహాలను స్వస్థలానికి తీసుకు వచ్చేందుకు తెలంగాణ సర్కార్ ఏర్పాటు చేసింది. ప్రత్యేక బృందం నర్సాపూర్ నుంచి తమిళనాడు వెళ్లనుంది. ఈ బృందం హైదరా బాద్‌కు చేరుకుని ఇక్కడ్నించీ ప్రత్యేక విమానం లో తమిళనాడుకు వెళుతోంది. ఈ బృందంలో పోలీసు ఉన్నతాధికారులతో పాటు తహసీల్దార్ తదితర అధికారులు తరలివెళుతున్నారు.



ఇంటికొచ్చేస్తారని చూస్తుంటే..

- ఇంతలోనే మరణవార్త.. కుప్పకూలిన కుటుంబీకులు

మెదక్, ప్రభ న్యూస్ బ్యూరో : భక్తితో నిష్టగా దీక్ష పాటించి... మొక్కు తీర్చుకుని తిరిగివస్తున్న తమవాళ్లంతా రేపోమాపో ఇంటికి వచ్చేస్తారని ఎదురుచూస్తున్న ఆ కుటుంబాలు రోడ్డుప్రమాదం వార్త విని తెల్లబోయారు. అన్నీ సజావుగా సాగిపోతున్నాయని, ఇక వారు ఇంటికి వచ్చేస్తారని ఎదురుచూస్తుంటే మరణవార్త రావడం వారిని కలచివేసింది. దీంతో ఆ కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదం ఆ కుటుం బాలను ఛిన్నా భిన్నం చేసింది. అయ్యప్ప దర్శనానికి వెళ్లి వస్తూ తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదం లో మెదక్ జిల్లా నర్సాపూర్ మండలానికి చెందిన యువకులు మృత్యు వాత పడ్డారు. వీరు ప్రయా ణిస్తున్న మినీ ట్రావెల్ బస్సును లారీ ఢీకొట్టడంతో జిల్లాకు చెందిన పది మందితో పాటు వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చందగా, నర్సాపూర్ మండలా నికి చెందిన మరో ఐదు గురు తీవ్రంగా గాయప డ్డారు. ఎప్పటిలాగానే అయ్యప్పమాల వేసుకుని శబరిమలై వెళ్లి తిరిగొస్తారని అనుకుంటున్న తరుణం లో ఈ విషాదం చోటుచేసు కుంది. ఈ ప్రమాదంలో మరణిం చిన వారంతా ఖాజీపేట, మంతూర్, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాలు కావడంతో ఆ గ్రామాల్లో తీరని విషాదం నెలకొంది. స్వామి దర్శనం చేసుకుని ఇంటికి వస్తారనుకున్న తమ బిడ్డలు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీర వుతున్నారు. వారి పరిస్థితి చూసి గ్రామస్తులు తీవ్ర విషాదానికి లోనయ్యారు. సంఘటన గురించి తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్తులు హుటాహుటిన నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. తమవాళ్లు బతికి ఉన్నారేమో తెలుసు కునేందుకు ఆతృతగా ఎదురుచూశారు.

కానీ వాళ్లంతామరణించారని తెలుసుకుని హతాశులైనారు. తమిళనాడులోని పుదుకొట్టు ప్రాంతంలో జిల్లాకు చెందిన అయ్యప్ప స్వాములు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారని తెలుసుకుని ఒక్కసారిగా జిల్లా ప్రజలు షాక్‌కు గురయ్యారు. మృతదేహాలను జిల్లాకు తరలించడానికి ఉమ్మడి తెరాస మాజీ అధ్యక్షుడు మురళీయాదవ్, స్థానిక పోలీసులు తమిళనాడుకు బయల్దేరి వెళ్లారు. నూతన సంవత్సరం ప్రారంభమైన తొలిరోజుల్లోనే జిల్లాకు చెందిన 11మంది మృత్యువాత పడటం విషాదాన్ని మిగిల్చింది. జిల్లాలో ఈ సంవత్సరం అతిపెద్ద దుర్ఘటనగా పేర్కొనవచ్చు.

ప్రమాదానికి గురైన అయ్యప్ప భక్తుల వాహనం

- ఒకరి మృతి.. ఏడుగురికి గాయాలు



బీబీనగర్, ప్రభన్యూస్ : శబరిమల అయ్య ప్ప స్వామి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండ గా నల్గొండ జిల్లా, కేంద్రంవద్ద వద్ద కారు అదుపు తప్పి ప్రమాదానికి గురికావడంతో ఒకరు మృతి చెందగా మరో 7గురికి తీవ్రగాయాలు అయ్యా యి. వివరాలోకి వెళ్లితే డిసెంబర్ 31న బీబీనగర్ నుంచి అయ్యప్ప భక్తులు 8 మంది జైలో కారులో శబరిమలైకి బయలుదేరి వెళ్లా రు. దర్శనం చేసుకొని తిరిగి వస్తుం డగా నల్గొండ సమీపం వద్దకు రాగానే తెల్లవారు జాము న 3గంటలకు కారు అదుపు తప్పి రోడ్డుకు ఇరు వైపుల దూసుకు పోయింది. ఈ ఘటనలో హైదరా బాద్‌లోని కీసరకు చెందిన మిట్టపల్లి సత్య నారాయణ మృతి చెందగా బీబీ నగర్‌కు చెందిన పంజాల బాల్‌రాజ్, పంజాల ఎల్లయ్య, అశోక్, ఎర్రోల బాల్‌రాజ్, మహేష్, సందీప్ లకు తీవ్ర గాయాలు అయ్యాయి.

వేటగాళ్ల చేతిలో పెద్దపులి హతం

- పెంబి అడవుల్లో ఘటన

ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : కవ్వాల అభయా రణ్యం లోని పులుల సంరక్షణ కేంద్రంలో పెద్దపులుల రక్షణను అటవీ శాఖ గాలికొదిలేసింది. గత ఏడాది వరకు కవ్వాల టైగర్ జోన్‌లో పులుల జాడ కనిపించలేదు. కానీ మహారాష్ట్రలోని తాడోబా నుంచి కవ్వాల టైగర్ జోన్‌లోకి పులులు వస్తాయని భావించి కవ్వాల టైగర్‌జోన్‌ను పులుల సంరక్షణ కేంద్రంగా తీర్చి దిద్దారు. అనుకున్నట్టే పెద్దపులి ఒకటి టైగర్‌జోన్‌లోకి అడుగు పెట్టింది. అడవిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు చిక్కింది. ఇక టైగ ర్‌జోన్‌లో టైగర్‌లు వచ్చాయని అటవీశాఖ సంబ రపడించే తప్ప సంరక్షణకు ఎలాంటి చర్యలు తీసు కోలేదు. అయితే నెలలు గడవక ముందే వేటగాళ్లు పెద్దపులిని హతమా ర్చడం అలజడి సృష్టించింది. పెంబి మండలం లోని పుల్గం పాం డ్రి అటవీ ప్రాంతంలో కొంత మంది మూడు నెలల క్రితం విద్యు త్ తీగలు అమర్చి పెద్దపులిని హతమార్చారు. విద్యు దాఘా తంతో చని పోయిన పులి చర్మాన్ని ఒలిచి విక్రయిం చేందుకు ప్రయత్నించి అటవీ అధికారులకు చిక్కారు. శని వారం సాయంత్రం ఇచ్చోడ వ ద్ద కారులో తరలిస్తున్న పులి చర్మా న్ని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకు న్నారు.



విద్యుదాఘాతంతో ముగ్గురు రైతులు మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- మంచిర్యాల జిల్లాలో ఘటన
- 6 నెలల క్రితం డీడీలు కట్టినా స్పందించని విద్యుత్‌శాఖ
- రైతులే విద్యుత్ స్తంభాలు పెట్టబోగా ప్రమాదం







వేమనపల్లి, ప్రభన్యూస్: మంచిర్యాల జిల్లా, వేమనపల్లి మండలం ముల్కల్లపేటలో ముగ్గురు రైతులు విద్యు దాఘా తంతో మృతి చెందారు. ముల్కల్లపేటలో ఆదివారం ఉదయం చిన్నకొండ రామయ్య వ్యవసాయ భూమికి విద్యుత్ స్తంభాలు, వైర్లను బిగించే క్రమంలో విద్యుత్ స్తంభం, దాని ప్రక్కన ఉన్న 11 కేవి వైర్‌కు తగలడంతో విద్యుత్ స్తంభాన్ని పట్టుకున్న ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన వారిలో సీనకొండ రామయ్య (55), సీనకొండ సురేందర్ (23) ఒకే కుటుంబానికి చెందినవారు కాగా, విద్యుత్ పనులు చేసేందుకు వచ్చిన కూలీ వశాఖ భీంరావు (28)లు ఉన్నారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటిన మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే....

రైతులు వ్యవసాయ భూముల్లో విద్యుత్ మోటర్లను ఏర్పాటు చేసుకోవడం కోసం డీడీలు తీసి విద్యుత్ లైన్ల ఎస్టిమేషన్లు తదితర వివరాలతో అనుమతులు వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా పొలాలకు విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ల బిగించకపోవడం, రైతుల నుండి అదనంగా డబ్బులు వసూలు చేయడంతో విసుగెత్తిన రైతులు విద్యుత్ అధికారుల అనుమతితో విద్యుత్ స్తంభాల రవాణా, ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల నిర్మాణం, విద్యుత్ వైర్లను లాగడం లాంటి పనులను రైతులే చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు వైర్లు బిగించడంలాంటి పనులను అధికారులు తమ సిబ్బందితో చేయించాల్సి వుండగా మండలంలోని రైతులతో వైర్లు లాగడం, విద్యుత్ స్తంభాల రవాణా, ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెల నిర్మాణంవంటి పనులు చేయిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులతో స్తంభాలు ఎక్కించడం, వైర్లు బిగించడంలాంటి పనులను చేయించ డం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. రైతులు ఎలాగైనా పంటలు పండించుకోవాలనే ఉద్దేశ్యంతో విద్యుత్ వైర్లు స్తంభాల నుంచి లాగే క్రమంలో దాని ప్రక్కన ఉన్న మరో 11కేవి వైర్‌కు విద్యుత్ స్తంభం తగలడంతో అక్కడికక్కడే రైతులు మృత్యు వాత పడ్డారు. ఈ ప్రమాదంతో నిల్వాయి, ముల్కల్లపేటలో విషాదం అలుముకుంది.

బాధిత కుటుంబాల ఆందోళన

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని తమకు న్యాయం చేసేంత వరకు మృత దేహాలను తీసుకువెళ్లమని గ్రామస్తులు ఘటన స్థలం వద్దే బైఠాయిం చారు. సంఘటనా స్థలానికి చెన్నూరు రూరల్ సీఐ జగదీష్, నిల్వాయి ఎస్సై భూమేష్‌లు అక్కడికి చేరుకొని కుటుంబ సభ్యులతోను, బైఠాయించిన వారితో మాట్లాడారు. విద్యుత్ అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ముగ్గురు మృతి చెందారని, తక్షణమే వారిని విధుల నుంచి తొలగించాలని మృతుల కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

నిర్మల్ జిల్లాలో...

నిర్మల్ జిల్లాలోని ముధోల్ మండలం మైలాపూర్ గ్రామానికి చెందిన అంతగిరి భూమన్న (46) ప్రమాద వశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతిచెందినట్లు బాసర ఎస్సై మహేష్ తెలిపారు. అంతగిరి భూమన్న మైలాపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో ఇంటి పక్కన కట్టెలు కొట్టి అనంత రం ఇనుప చువ్వ లను తొలగించే క్రమంలో 11కె.వి విద్యుత్ లైన్‌ను తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడే ఉన్న స్థానికులు స్థానిక ఆసుప త్రికి తరలించినప్పటికి, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

మానుకోట విద్యార్థిపై అమెరికాలో కాల్పులు

మహబూబాబాద్, ప్రభన్యూస్ : అమెరికాలో మానుకోట విద్యార్థిపై కాల్పులు జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లా, మహబూబా బాద్ పట్టణానికి చెందిన పూస సాయికృష్ణ అనే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థిపై అమెరికాలో ఈ నెల మూడున కాల్పులు జరిగినట్లు సాయి క్రిష్ణ సమీప బంధువు శివానంద్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేఖరులతో మాట్లా డారు. స్థానిక వేణుగోపాల స్వామి గుడి దేవాలయ సమీపంలో నివాసముంటున్న పూస ఎల్లయ్య, శైలజ దంపతులకు సాయి కృష్ణతో పాటు మరో కూతురు ఉంది. సాయి క్రిష్ణ నాలుగు సంవత్సరాల క్రితం ఉన్నత విద్యకోసం అమెరికాకు వెళ్లాడు. యుఎస్‌ఏలోని మిచిగాన్ రాష్ట్రంలోని లారెన్స్ టెక్ యూనివర్సిటీలో ఎంఎస్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. నెల రోజుల క్రితం ఆయన ఉద్యోగంలో చేరారు. ఈ నెల మూడున ఓ రెస్టారెంట్ వెళ్లి పార్సిల్ తీసుకుని ఇంటికి తిరిగి వెళ్లుతుండగా అక్కడ గుర్తు తెలియని వ్యక్తి ఆయనపై కాల్పులు జరిపారు. అనంతరం అగంతకులు కారుతో పాటు గుర్తింపు పత్రాలు అపహరించుకు పోయినట్లు తెలిసింది. దుండగులు జరిపిన కాల్పుల్లో సాయి క్రిష్ణ కుడి బుజంపై బుల్లెట్ గాయం అయినట్లు తెలిపారు. ఈ విషయమై పూర్తి సమాచారం కోసం అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమారుడిని చూసేందు కు అమెరికా వెళతామని ప్రభుత్వం తమకు సహకరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు



మణుగూరు, ప్రభ న్యూస్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండల పరిధిలోని రామానుజవరం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మణం పాలుకాగా.. మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇందుకు సంబం ధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పినపాక మండలం ఏడూళ్లబయ్యారం గ్రామా నికి చెందిన వాగబోయిన సాంబశివరావు(23), కొత్తకొమ్ముగూడెం గ్రామానికి చెందిన వాసం రాము(28), పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాగబోయిన శివకృష్ణ(23)లు ఆదివారం రాత్రి 7గంటల సమయంలో ఏడూళ్లబయ్యారం వైపు నుంచి మణుగూరు వైపునకు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో రామానుజవరం గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై కరెంటు స్తంభాల లోడుతో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలు కావడంతో రాము, సాంబశివరావులు అక్కడికక్కడే మృతిచెందారు. వాగబోయిన శివకృష్ణ తీవ్ర గాయాల పాలయ్యాడు. క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో వాగబోయిన సాంబశివరావు ఏడూళ్ల బయ్యారం మాజీ సర్పంచ్ వాగబోయిన చందర్‌రావు కుమారుడని తెలిసింది. సంఘటనా స్థలంలో కుటుంబసభ్యులు రోదిస్తున్న తీరు చూపరుల హృదయాలను కలచివేసింది. మణుగూరు సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామన్నారు. అయితే స్తంభాల లోడుతో రోడ్డపక్కన ఆగిఉన్న లారీ చీకటిలో కనిపించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని పలువురు భావిస్తున్నారు. అనేక పనుల రీత్యా లేక మరమ్మతులకు గురైనప్పుడు రోడ్డుపక్కనే లారీలను నిలిపివేసిన క్రమంలో అవి కనిపించక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.


కలుషిత ఆహారం... విద్యార్థినులకు అస్వస్థత

- చేవెళ్ల కస్తూర్బాగాంధీ పాఠశాలలో 85 మంది



చేవెళ్ల, ప్రభన్యూస్ : రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినీలు కలు షిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో 200 మంది విద్యార్థులు ఉండగా 85 మంది విద్యార్థినీలు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధ పడగా పాఠశాల సిబ్బంది వారిని చేవెళ్లలోని ఏరియా ఆసుపత్రికి తరలిం చారు. చేవెళ్ల సీఐ గురువయ్యగౌడ్ , ఎస్ఐలు రేణు కారెడ్డి, హన్మంత్‌రెడ్డిలు సహాయక చర్యలు చేపట్టారు. చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్‌ల 108 అంబులెన్స్‌లు, పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశా లకు చెందిన అంబులెన్స్‌ల సహాయంతో 37 మంది విద్యార్థినీలను నగరంలోని నీలఫర్, ఉస్మానియా, ఫివర్ ఆసుపత్రులకు తరలించారు. అక్కడ విద్యార్థినులు ప్రస్తుతం చికిత్స పొందు తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. అదేవిధంగా చేవెళ్లలో మిగిలిన విద్యార్థినులకు చికిత్సలు నిర్వహించి పాఠశాలకు పంపించారు. ప్రస్తుతం చేవెళ్ల ఆసుపత్రిలో నలుగురు విద్యార్థినీలు చికిత్సలు పొందుతున్నారు. శనివారం సాయంత్రం ఫ్రూట్స్ సలాడ్ తీసుకోగా రాత్రి క్యాప్సికం, పప్పు, పెరుగు, అన్నం భుజించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు మొదలైయ్యాయి. ఉదయం వెంటనే విద్యార్థినులను ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఆర్డీవో హన్మంత్‌రెడ్డి, వైద్యాధికారి లలిత, ఎంఈవో అక్బర్‌లు ఆసుపత్రికి చేరుకుని దగ్గరుండి చికిత్సలు చేయించారు. మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య వైద్యాధికారులకు ఆదేశించారు.

- జయశంకర్ భూపాలపల్లి చిట్యాల 'వెలుగు' పాఠశాలలో 22 మంది



చిట్యాల, ప్రభన్యూస్ : జయశంకర్ భూపాల పల్లి జిల్లా, చిట్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం (వెలుగు)లో కలుషితం ఆహారం తిని 22 మంది విద్యార్థినులు అస్వస్థతు గురై వాంతులు , కడుపునొప్పితో బాధప డుతూ చిట్యాల సివిల్ ఆస్పత్రిలో ఆదివారం చికిత్స పొదారు. వారిలో ఆరుగురి పరిస్థితి విష మంగా మెరుగైన చికిత్సలు డాక్టర్లు అందిస్తు న్నారు. సమాచారం తెలుసుకున్న సీఐ శ్రీనివాస్ , ఎస్సై అనీల్ కుమార్ , డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్ రావు ఆస్పత్రిని సందర్శించి విద్యార్థినులకు మెరుగైన వైద్య సేవలు అంది స్తున్నారు. మండలంలోని వెలుగు బాలికల గురుకులంలో 5వ తరగతి నుండి ఇంటర్మిడియెట్ వరకు 670 మంది విద్యార్థినులు చదువు కుంటున్నారు. శనివారం రాత్రి బాలికలకు క్యాబేజీ కూర తో పాటు సాంబారు అన్నం వడ్డించారని నిల్వ చేసిన సాంబారు పౌడర్లతో ఫంగస్ సోకి విద్యార్థులు వాంతులు , కడుపునొప్పి తో అస్వస్థతకు గురై ఉంటారని వైద్యులు పేర్కొన్నారు. 24 మంది బాలికలు అనిత, ప్రవళిక, మౌనిక , సౌజన్య, ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులు, ప్రవళిక , ఫస్ట్‌యర్ ఝాన్సీ పదవతరగతి సౌమ్య, దివ్య, నవనీత, 9వ తరగతి నవ్య, నిఖిత, 8వ తరగతి స్నేహ, దివ్య, 7వ తరగతి , సిద్ధు, హర్షిత, స్రవంతి, సమీర, అక్షయ , హిందు, నందిని , కావ్య, 6వ తరగతి బాలికలు ఉన్నారు. వారిలో విషమంగా ఉన్న ఆరుగురు విద్యార్థినులు ఝాన్సి, సౌజన్య, ప్రవళిక, కావ్య, స్నేహ, నందిని సివిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురుకులంలో మెను ప్రకారం నాణ్యమైన ఆహారం అందించడం లేదని, అపరి శుభ్రమైన, చలి తీవ్రతతో విద్యార్థులకు భోజనం జీర్ణం కాక పోవడంతో వాంతులు, కడుపునొప్పితో బాధపడు తున్నట్లు వైద్యులు తెలి పారు. గురుకులంలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం తో సిబ్బంది ఇష్టా రాజ్యంగా పనిచేస్తూ క్యాటరింగ్ నిర్వహణ అధ్వాన్నంగా మారి నాణ్యతలేని కూరగాయలు , వండి విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకుంటు న్నారని పలు విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి.

కమలం కమిటీలు




న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలకు భారతీయ జనతాపార్టీ సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకోసం 17 వేర్వేరు కమిటీలను నియమించింది. ఈ మేరకు సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. హోంమంత్రి రాజ్‌నాథ్‌ను మేనిఫెస్టో కమిటీకి, ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీని ప్రచార కమిటీకి సారథులుగా ప్రకటించారు. కేంద్రమంత్రులు జైట్లీ, నిర్మలా సీతారామన్, రవిశంకర్ ప్రసాద్, పీయుష్ గోయల్, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మేనిఫెస్టో కమిటీలో 20మంది కీలక సభ్యులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాంమాధవ్‌కు మేనిఫెస్టో కమిటీలో చోటుదక్కింది. సామాజిక సమన్వయ కమిటీకి ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్‌కు ప్రచార సామాగ్రి నిర్వహణ బాధ్యతలు కేటాయించారు. తెలంగాణకు చెందిన సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయకు సామాజిక సమన్వయ కమిటీలో అవకాశం లభించింది. ఏప్రిల్ - మే మధ్య లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. నరేంద్రమోడీని మరోసారి ప్రధాని గెలిపించుకోవాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉంది. మీడియా కమిటీ - రవిశంకర్ ప్రసాద్, ప్రవాస్ కమిటీ- అవినాశ్ రాయ్ ఖన్నా, సోషల్ మీడియా- శ్యాంజాజు, ప్రబుద్ద్ సమ్మేళన్- ప్రకాశ్ జవదేకర్, ఎన్నికల పరిశీలన కమిటీ- భూపేంద్ర యాదవ్, కార్యాలయ నిర్వహణ- అరుణ్ సిన్హ, సాహిత్య వితరణ- శ్యాంజాజు, భాజపా పరివార్-అవినాశ్ రాయ్, కమల్ జ్యోతి - అనిల్ జైన్, మన్‌కీబాత్- అరుణ్‌సిన్హ, బైక్ ర్యాలీ -సంజీవ్ చౌరాసియా తదితరులకు కీలక బాధ్యతలు కట్టబెట్టారు.

• గడ్కరీని ఉప ప్రధాని చేయాలి

లక్నో: బీజేపీ సీనియర్ నేత సంఘ్‌ప్రియా గౌతం సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని ఉప ప్రధానిని చేసి హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిని చేయాలని డిమాండ్ చేశాడు. బీజేపీ చీఫ్ అమిత్‌షా రాజ్యసభకోసం ఎక్కువ కష్టపడాలని, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు బీజేపీ అధ్యక్ష పదవి అప్పగించాలని సూచించాడు. తన డిమాండ్‌లతో కూడిన లేఖను సంఘ్‌ప్రియా గౌతం మీడియాకు అందజేశారు. ప్రస్తుతం ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఎక్కువ సమయం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే కేటాయిస్తున్నారని, అందుకే రాజ్‌నాథ్‌ను యూపీ సీఎం చేయాలని కోరుతునట్టు కోరాడు. 2019లో మళ్లీ మోడీ గాలి వీయడం అనుమానమే అని, దేశ అగ్రనేతల్లో నరేంద్ర మోడీ కూడా ఒకరు అని వివరించాడు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మోడీ మంత్రం పని చేయడం సాధ్యం కాదని, ఇది తెలిసినా పార్టీ కార్యకర్తలు దీనిపై నోరు మెదపడం లేదని అన్నారు.

• డేటా ప్రొటెక్షన్ చట్టం తెస్తాం




జలంధర్: ప్రజల వ్యక్తిగత, వృత్తిపరమైన కీలక డేటాను పరిరక్షించే యోచనలో ప్రభుత్వం ఉందని, అందుకు 'డేటా ప్రొటక్షన్ లా' చట్టాన్ని తేనున్నామని కేంద్ర న్యాయ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. తద్వారా సున్నితమైన డేటాను గూగుల్ ద్వారా విదేశాలు దుర్వినియోగం చేయకుండా అడ్డుకట్టపడుతుంది. ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంత్రి అన్నారు. పంజాబ్‌లోని జలంధర్‌లో జరుగుతున్న ఇండియన్ సైన్స్ కాంగ్రెస్-2019ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ బదలాయింపుల్లో పెట్టుబడులను ఆకర్షించడంలో ఇండియా మూడో స్థానంలో ఉందని, మనదేశంలో శాస్త్ర, సాంకేతికతను కొత్తపుంతలు తొక్కించేందుకు ఇదే మంచి తరుణమని ఆయన అన్నారు. గ్లోబల్ ఇన్నోవేషన్ సూచీలో 2015లో 81గా ఉన్న భారత్ ర్యాంకు 2017లో 60కి చేరిందని, సైంటిఫిక్ పబ్లికేషన్స్‌లో 6వ స్థానంలోనూ, పేటెంట్ ఫైలింగ్‌లో 10వ స్థానంలోనూ ఉందన్నారు.

• ఎయిర్‌పోర్టులో అత్యవసర పరిస్థితి




కోల్‌కతా: ఓ ఎయిర్ ఇండియా విమానం నుంచి ఇంధనం లీక్ అవుతుండడంతో కోల్‌కతా ఎయిర్ పోర్టులో శనివారం రాత్రి అత్యవసర పరిస్థితి ప్రకటించినట్లు ఆ విమానాశ్రయ వర్గాలు తెలిపా యి. ఆ సమయంలో 150 మంది ప్రయాణికులు ఆ విమానంలో ప్రయాణిస్తున్నారు. బ్యాంకాక్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన విమానం గగనతలంలోకి రాగానే ఇంధనం లీక్ అవుతున్నట్లు పైలట్లు గమనించి, వెంటనే సమీపంలోని కోల్‌కతా ఎయిర్ పోర్టులో విమానాన్ని అత్యవసరంగా దింపారు. రన్‌వే టెర్మినల్‌ను అనుసంధానించే టాక్సీవేలో విమానం నిలిచిపోయిందని జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది. అక్కడి నుంచి మరో వాహనం సాయంతో విమానాన్ని టెర్మినర్‌కు తరలించారు. విమానం లోని ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నట్లు అధికారులు ప్రకటించారు.

• కోర్టు తీర్పును రాహుల్ అనుసరించాలి



ముంబై: బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా రాహుల్ గాంధీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును అనుసరించి దేశ రాజధానిలో నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రిక కార్యాలయాన్ని ఖాళీ చేయవలసిందే అని అమిత్ షా అన్నారు. ప్రజల ఆస్తిని తమ అధీనంలో ఉంచుకున్న వారికి ప్రధాని నరేంద్రమోడీ ని విమర్శించే అర్హత లేదన్నారు. ఢిల్లీ హైకోర్టు గత నెల దేశ రాజధానిలోని ఐటీవో ఎన్‌క్లేవ్‌లో ఉన్న నేషనల్ హెరాల్డ్ పబ్లిషర్ అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)ను ఖాళీ చేయవలసిందిగా ఆదేశించిందన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఆ తీర్పులో న్యాయమూర్తి యంగ్ ఇండియన్ (వైఐ) నుంచి ఏజేఎల్ హైజాక్ అయిందని పేర్కొన్నారని అమిత్ షా అన్నారు. ఏజేఎల్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఆయన తల్లి సోనియాగాంధీ భాగస్వాములుగా ఉన్నారన్నారు. ప్రధానిపై అవినీతి ఆరోపణలు చేసే రాహుల్‌గాంధీ కళ్లు తెరిచి తమ కుటుంబంపై ఉన్న అవినీతిపై సమాధానం చెప్పాలన్నారు.

• చెరుకు రైతుల గోడు పట్టించుకోండి



న్యూఢిల్లీ: ఆత్మహత్యలకు పాల్పడుతున్న చెరకు రైతులు ఆదుకోవాలని ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ ప్రధాని మోడీకి లేఖ రాశారు. అశాంతి, నిరాశలతో కొట్టుమిట్టాడుతున్న రైతులకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీయే పాలనలో దేశంలో వ్యవసాయ సంక్షోభం నెలకొందని.. పరిష్కార మార్గాలు చూపాలని డిమాండ్ చేశారు. మూడు హిందీ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీజేపీ మరోసారి సార్వత్రిక ఎన్నికల ముందు లక్షల మంది రైతులను మరోసారి మోసంచేసి వారి మద్దతుపొందేందుకు కాషాయం పార్టీ ప్రయత్నిస్తుందని పవార్ ఆరోపించారు. చెరకు రైతులంతా ప్రభుత్వంపై పెద్ద ఎత్తున తిరుగుబాటు చేయకుండా నివారించడానికి యుద్ధప్రాతిపదికన పరిష్కార చర్యలు తీసుకోవాలని పవార్ ప్రధాని మోడీని లేఖలో కోరారు.

• విజయన్ తీరుపై ఎన్‌ఎస్‌ఎస్ గుస్సా

కొట్టాయం (కేరళ): శబరిమలలో సనాతన ధర్మాన్ని కాపాడేందుకు హిందుత్వవాదులంతా శాంతియుత వాతావరణంలో పోరాడాలని నాయర్ సర్వీస్ సొసైటీ సూచించింది. అయ్యప్ప భక్తులను జైల్లో పెట్టడం, రాష్ట్రంలో అరాచకత్వం సృష్టించాలని అనుకోవడం, హిందూ పూజారులను ఆత్మక్షోభకు గురి చేయడం ప్రభుత్వానికి ఏమాత్రం తగదని చెప్పుకొచ్చింది. హిందూ వాద సంఘాలతో పాటు ప్రతిపక్షాలు కేరళ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నాయి. తాజాగా నాయర్ సర్వీస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్) కూడా విజయన్ సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యయుత దేశంలో ప్రజలు ఇది కోరుకోవడం లేదని ఎన్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి జి.సుకుమారన్ అన్నారు. హిందుత్వ సంఘాల నిరసనలను రాజకీయంతో ముడిపెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడే విషయంలో ప్రజలతో కలిసి ప్రభుత్వం రావాలని సూచించారు.

విమానాశ్రయం తరహాలో రైల్వే భద్రత




న్యూఢిల్లీ: రైల్వే భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు భారతీయ రైల్వే కసరత్తు ప్రారంభించింది. విమానాశ్రయాల తరహాలో రైల్వే భద్రతకు ఏర్పాట్లు చేస్తోంది. తాము వెళ్లాల్సిన రైలు ఎక్కాలంటే ప్రయాణికులు కనీసం 15-20 నిమిషాల ముందే రైల్వే స్టేషన్‌కు చేరుకుంటేనే అనుమతించేలా చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులు యోచిస్తున్నారు. ప్రస్తుతం విమానాశ్రయాల్లో అవలంభిస్తున్న విధానాన్ని అమలు చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కసరత్తు చేస్తోంది. ఇందుకోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు.రైలు బయలుదేరేందుకు 15 నిమిషాల ముందు ఆటోమేటిక్‌గా సదరు ఫ్లాట్ ఫాం సీజ్ అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) కుంభమేళా నేపథ్యంలో ప్రస్తుతం ఆయా పరిసరాల్లోని రైల్వే స్టేషన్లను ఈ విధంగా మారుస్తున్నారు. విమానాశ్రయాల తరహాలో రైల్వే స్టేషన్లలో భద్రత ఏర్పాట్లు చేయాలంటే అందుకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలపై ఆరా తీస్తున్నారు. రైల్వే స్టేషన్లకు ఇరువైపుల గోడల నిర్మాణం అవసరమని ఆర్‌పీఎఫ్ అధికారులు తెలియజేస్తున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముందడుగు వేసేందుకు స్టేషన్ల రూపకల్పన జరగాలని వివరించారు. కర్నాటకలోని హుబ్లీ స్టేషన్‌లోనూ ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతానికి 202 రైల్వే స్టేషన్లు నూతన భద్రతా వ్యవస్థను అమలు చేసేందుకు అనువుగా ఉన్నట్లు గుర్తించారు. ఇంటిగ్రేటెట్ సెక్యూరిటీ సిస్టం ద్వారా రైల్వే స్టేషన్లలో మూడు,నాలుగు చెక్ పాయింట్లు కూడా ఏర్పాటు చేయనున్నారు.

సీబీఐ విచారణకు రెడీ



లక్నో: అక్రమ మైనింగ్ కేసులో సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్‌ను సీబీఐ విచారించనుందని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. సీబీఐ విచారణ ఎదుర్కొనేందుకు తను సిద్ధంగా ఉన్నా అని అఖిలేశ్ అన్నారు. కానీ బీజేపీకి సమాధానం చెప్పేందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా లక్నోలో అఖిలేశ్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ఓ సంస్కృతిని వదులుతుందని అది భవిష్యత్తులో బీజేపీకి వ్యతిరేకంగా ఉపయోగపడుతుందన్నారు. సమాజ్‌వాది పార్టీ లోక్‌సభ స్థానాలన్నింటిని కైవశం చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోందన్నారు. సీబీఐ వారితో ఉండటం వల్ల మమ్మల్ని అడ్డుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తుందన్నారు. ఒకసారి కాంగ్రెస్ కూడా విచారణ జరిపించిందన్నారు. బీజేపీ ఇదంతా చేయించి సీబీఐ నన్ను ప్రశ్నిస్తే వారికి నేను సమాధానం చెపుతాను. కానీ ప్రజలు కూడా బీజేపీకి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని యాదవ్ అన్నారు.

నిండు ప్రజాస్వామ్యం... సగం తీర్పు!



(మొదటిపేజీ తరువాయి)

పార్టీలకు ఓటేస్తున్నారు. 2014 లోక్‌సభ గణాంకాలను పరిశీలిస్తే, అధికార ప్రతిపక్షాలైన బీజేపీ (17.7కోట్లు), కాంగ్రెస్ (10.6కోట్లు)కు పోలైన ఓట్లు, ఈవీఎం మీటదాకా చేరని ఓట్లు చెరిసమానంగా ఉండటం ఆందోళన కలిగించే విషయం. దీన్నిబట్టి సగం తీర్పుతోనే నిండు ప్రజాస్వామ్యం వర్థిల్లుతోందని భావించక తప్పదు. ఈ భూమ్మీద మరే ఇతర ప్రజాస్వామ్య దేశంలో లేనంతమంది ఓటర్లు భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నారు. కానీ, ప్రభుత్వాన్ని, సరైన నాయకత్వాన్ని ఎన్నుకునే బృహత్తర బాధ్యతను నిర్లక్ష్యం చేస్తుండటం ప్రజాస్వామ్యానికి చేటుతెచ్చే పరిణామంగా మేధావులు అభివర్ణిస్తున్నారు. మిగతా ప్రజాస్వామ్య దేశాలతో పోల్చిచూస్తే, ఈవీఎంలో నిక్షిప్తం కాకుండా వ్యర్థ్యంగా మిగిలిపోతున్న ఓట్ల విలువ ఎంత అమూల్యమో అవగతఅవుతుంది. భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు దీన్నొక విషాద పరిణామంగానే చెప్పాలి.

2014 లోక్‌సభ ఎన్నికల్లో ఏపార్టీకి ఎన్నిఓట్లు?

మొత్తం ఓట్లు	83.4 కోట్లు
బీజేపీ	17.7 కోట్లు
కాంగ్రెస్	10.69 కోట్లు
ఇతర పార్టీలు	13.03 కోట్లు
పోలవని ఓట్లు	27.99 కోట్లు

20 దేశాల తీర్పుతో సమానం..


భారత్ తర్వాత అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన దేశం అమెరికా. ఇక్కడ 2016లో జాతీయ ఎన్నికలు జరిగాయి. అప్పుడు 18.3 కోట్ల మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. అమెరికాను మినహాయిస్తే, ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ ర్యాంకు కలిగిన 20 ప్రజాస్వామ్య దేశాల్లోని మొత్తం ఓటర్ల సంఖ్య 28.2 కోట్లు. ఇందులో జర్మనీ, బ్రిటిన్, స్పెయిన్, ద.కొరియా వంటి దేశాలున్నాయి. ఈ లెక్కలతో పోల్చిచూస్తే, పోలింగ్‌కు దూరంగా ఉంటున్న 28 కోట్ల ఓటర్ల విలువ తక్కువేమీకాదు. సదరు 20 దేశాల్లో ప్రభుత్వాల ఎంపికకు ఇది సమానం.

ఎందుకిలా జరుగుతోంది?

రాజ్యాంగం ప్రసాదించిన మిగతా హక్కులు, బాధ్యతల విషయంలో జాగురూకతతో ఉండే వయోజనులు ఓటు హక్కు పట్ల ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు? ఓటేయక పోవడాన్ని తేలిగ్గా ఎందుకు తీసుకుంటున్నారు? అనే ప్రశ్నలకు విభిన్న సమాధానాలు వినిపిస్తున్నాయి. ఇందులో ఉపాధి వలసలు ప్రధాన కారణం. 2011 జనగణన వివరాల మేరక 45.4 కోట్ల మంది ఉపాధి, వ్యాపార, విద్య కోసం సొంత ఊళ్లు విడిచి వేర్వేరు ప్రాంతాలకు వలస వెళ్లినట్లు స్పష్టమవుతోంది. వీరిలో 2కోట్ల మంది ఏడాదిగా, 7.2 కోట్ల మంది నాలుగేళ్లు అంతకు మించి సొంత ప్రాంతాలను వీడినట్లు సమాచారం. దాంతో ఎన్నికల సమయానికి స్వగ్రామాలకు చేరుకునేందుకు విముఖత చూపడం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తుతున్నది. మరికొంత మంది పోలింగ్ బూత్‌వరకు చేరుకోలేని బద్ధకస్థితిలో ను, వ్యవస్థపట్ల నిర్లిప్తతోను ఉండటం మరొక కారణం.

నిర్లక్ష్యం వీడాలి?

వలస వెళ్లినప్పటికీ, ఇతర పౌర ప్రాయోజిత వివరాలు, పత్రాల విషయంలో చూపే శ్రద్ధ ఓటు పట్ల చూపడం లేదన్నది వాస్తవం. ఫోన్‌నంబర్, బ్యాంకు ఖాతా, ఆధార్ చిరునామా, వంటగ్యాస్ వంటి వాటిని తామున్న చోటకు బదలీ చేయించుకుంటున్నారు. కానీ, ఓటు విషయంలో ఈవిధమైన ముందుజాగ్రత్త చూపడం లేదు. దేశంలో ఎక్కడకు వెళ్లినా, మునుపటి ఓటును రద్దుచేయించుకుని కొత్త ఓటు నమోదు చేయించుకోవాలి. లేదంటే పాతదాన్నే చిరునామా మార్పిడికి దరఖాస్తు చేసుకుని, ఎన్నికల సమయంలో తామున్నచోటే ఓటు వేయవచ్చు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఈ ప్రక్రియను మరింత సులభతరం చేసింది కూడా. అయినా పోతే పోయిందిలే? ఓటే కదా? వేయకుంటే ఏమిటి? అనుకునే మూర్ఖపు ధరోణులు కొనసాగుతుండటం దురదృష్టకరం. గత లోక్‌సభ ఎన్నికల నాటికి 1.3 కోట్ల మంది ఎన్నారైలు, 1.2 కోట్ల ఆర్మీ ఓటర్లు ఉన్నారు. దేశీయంగా వలస ఓటర్లతో పోల్చితే వీరి సంఖ్య చాలా స్వల్పం. ఎన్నారైలకు ఓటు హక్కు కల్పించేందుకు ప్రయత్నిస్తున్న, మన నాయకాగ్రగణ్యులు భారీ సంఖ్యలో ఉన్న వలస ఓటర్లపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈసీ కూడా ఈ దిశగా ప్రత్యామ్నాయ చైతన్య కార్యక్రమాలు చేపట్టి, నిండు ప్రజాస్వామ్యాన్ని నిండుతీర్పుతో ప్రజలు ఆశీర్వదించేలా చూడాలని కోరుకుందాం.



రక్షణ మంత్రి రాజీనామా చేయాలి



• హెచ్‌ఏఎల్‌కు లక్ష కోట్ల కాంట్రాక్టు పత్రాలు చూపించాలి • మోడీని కాపాడేందుకు నిర్మల ప్రయత్నాలు: రాహుల్ • ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాడు: సీతారామన్ • లక్షకోట్ల ఒప్పందం జరగలేదు: హెచ్‌ఏఎల్



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మరోసారి రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పార్లమెంట్ సాక్షిగా హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ విషయంలో అబద్ధాలు చెప్పారని, సభ్యులందరినీ తప్పుదోవ పట్టించారని, వెంటనే ఆమె తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లక్ష కోట్లకు సంబంధించిన ఆర్డర్లు హెచ్‌ఏఎల్‌కు ఇచ్చినట్టు నిర్మలా సీతారామన్ చెప్పారని, అలా అయితే వాటికి సంబంధించిన పత్రాలను పార్లమెంట్‌లో సమర్పించాలని అన్నాడు. శుక్రవారం లోక్‌సభలో రాఫెల్ విషయమై రెండు గంటల పాటు చర్చ జరుగుతున్న సమయంలో హెచ్‌ఏఎల్‌కు పైప్‌లైన్ విషయంలో రూ.1లక్ష కోట్ల ఆర్డర్ ఇచ్చామని చెప్పుకొచ్చారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ రాహుల్ విమర్శలు గుప్పిస్తున్నారు. కానీ తమకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఆర్డర్ కూడా రాలేదని హెచ్‌ఏఎల్ చెప్పుకొస్తున్నది. మోడీ ప్రభుత్వం తప్పులను కప్పిపుచ్చుకోవడానికి అనేక తప్పుడు ప్రకటనలో చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశాడు. లక్ష కోట్ల ఆర్డర్ కోసం హెచ్‌ఏఎల్ వేచి చూస్తోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీని కాపాడాలనే ఆలోచనతోనే నిర్మలా సీతారామన్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా హెచ్‌ఏఎల్‌కు రూ.లక్ష కోట్ల ఆర్డర్ ఇచ్చామని చెప్పినందున దానికి సంబంధించిన డాక్యుమెంట్‌లు సోమవారం తీసుకొచ్చి చూపించాలని డిమాండ్ చేశాడు. సూటు, బూటు వేసుకున్న వారికే మోడీ కాంట్రాక్టులు ఇస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌ఏఎల్‌ను ఆదుకోవడం లేదని, అందుకే వేతనాలు, ఇతర ఖర్చుల కోసం రూ.1000 కోట్ల అప్పు చేయాల్సి వచ్చిందని రాహుల్ విమర్శించారు. హెచ్‌ఏఎల్ చరిత్రలో ఇది మొదటి సారి అని ఎద్దేవా చేశారు.

వార్తను రాహుల్ పూర్తిగా చదవాలి

రాహుల్ విమర్శలను రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తిప్పికొట్టారు. రాహుల్ చేసిన కామెంట్లపై ట్విట్టర్ వేదికగా స్పందించారు. రాహుల్‌కు మళ్లీ ఏ, బీ, సీ, నుంచి తెలియజేయాల్సి వస్తోందని చెప్పుకొచ్చారు. వార్తను పూర్తిగా చదవకుండా న్యూస్ క్లిప్పింగ్‌ను పోస్టు చేసి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఎద్దేవా చేశారు. ముందు వార్తను పూర్తి చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. రాహుల్ గాంధీ రక్షణ శాఖపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, 2014 నుంచి 2018 మధ్య కాలంలో రూ.26,570 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌పై సంతకాలు చేయడం జరిగిందని, మరో రూ.73,000 కోట్ల పైప్‌లైన్ కాంట్రాక్ట్ ఉందని, ఈ విషయమై సంప్రదింపులు జరుగుతున్నాయని, దీనిపై సంతకం చేయాల్సి ఉందని మాత్రమే చెప్పామని వివరించారు. రక్షణ శాఖపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న రాహుల్, పార్లమెంట్‌లో నిల్చొని క్షమాపణ చెప్పాలని లేదా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నేత రణదీప్ సుర్జేవాలా కూడా మోడీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. రక్షణ మంత్రి అబద్దాలు చెప్పారనే విషయం తేటతెల్లమైందని అన్నారు. హెచ్‌ఏఎల్‌కు రూ.1లక్ష కోట్ల కాంట్రాక్టు అందించినట్టు చెబుతున్నారని, కానీ కంపెనీ మాత్రం తమకు ఒక్క రూపాయి ఆర్డర్ కూడా రాలేదని ప్రకటించిందని, దీనిపై ఏం సమాధానం చెబుతారని నిర్మలా సీతారామనుద్దేశించి ప్రశ్నించారు. కాంట్రాక్టుపై సంతకాలు చేయకుండానే ఎలా ప్రకటిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాకు లక్ష కోట్ల కాంట్రాక్టు రాలేదు: హెచ్‌ఏఎల్

రక్షణ మంత్రి ప్రకటనపై హెచ్‌ఏఎల్ ఉన్నతాధికారి స్పందిస్తూ.. ఇప్పటి వరకు ఎలాంటి ఆర్డర్‌లు రాలేవని, ఎందుకంటే కాంట్రాక్టులపై ఇంకా సంతకాలు కాలేవని చెప్పుకొచ్చాడు. ఈ విషయమై వాటాదారులకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని వివరించారు. రూ.లక్ష కోట్ల కాంట్రాక్టు వచ్చిందనే విషయాన్ని నమ్మొద్దని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని చెప్పుకొచ్చాడు.

ఆధార్‌తో రూ.90 వేల కోట్ల ఆదా

• రెండు కొత్త పథకాలు తీసుకురావచ్చు: జైట్లీ



న్యూఢిల్లీ: ఆధార్‌తో ఏడాదికి రూ.90వేల కోట్లు ఆదా అవుతున్నా యని ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు.ఈ డబ్బుతో ఆయుష్మాన్ భారత్ వంటి మరో 3 కొత్త పథకాలు అమలు చేసేందుకు వీలవుతుందని తెలిపారు. నిరుపేద ప్రజ లకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఎన్‌డీఏ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్‌ను తీసుకొచ్చిం దని... మోడీ నాయకత్వంలో ఆధార్‌ను ఎంతో సమర్థవంతంగా అమలు చేశామన్నారు..ఆయుష్మాన్ భారత్ లాంచ్ అయిన తరువాత సుమారు 7లక్షల మంది వైద్య సేవలు అందుకున్నారని, కాంగ్రెస్ న్యాయవాదులు మాత్రం ఆధార్‌ను తీసుకురావడాన్ని సవాల్ చేస్తూ కోర్టులో కేసులు వేశారని గుర్తు చేశారు. ఆధార్ ద్వారా రూ.1,69,868 కోట్లు బదలీ చేయడం జరిగిందన్నారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా లాభాలు నేరుగా లబ్ధిదారుడి ఖాతాలో పడిపోతున్నాయని వివరించారు. ఈ తరహా టెక్నాలజీని కేవలం భారత్‌లోనే ఉపయోగించడం జరుగుతోందన్నారు. 22.80 కోట్ల పీఏహెచ్‌ఏఎల్, ఉజ్వల లబ్ధిదారులకు ఖాతాల్లో నేరుగా సబ్సిడీ డబ్బులు జమ అవుతున్నాయని, 58.24 కోట్ల మంది రేషన్ కార్డు దారులు ఆధార్‌తో అనుసంధానమై ఉన్నారని తెలిపారు. 10.33 కోట్ల ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ ఉద్యోగులు తమ వేతనాలు వారి వారి ఖాతాల్లోనే జమఅవుతున్నాయని తెలిపారు.2016లో ఆధార్ బిల్లు పాసైతే గత 28 నెలల్లో 122 కోట్లకు పైగా ప్రజలు ఆధార్‌ను నమోదు చేసుకున్నారు.

త్వరలో డ్రైవింగ్ లైసెన్స్‌కు ఆధార్ అనుసంధానం

కేంద్ర ప్రభుత్వం త్వరలో ఆధార్‌ను డ్రైవింగ్ లైసెన్స్‌తో అనుసంధానం చేయటాన్ని చట్టబద్ధం చేయనుందని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. ఫాగ్వారాలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఆయన మాట్లాడుతూ త్వరలోనే డ్రైవింగ్ లైసెన్స్‌తో ఆధార్‌ను లింక్ చేయటాన్ని తప్పనిసరి చేస్తూ చట్టం తీసుకురానున్నామని కేంద్ర న్యాయ, ఎలాక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న విధానంలో ప్రమాదం చేసిన వ్యక్తి సంఘటన ప్రాంతం నుంచి పారిపోయి డూప్లికేట్ లైసెన్స్ తీసుకుంటున్నాడన్నారు. ఈ విధానం వల్ల నేరంచేసిన వ్యక్తి తప్పించుకుంటున్నాడన్నారు. ఆధార్‌లో పేరు మార్చుకోగలిగినా బయోమెట్రిక్‌ను మార్చలేమన్నారు. ఐరీస్, వేలిముద్రలను మార్చలేమని ఒకవేళ నిందితుడు డూప్లికేట్ లైసెన్స్‌కోసం వెళ్లినా ఆధార్‌తో అనుసంధానం చేయటం వల్ల అతనికి ఇంతకుముందే ఉన్న లైసెన్స్ వివరాలు వెల్లడవుతాయని రవిశంకర్ ప్రసాద్ వివరించారు.

వరల్డ్ రికార్డ్... 5 వేల కేజీల కిచిడీ



న్యూఢిల్లీ: ప్రముఖ చెఫ్ విష్ణు మనోహర్ మరో ప్రపంచ రికార్డు సృష్టించారు. 5వేల కిలోల ఖిచ్‌డీ తయారు చేసి వేలాది మందికి తినిపించారు. భీమ్ మహాసంఘమ్ పేరుతో బీజేపీ దళితులకు చేరువయ్యేందుకు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ఖిచ్‌డీని తయారు చేయించింది. ఢిల్లీ బీజేపీ నేతృత్వంలోని నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున వెనకబడిన వర్గాల వారికి ఆహ్వానించారు. ఖిచ్‌డీ కోసం 400 కిలోల బియ్యం, 100 కిలోల బీన్స్ గింజలు, 350 కిలోల కూరగాయలు, 10 కిలోల దేశవాలీ నెయ్యి, 100 లీటర్ల నూనె,2500 లీటర్ల నీరు, 250 కిలోల మసాలాలు వాడారు.నాగ్‌పూర్‌కు చెందిన చెఫ్ విష్ణు మనోహర్ ఈ వంటకాన్ని తయారు చేశారు. విష్ణు ఒక్కరే గతంలో 3వేల కిలో ఖిచ్‌డీ తయారు చేసిన వరల్డ్ రికార్డు సృష్టించారు. కిచ్‌డీని జాతీయ వంటకంగా ప్రకటించాలన్న లక్ష్యంతో ప్రపంచ రికార్డులకు శ్రీకారం చుట్టినట్లు విష్ణు మనోహర్ తెలిపారు. ఇటలీ పేరు చెప్పగానే పిజ్జా, చైనా పేరు చెప్పగానే సుషి గుర్తుకొచ్చినట్లుగానే భారత్ పేరు చెప్పగానే ఖిచ్‌డీ గుర్తుకు వచ్చేలా కృషి చేస్తున్నానన్నారు. ఢిల్లీలో 80 శాతం మంది సాయంత్రం ఖిచ్‌డీనే వంటకంగా చేసుకుంటారని.. అందుకే ఈ ఈవెంట్‌లో కిచ్‌డీ తయారీకి ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ సరికొత్త రికార్డుకు శ్రీకారం చుట్టింది.

తొలి ఫైట్‌కు సై

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలు కూడా అదే రోజు నిర్వహించనున్నారు.

ఓటర్లకే పోటీ అర్హత

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే అందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కొన్ని అర్హతలు నిర్ణయించింది. పోటీ చేయదలిచిన వ్యక్తి సర్పంచ్ స్థానానికి అయితే గ్రామ పంచాయతీలో, వార్డు స్థానానికి అయితే వార్డు పరిధిలో ఓటరుగా జాబితాలో పేరు నమోదై ఉండాలి. నామినేషన్ పరిశీలన తేది నాటికి అభ్యర్థి కనీస వయస్సు 21 సంవత్సరాలు పూర్తయి ఉండాలి. సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేసిన వారికి ప్రతిపాదకులు కూడా అదే పంచాయతీలో ఓటరై ఉండాలి. వార్డుకు అయితే అదే వార్డులో ఓటరుగా నమోదై ఉండాలి. ఒక అభ్యర్థి ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు వుంటే ఎన్నికల్లో పోటీకి అనర్హుడు. ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు పుట్టిఉంటే అర్హులే. అయితే 1995 మే 31కంటే ముందు ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు ఎన్నికలో పోటీకి అర్హులే. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల్లో పోటీ చేయాలంటే నామినేషన్ పరిశీలన రోజు నాటికి ఉద్యోగానికి రాజీనామా చేసి ఆమోదింపచేసుకుని ఉండాలి. మతిస్థిమితం లేని వారు ఎన్నికల్లో పోటీకి అనర్హులు. నామినేషన్లు చివరితేది 5గంటలలోపు వచ్చిన నామినేషన్లను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు. నామినేషన్ వేసిన వారు అవసరమైన డాక్యుమెంట్లను నామినేషన్ల పరిశీలన నాటికి సమర్పించి ఉండాలి. ఒక వ్యక్తి ఒక పదవికి గరిష్ఠంగా నాలుగు నామినేషన్లు వేయవచ్చు. చెల్లుబాటు అగు నామినేషన్లను రిటర్నింగ్ అధికారి చెల్లుబాటు నామినేషన్ల జాబితాలో ప్రకటించే వరకూ నిరీక్షించి సరిచూసుకోవాలి. నామినేషన్లను అభ్యర్థి లేదా తన ప్రతిపాదకుని ద్వారా రిటర్నింగ్ అధికారికి సమర్పించవచ్చు. రిటర్నింగ్ అధికారి గదిలోకి అభ్యర్థి లేదా ప్రతిపాదకునితోపాటు కేవలం ముగ్గురు వ్యక్తులను మాత్రమే అనుమతిస్తారు. ఒకసారి నామినేషన్ దాఖలు సమర్పించాక తిరిగి సంతకం మరిచానని అంటే అటువంటి నామినేషన్లు చెల్లుబాటు కావు. ఎన్నికల్ల పోటీ చేసే వ్యక్తి షెడ్యూలు కులాలు, షెడ్యూల్ తెగలకు, వెనుకబడిన కులాలకు చెందిన వారైతే తగిన కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు సమర్పించాలి. అప్పుడే నామినేషన్ల సందర్భంగా డిపాజిట్ చెల్లింపులో రాయితీ కూడా పొందేందుకు అర్హులవుతారు. కోర్టుల్లో శిక్షలు పడిన వారు, బెయిల్‌పై ఉన్నవారు ఎన్నికల్లో పోటీకి అనర్హులు.

డిపాజిట్లలో రాయితీలు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి ఎస్సీ, ఎస్టీ బీసీ కులాలకు చెందిన వారైతే రూ.1000, ఇతరులు రూ.2000 చెల్లించాలి. వార్డు స్థానాలకు పోటీ చేసే వారైతే ఎస్సీ, ఎస్టీ బీసీకు రూ.250, ఇతరులకు రూ500 డిపాజిట్‌గా నిర్ణయించారు.

ఏకగ్రీవ బాటలో శాంతినగర్



సర్పంచ్ బాసాని వెలంగిణి మేరి



ఉప సర్పంచ్ బాసాని గోపు జోజి రెడ్డి

ఎల్కతుర్తి, ప్రభన్యూస్ : వరంగల్ జిల్లా, ఎల్కతుర్తి మండలంలోని నూతనంగా ఏర్పడ్డ శాంతినగర్ నూతన గ్రామ పంచాయతీకి ఈ నెల 30 న జరుగనున్న సర్పంచ్ ఎన్నికల్లో గ్రామస్థులంతా ఏకమై ఏకగ్రీవానికి దిశగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఏక గ్రీవం అయితే రాష్ట్ర ప్రభుత్వం నుండి 10 లక్షల గ్రాంట్ గ్రామ అభివృద్ది కోసం విడుదల చేస్తున్నారు. గ్రామంలోని సర్పంచ్‌గా బాసాని వెలంగిణి మేరి పేరును ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. ఏదీ ఏమైనా కొద్దిరోజుల్లోనే అధికారికంగా వెలువడుతుందని గ్రామస్థులు ధీమా వ్యక్తం చేశారు.



పంచాయతీ బాధ్యత ఎమ్మెల్యేలదే

- రాష్ట్ర నాయకత్వం వేలు పెట్టొద్దు • గులాబీ బాస్ సంకేతాలు
- సొంతపార్టీలోనే పదవులకు తీవ్రపోటీ • పల్లెల్లో గులాబీ హవా



ఆంధ్రప్రభ, హైదరాబాద్: పల్లెపోరులో వేలుపెట్టొద్దని టీఆర్ఎస్ రాష్ట్రనాయకత్వం నిర్ణయించింది. స్థానిక ఎమ్మెల్యేలే ఆ బాధ్యతలు చూసుకోవాలని, మంచి విజయాలతో ప్రగతికి బాటలు వేసుకోవాలని సూచనలు అందించింది. పార్టీ రహితంగా జరిగే ఈ ఎన్నికలకోసం రాష్ట్ర పార్టీనుండి పర్యవేక్షించడం, ప్రచారం చేయడం లాంటివి ఏవీ ఉండవని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా తేల్చిచెపి న్నట్లు తెలుస్తోంది. పల్లెల్లో టీఆర్ఎస్‌కు అనుకూల వాతావరణం ఉండగా, పదవుల కోసం టీఆర్ఎస్ నేతలే పోటీపడుతున్నారు. వందల గ్రామపంచాయతీలలో టీఆర్ఎస్ వర్సెస్ టీఆర్ఎస్‌గానే పోటీజరిగే వాతావరణం ఉంది. విపక్ష కాంగ్రెస్ తాజా ఫలితాలతో మానసికంగానూ దెబ్బతినగా, ఎన్నికల ఉత్సాహానికి తోడు కొత్త పంచాయతీల ఏర్పాటు కూడా టీఆర్ఎస్‌కు కలిసివచ్చింది. ఈ నేపథ్యంలో పదవులకు అభ్యర్థుల ఎంపిక ఎమ్మెల్యేలకు కత్తిమీద సాముగా మారింది. నియోజకవర్గాల్లో పదవులకు పోటాపోటీ వాతా వరణం ఉండడం, ఎవరు గెలిచినా టీఆర్ఎస్ మద్దతుదారుడే మెజారిటీ పంచాయతీలలో సర్పంచ్‌గా ఉండే అవకాశం ఉందన్న అంచనాలుండడంతో స్థానిక నాయకత్వానికే ఎన్నికల వ్యవహారం వదిలేయాలని అధినేత కేసీఆర్ సూచించినట్లు సమాచారం. రాష్ట్ర నాయకత్వం ఈ ఎన్నికల వ్యవహారంలో జోక్యం చేసుకుంటే అక్కడి పంచాయతీలు, వర్గాలు మళ్ళీ కొత్త తలనొప్పులు తెచ్చిపెడతాయని ఈ పంచాయతీలు చూసుకోవడం కంటే స్థానిక నాయకత్వానికి ఎన్నిక వ్యవహారం వదిలేయడం బెటరన్న నిర్ణయానికొచ్చారు. ఎలాగూ ఫలితాల కోసం ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తారు, భవిష్యత్తులో పనితీరుకు దీనిని ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉంది కాబట్టి ఫలితాలపై ధీమాగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,751గ్రామపంచాయతీలుండగా, 12వేలకు పైగా పంచాయతీలు టీఆర్ఎస్ ఖాతాలోనే పడతాయన్న అంచనాలు, విశ్వాసం టీఆర్ఎస్ వర్గాలలో ఉంది. సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుండగా, ఏకగ్రీవ హవా కొనసాగుతుందన్న సమాచారం జిల్లాల నుండి పార్టీ కేంద్ర కార్యాలయానికి అందుతోంది.

ఓటరునమోదుపై దృష్టి

లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్లనమోదు అంశాన్ని టీఆర్ఎస్ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు రెండుసార్లు ప్రధానకార్యదర్శులతో నిర్వహించిన సమావేశాల్లోనూ ఓటర్లనమోదునే ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అత్యధిక ఓటర్లనమోదుకు లక్ష్యాలు కూడా విధించారు. రాష్ట్రపార్టీ కార్యాలయం నుండి దీనిని మానిటర్ కూడా చేస్తుండగా, ప్రతిరోజూ నియోజకవర్గాల వారీగా లేదా జిల్లాల వారీగా ఎంతమందిని కొత్త ఓటర్లుగా నమోదుచేశారో వివరాలు చెప్పాలని కేటీఆర్ చేసిన సూచనమేరకు సమాచారం అందిస్తున్నారు. ఓవైపు పంచాయతీ పోరు సాగుతుండగానే మరోవైపు సార్వత్రిక ఎన్నికలకోసం గతంలో గల్లంతైన ఓటర్లనమోదు కార్యక్రమం శరవేగంగా సాగుతోంది.

తిమ్మాపురం ఏకగ్రీవం

తీర్మానం చేసిన గ్రామస్థులు





సర్పంచ్ బిజ్జ స్వరూప



ఉపసర్పంచ్ పి. వీరస్వామి

బయ్యారం, ప్రభన్యూస్ : మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలంలో ఆది నుంచి ప్రత్యేకతను చాటుకుంటున్న మొట్లతిమ్మాపురం గ్రామం మరో మారు తన పేరును ఎన్నికల నేపథ్యంలో పతాకా శీర్షకన చేర్చడం కోసం గ్రామస్థులు తమ ఐక్యతను చాటుకున్నారు. పంచాయతీ పునర్వి భజనలో గతంలో రామచంద్రపురం గ్రామపంచాయతీలో ఉన్న మొట్లతిమ్మాపురం నూతన గ్రామపంచాయతీగా ఏర్పడింది. ప్రస్తుతం ఏర్పడిన పంచాయతీల్లో ఆ గ్రామంతో పాటు భద్రుతండా గ్రామంఉంది. పంచాయతీ పరిధిలో 155 కుటుంబాలు ఉండగా 560 మంది నివశిస్తున్నారు. అందులో 209 మంది మహిళా ఓటర్లు, 205 పురుష ఓటర్లు ఉన్నారు. పూర్తిగా గిరి జన గ్రామమైన మొట్లతిమ్మాపురం రిజర్వేషన్ ప్రక్రియలో సర్పంచ్ స్థానం మహిళకు కేటాయించగా, పంచాయతీలోని ఎనిమిది వార్డుల్లో నాలుగు మహిళలకు, నాలుగు పురుషులకు కేటాయించారు. ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు పది లక్షల ప్రోత్సహకాన్ని ప్రకటించింది. ఈ పరిస్థితిలో మోట్ల తిమ్మాపురం గ్రామస్తుల మధ్యలో ఆలోచన చోటుచేసుకున్నది. ఆలోచన వచ్చిందే తడువుగా గ్రామ పెద్దల సమక్షంలో గ్రామస్థులు చర్చలకు ఉపక్రమించారు. సాధ్యసాధ్యాలు, లాభనష్టాలు గ్రామసమస్యలు పలు దఫాలుగా చర్చించిన పిదప ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. సర్పంచ్ బిజ్జ స్వరూప, ఉపసర్పంచ్ పి. వీరస్వామితో పాటు ఎనిమిది వార్డులను కూడా ఏకగ్రీవంగా చేస్తూ తీర్మాణం చేశారు. దీంతో మండలంలో ఏకగ్రీవ పంచా యతీగా గిరిజన గ్రామం మిగిలిన గ్రామపంచాయతీలకు ఆదర్శంగా నిలిచింది. పూర్తి గిరిజన గ్రామ మోట్ల తిమ్మాపురం ఆది నుంచి ఐక్యతకు మారుపేరుగా నిలిచింది. నక్సల్స్ ప్రభావం ఉధృతంగా ఉన్న రోజుల్లో సైతం వివ్లవ గ్రూపులు ఎన్నిమార్లు గ్రామంపై ఆదిపత్యం చెలాయించడానికి ప్రయ త్నించినప్పటికి తమ గ్రామ ఉనికిని కాపాడుకుంటూ ఎవరితోను శతృత్వంలేకుండా ప్రజలు జీవనం సాగిస్తున్నారు. పూర్తిగా గిరిజన గ్రామం తిమ్మాపురం విద్యాభివృద్ధిలో కూడా గుర్తింపు పొందింది. దీంతో గ్రామస్థుల్లో సామాజికస్పృహ ఎక్కువే. ఈ నేపథ్యంలో సారా మహమ్మారిని, గుట్కా, అంబర్ లాంటి నిషేధ వస్తువులను సైతం గ్రామంలో విక్రియించకుండా చేస్తున్నారు. వీటిన్నంటికంటే కొన్ని దశాబ్దాలుగా ఆ గ్రామం నుంచి ఒక పోలీస్ కేసు కూడా నమోదు కాని గ్రామంలో చరిత్రలో ఉంది. ఇలాంటి ఘన చరిత్ర కలిగిన గ్రామం మరోమారు ఏకగ్రీవం కావడంతో రాష్ట్రం మరో సారి తనవైపు చూసుకునే చేసింది. ఈ ఆదర్శం మండలంలో మరిన్ని గ్రామాలకు మార్గం కావాలని అభ్యుదయ వాదులు ఆకాంక్షిస్తున్నారు.



ఆదివారం బేగంపేటలోని హోటల్ మనోహర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లాడ ఉత్సవ్ రీజినల్ మీట్‌లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా

పోలవరం నవయుగ రికార్డు



అమరావతి, ఆంధ్రప్రభ: దేశానికే గర్వకారణమైన బహుళార్ధ సాధక పోల వరం ప్రాజెక్టు ప్రపంచ చరిత్ర పుటల్లోకి ఎక్కబోతున్న శుభగడియలు సమీపిం చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల సుదీర్ఘ స్వప్నా న్ని సాకారం చేయబోతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు మరో అరుదైన ప్రపంచ రికార్డు ఆవి ష్కరణకు ఆది వారం శ్రీకారం చుట్టారు. ఇప్పటికీ కాంక్రీట్ పనుల్లో జాతీయ రికా ర్డు సృష్టించిన పోలవరం ప్రాజెక్టులో ప్రపంచ రికార్డు నమోదు చేసేందుకు ఆదివా రం తెరతీశారు. ఇందుకు సంబంధించిన పనులను గిన్నిస్ బుక్ వరల్డ్ ప్రతినిధుల పర్యవేక్షణలో ఆదివారం ఉదయం 8 గంటలకు లాంఛనంగా ప్రారంభమయ్యా యి. ఈ పనులు సోమవారం ఉదయం 8 గంటల వరకు ఏకధాటిగా జరగను న్నాయి. భారీ యంత్రాలుతో కాంక్రీట్ వేసే పనులను ఆరంభించారు. ఈ క్రమంలో ఉదయం 8 -9 గంటల మధ్యలో 1275 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేశారు. 9-10 మధ్య 1340 క్యూబిక్ మీటర్లు, 10-11 గంటల మధ్య 1380 క్యూబిక్ మీటర్లు, 11-12 మధ్య 1420 క్యూబిక్ మీటర్ల మేర కాంక్రీట్ వేశారు. 5వ గంటల్లో మొత్తం 6,797 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేయడం గమనార్హం. గిన్నిస్ బుక్ రికార్డు సృష్టిం చేందుకు రాష్ట్రప్రభుత్వం, కాంట్రాక్ట్ ఏజెన్సీ ఈ భారీ సవాల్‌ను స్వీకరించాయి. ఇప్పటికే 24 గంటల్లో 11,154 క్యూబిక్ మీ టర్ల కాంక్రీట్ పని చేసి, జాతీయ రికార్డు ను నెలకొల్పిన నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ ఈసారి ఏకంగా ప్రపంచ రికార్డు సృష్టించబోతున్నదని అంతా సర్వత్రా ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. ఈసారి 24 గంటల్లో 28వేలనుంచి 30వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి, గిన్నిస్ బుక్‌లోకి ఎక్కే ప్రయత్నం జరుగుతున్నది. గిన్నిస్ బుక్ ప్రతినిధి విశ్వనాధ్ ఆదివా రం పనులను దగ్గరుండి పరిశీలిస్తూ నమోదు చేయిస్తున్నారు. ఇప్పటి వరకు దుబా య్‌లో నమోదైన రికార్డును అధిగమించేందుకు పోలవరం ప్రాజెక్టు పనుల్లో భాగంగా 24 గంటల్లో 30వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసేందుకు కృషి చేస్తున్నా మని నవయుగ కంపెనీ ఎండీ బి.శ్రీధర్ తెలపారు. కాగా స్పిల్ చానల్‌లో జరుగు తున్న ఈ పనులను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుకు చెందిన 24మంది నిపుణులు పర్యవేక్షిస్తున్నారు. దుబాయ్‌లో ఒక టవర్ నిర్మాణానికి 2017 మే లో 36 గంటల్లో 21,580 ఘనపు మీటర్ల కాంక్రీట్ వేశారు. ఇప్పు డు ఏకంగా 30వేల ఘనపు మీటర్ల కాంక్రీట్ వేసి,ప్రపంచ రికార్డు సాధించేందుకు పనులు ప్రారం భించారు. ప్రతి 15 నిమిషాలకొకసారి కాంక్రీట్ ఎంత వేసింది గిన్నిస్ బుక్ ప్రతిని ధులు రికార్డు చేస్తున్నారు. సోమవారం ముఖ్యమంత్రి నారా చ ంద్రబాబు నాయుడు పనులను పర్యవేక్షించి,రికార్డు పనుల వివరాలను వెల్లడించనున్నారు.

పంచాయతీ అభ్యర్థులకు శిక్షణ

'జేడీ' లక్ష్మీనారాయణ సారథ్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పంచాయితీ ఎన్నికల్లో పోటీచేయబోయే అభ్యర్థులకు శిక్షణ, అవగాహన సదస్సును జాయిన్ ఫర్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (జేడీ) ప్రారంభించింది. జేడీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, మాజీ ఐపిఎస్ అధికారి వి. వి. లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లోని మెథడిస్ట్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించారు. ఈ నెల ఏడవ తేదీవరకు రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో పంచాయితీరాజ్ 2018చట్టం, 73,74వ రాజ్యాంగ సవరణలు, గ్రామ సర్పంచుల బాధ్యతలు, విధులు, హక్కులు, ఆదర్శ గ్రామాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. మొదటిరోజైన ఆదివారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో దేశంలోనే ఆదర్శ గ్రామంగా పేరుగాంచిన గంగదేవిప ల్లి గ్రామ రూపకర్త కూసం రాజమౌళి అభ్యర్థులకు మార్గదర్శనం చేశారు. పంచా యితీ రంగ నిపుణులు శ్రీరాములు శంకరయ్య పంచాయితీ రాజ్ చట్టంపై అవ గాహన కల్పించారు. చేవెళ్ళ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి గ్రామాభివృద్ధిలో యు వకుల పాత్ర, ఉపాధి కల్పనలపై వివరించారు. అభ్యర్థుల గెలుపు అంశంపై యువ సర్పంచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రసంగించారు.

చంద్రబాబుతో హాస్య నటుడు అలీ భేటీ


అమరావతి, ఆంధ్రప్రభ : ప్రముఖ సినీ హాస్య నటుడు అలీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఏకాంతంగా సమావేశమయ్యారు. ఆదివారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి వచ్చిన ఆయన సుమారు అర్ధగంట పాటు సీఎం చంద్రబాబుతో ఏకాంతంగా చర్చించారు. ఈ సందర్భంగా తాను వైకాపాలో చేరుతున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని అలీ ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. విశాఖ ఎయిర్‌పోర్టులో వైకాపా అధినేత జగన్‌ను యాదృశ్చకంగా కలిశానే కానీ దీనిలో ఎలాంటి రాజకీయ కోణం లేదని తెలిపారు. ఇది ఇలా ఉంటే సినీనటుడు అలీ చంద్రబాబుతో భేటీకి ముందు జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కూడా సమావేశమయ్యారు.

కమలనాథుల పన్నాగాలు

పారవు!

అవినీతికి కొమ్ముకాస్తున్న మోడీ


- మాటలు ఘనం.. చేతలు శూన్యం • ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారు: ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రాన్ని అస్థిరపరిచేందుకు ప్రధాని మోడీ వైకాపా అధినేత జగన్, తెరాస అధినేత కేసీఆర్‌లతో కలసి కుట్రలు పన్నుతున్నారని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సాగనివ్వనని సీఎం చంద్రబాబు అన్నారు. నరేంద్ర మోడీ అత్యంత వైఫల్య ప్రధాని అని, అన్ని రంగాల్లో ఆయన పూర్తిగా విఫలమయ్యారని విమర్శలు గుప్పించారు. ఇప్పటివరకు ఆయన చాలా మాటలు చెప్పారే కానీ వాటిలో ఏఒక్కటీ ఆచరణలోకి రాలేదని ఎద్దేవా చేశారు. నరేంద్ర మోడీ, అమిత్ షాలు దేశాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని, అసంబద్ద ఆర్థిక విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారని మండిపడ్డారు. ఆదివారం కృష్ణా జిల్లా పెనమలూరు మండల పరిధిలోని పునాదిపాడులో జరిగిన జన్మభూమి -మా ఊరు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ విధానాలను ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్‌యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతిలు పొత్తుపెట్టుకుంటే అఖిలేష్‌యాదవ్‌పై పాత కేసులను తిరగతోడుతున్నారన్నారు. ట్రిపుల్ తలాక్‌ను ఉపయోగించి ముస్లిం వర్గాలను ఇబ్బంది పెట్టి అణగదొక్కే ప్రయత్నం బిజేపి చేస్తోందని ఆరోపించారు. మరో వైపు ప్రశాంత రాష్ట్రమైన కేరళలో కూడా అనవసంగా జోక్యం చేసుకుని శాం తి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిప్పులు చెరిగారు. కోడి కత్తి పార్టీ టీడీపీ, ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంలో కూడా రాష్ట్రహక్కును హరిస్తూ కేసును ఎన్ఐఏకు అప్పగించిందని మండిపడ్డారు. విజయ్ మాల్యా, రాఫెల్ కుంభకోణంలో తమతప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం కేంద్రం చేస్తుందని ఆరోపిం చారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు గిన్నీస్ రికార్డులోకి ఎక్కనుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. 24 గంటల్లో 28 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులను పూర్తిచేసి ఈ రికార్డును నెలకొల్పనున్నట్లు తెలిపారు.

బాబు అస్త్రాలకు మోడీ శస్త్రాలు


కేడర్‌లో స్థైర్యం నింపేందుకు వ్యూహాలు




అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల వేడి రాజుకుంటున్న నేపథ్యంలో ఏపీలో బీజేపీని పటిష్ట పర్చేందుకు స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక సభలు, సమావేశాల ద్వారా పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని, ధైర్యాన్ని నింపడంతోపాటు ఎన్నికలను సమర్ధవంతంగా ఎదుర్కొనేలా వారిని కార్యోన్ముఖులను చేసేందుకు కసరత్తును ప్రారంభించారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీజేపీపైన, ప్రధాని మోడీపైన చేస్తున్న విమర్శలపై ఆ పార్టీ నేతలు పెద్దగా స్పందించిన దాఖలాలు లేవు. దీనికితోడు బీజేపీ అధిష్టానం క ూడా ముఖ్యమంత్రి ఆరోపణలు పెద్దగా పట్టించుకోకపోవడం, సరైన సమాధానం చెప్పకపోవడం వంటి కారణాలతో ఆ పార్టీ కేడర్‌లో కొంత నైరాశ్యం నెలకొంది. ఈ పరిస్థితుల్లో స్వయంగా ప్రధాని మోడీ రంగంలోకి దిగనుండటంతో మంచి స్పందన లభిస్తుందని ఆ పార్టీ పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తోంది. మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలకు స్వయంగా ప్రధానమంత్రే సమాధానం చెప్పేందుకు సిద్ధపడటంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం రానుందని ఆపార్టీ సీనియర్లు చెబుతున్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం ఏమేమి చేసిందో ప్రధానే స్వయంగా వివరిస్తారని చెబుతున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని పార్టీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలతో 90 రోజుల్లో కనీసం 25 సమావేశాల్లో పాల్గొనేలా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. జనవరి 2న ఒకసారి ప్రధాని కార్యకర్తలతో నమో యాప్ ద్వారా మాట్లాడిన సంగతి విధితమే.

అధికార మార్పు అనివార్యం

అనంత, విజయనగరం జిల్లాల సమీక్షల్లో పవన్



అమరావతి, ఆంధ్రప్రభ: కులాల మధ్య సఖ్యత కోరుకుంటాను కనుకే కులాల గురించి తాను మాట్లాడినంత సూటిగా ఏ రాజకీయ నాయకుడు మాట్లాడలేడని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. తాను ఏ ఒక్క కులానికీ బందీని కానని చెప్పారు. ఆలోచింప చేయడమే రాజకీయాల లక్ష్యమని, ఆ దిశగా జనసేన కార్యకర్తలు పయనం సాగించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్ధేశం చేశారు. మన లక్ష్యం మార్పు తీసుకురావడమేనని, పోరాటం ద్వారానే మార్పు సిద్దిస్తుందన్నారు. ఆ ప్రక్రియలో భాగంగా అధికారం రావచ్చని అన్నారు. జిల్లాల వారీ సమీక్షా సమావేశాల్లో భాగంగా ఆదివారం విజయవాడలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విజయనగరం, అనంతపురం జిల్లాల నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమావేశమై దిశానిర్ధేశం చేశారు. విజయనగరం జిల్లా వెనుకబాటుతనానికి స్థానిక నేతలే కారణం..కేవలం ఇద్దరు వ్యక్తులు జిల్లాని తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. ప్రత్యర్థులను బలంగా విమర్శించండి కానీ, వారి కులాలను మాత్రం ప్రస్తావించకండి అని అన్నారు. జనసేన పార్టీ ఓటు ద్వారా మార్పు తీసుకురావాలనుకుంటోంది..గానీ కులాల ద్వారా కాదు..ఇతర కులాల ప ట్ల సహనం, సంఘీభావం కలిగి ఉ ండాలి.. సమాజంలోని వ్యక్తులు అభద్రతా భావంతో గట్టిపడిపోయి ఉంటారు.. ఇటువంటి వ్యక్తులు ఉన్న సమయంలో పవర్ పాలిటిక్స్ వల్ల ఉపయోగం ఉండదు..సోషల్ ఇంజనీరింగ్ చేయాలి..అప్పుడే వారిలోని అభద్రతా భావం పోయి మన పోరాటంలో భాగంగా మారతారు.. రాజకీయాల్లో రాణించాలంటే నాయకులకు, కార్యకర్తలకు ఓపిక,సహనం అవసరం.. అవమానాలు కూడా ఎదురవుతూ ఉంటాయి. జయలలిత,మమతాబెనర్జీ లాంటి వాళ్లు ఎన్ని అవమానాలకు గురయ్యారో మనకు తెలుసు.. అటువంటి అవమానాలు తట్టుకునే శక్తి మనకు ఉండాల ని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.



మాఊరు-మారాజ్యం

తొలి విడతకు



నేటి నుంచి నామినేషన్లు | ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 461 పంచాయతీలకు ఎన్నిక

తాండూరు, కొడంగల్, షాద్‌నగర్ | మేడ్చల్ నియోజకవర్గాల్లో ఏర్పాట్లు

రంగారెడ్డి, ప్రభన్యూస్: పంచాయతీ ఎన్నికల సమరం మొదలైంది. మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ సోమవారం విడుదల కానుంది. అదేరోజు నుంచి నామినేషన్ల పర్వం కూడా మొదలవుతుంది. ఆయా పంచాయతీల్లో నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని తాండూరు, కొడంగల్, షాద్‌నగర్, మేడ్చల్ నియోజకవర్గాల పరిధిలోని 461 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికలు జరిగే పంచాయతీలు ఇవే....

తాండూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొడంగల్, తాండూరు నియోజకవర్గాలపరిధిలో 249 పంచాయతీల్లో ఈనెల 21న మొదటి విడత ఎన్నికలు జరగనున్నాయి. తాండూరులో 33, పెద్దేముల్ 37, బషీరాబాద్ 35, యాలాల 37 పంచాయతీలు, కొడంగల్ నియోజకవర్గం పరిధిలోని కొడంగల్‌లో 26, దౌల్తాబాద్ మండలంలో 33, బొమ్మరాజ్‌పేట మండలంలో 47 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. షాద్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొత్తూరు 12, నందిగామ 18, కేశంపేట29, కొందుర్గు 22, ఫరూఖ్‌నగర్ 47, చౌదరిగూడ 24 మండలాలతోపాటు రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాగద్ మండలంలో 27 పంచాయతీల్లో మొదటి విడత ఎన్నికలు జరగనున్నాయి. మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని శామీర్‌పేట మండలంలో 22 పంచాయతీలు, కీసర మండలంలో 11 పంచాయతీల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడత ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని 16 మండలాల పరిధిలోని 179 పంచాయతీలతోపాటు వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి.

పల్లెల్లో ప్రచార హోరు


పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయాలు వేడెక్కాయి. పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. వార్డుల వారీగా అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. ఏఏ వార్డులో ఎవరిని రంగంలో దింపితే విజయం సాధిస్తామనే లెక్కలు వేసుకుని సత్తా ఉన్న అభ్యర్థులను ఎంపిక చేశారు. నోటిఫికేషన్ రాగానే వార్డుల వారీగా సర్పంచి అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మొదటిరోజు సోమవారం నామినేషన్లు వేసే అవకాశం ఉన్నందున ఆ దిశగా పంచాయతీ అధికారులు ఏర్పాట్లు చేశారు.



ఉప సర్పంచ్ పదవులకు పోటీ తీవ్రమే..

రిజర్వుడు స్థానాలతోపాటు మహిళలకు రిజర్వు చేసిన పంచాయతీల్లో ఉప సర్పంచులు కీలకంగా మారనున్నారు. ఆ గ్రామాల్లో సర్పంచి పదవి కంటే ఉప సర్పంచ్‌కు పోటీ నెలకొంది. కొందరు ఎన్నికల ఖర్చు పెట్టుకుంటామని, అయితే ఉపసర్పంచ్ పదవి ఇవ్వాలని వార్డు మెంబర్లను మచ్చిక కూడా చేసుకుంటున్నారు. వార్డుమెంబర్లు ఉప సర్పంచ్‌ను ఎన్నుకోవడం ఆనవాయితీ. ఈనెల 21 ఉదయం 7 గంటలకు పంచాయతీ ఎన్నికలు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంటకు ముగుస్తాయి. రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. అదే రోజు విజయం సాధించిన వారి పేర్లు కూడా ప్రకటిస్తారు. వార్డుమెంబర్లు చేతులు ఎత్తి ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. ఆ రోజు వీలుకాకుంటే మరోరోజు ఎన్నుకుంటారు. మొత్తం మీద రిజర్వు, మహిళలకు రిజర్వు చేసిన పంచాయతీల్లో ఉప సర్పంచులు కీలకం కానున్నారు.

ఏకపక్షంగా ఏకగ్రీవానికి సన్నాహాలు



దేవరకొండ, ప్రభన్యూస్ : గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందేందుకు కొంతమంది సర్పంచ్ అభ్యర్థులు అడ్డదారులు తొక్కుతున్నారు. నల్గొండ జిల్లా, కొండమల్లేపల్లి మండలంలోని కొత్తబాయి గ్రామంలో ఇటీవల ఓ వర్గానికి చెందిన వారు ఓ వ్యక్తిని సర్పంచ్ చేసేందుకు రూ.14 లక్షలు వేలం పాడాడు. ఈ వేలం పాటను నిర్వహించి బాండు పేపర్‌పై ఒప్పంద పత్రం రాసిన వ్యక్తి అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడం విశేషం. అతను చదువుకోలేదంటూ చదువుకున్న యువకుని ఎన్నుకోవాలని, డబ్బులు తీసుకొని ఏకగ్రీవం చేయరాదని కొంతమంది యువత వ్యతిరేకిస్తున్నా ఏకపక్షంగా రూ.14 లక్షలకు తీర్మానం చేసుకొని రూ.5లక్షలను బయానాగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఏరుకొండ అంజయ్య తీసుకున్నాడు. దీనిని కొంతమంది యువకులు వ్యతిరేకిస్తూ నామినేషన్‌కు వెళ్తామని అవసరమైతే అధికారులకు ఫిర్యాదు చేస్తామని, న్యాయబద్ధంగా ఎన్నికలకు వెళ్తామని యువత అంటున్నారు. వర్గపోరుకు, ఘర్షణలకు దారి తీసే అవకాశం ఉందని ఎన్నికల అధికారులు పట్టించుకోవాలని యువత కోరుతోంది.

ఆదిలాబాద్ రెడీ



నేటి నుంచి 511 పంచాయతీలు.. 4,230 వార్డుల్లో ఎన్నికలు షురూ

ఆదిలాబాద్, ప్రభన్యూస్ బ్యూరో : పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. మొదటి విడతలో ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీల్లో నేడు నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మొత్తం 1,508 గ్రామపంచాయతీలు, 12,814 వార్డులు ఉండగా మొదటి విడుతలో 511 సర్పంచ్ పదవులకు, 4,230 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని 26 మండలాల్లో మొదటి విడుత ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఆరు మండలాల్లో 153 సర్పంచ్ పదవులకు 1,240 వార్డు పదవులకు మొదటి విడుతలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని ఏడు మండలాల్లో 134 సర్పంచ్‌లకు, 1026 వార్డు సభ్యుల పదవులకు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆరు మండలాల్లో 113 సర్పంచ్ పదవులకు, 992 వార్డు పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో మొదటి విడుతలో జిల్లాలోని ఏడు మండలాల్లో 111 సర్పంచ్ పదవులు, 972వార్డు పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది. భద్రత కోసం పోలీసు బలగాలను నియమించారు. సమస్యాత్మక ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సీసీటివి కెమెరాలు ఏర్పాటు చేశారు. వీడియోలను చిత్రీకరించనున్నారు. బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. మొదటి విడుతలో ఒక్కొక్క జిల్లాలో 2800ల మంది చొప్పున ఉద్యోగులను ఎన్నికల విధుల్లో నియమించారు. బ్యాలెట్ పత్రాలు ఇప్పటికే సిద్ధం చేసి మండలాలకు పంపించారు. సర్పంచ్ అభ్యర్థికి గులాబి రంగు బ్యాలెట్ పేపర్, వార్డు మెంబర్‌కు తెల్లరంగు బ్యాలెట్ పేపరును సిద్ధం చేశారు.

ఏకగ్రీవ ఒప్పందం.. తాగి తన్నులాట

ఐనవోలు, ప్రభన్యూస్ : వరంగల్ జిల్లా, ఐనవోలు మండలంలో గ్రామపంచాయతీ పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకొని మద్యం మత్తులో తన్నుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఐనవోలు మండలంలోని నందనం నుంచి కొత్తగా ఏర్పడిన రాంనగర్ పంచాయతీ జనరల్ స్థానంగా ఖరారైంది. ఏకగ్రీవంగా పాలక వర్గాన్ని ఎన్నుకుందామని టీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు అంగీకారానికి వచ్చి చర్చలు జరిపారు. 4 రోజుల పాటు జరిగిన చర్చల్లో సర్పంచ్ పదవి టీఆర్ఎస్‌కు, ఉప సర్పంచ్ పదవి కాంగ్రెస్‌కు మిగిలిన వార్డు స్థానాలు చెరిసగం తీసుకునేలా తీర్మానం చేసుకొని శుభాకాంక్షలు కూడా చెప్పుకున్నారు. అయితే ఒక్కొక్కరిచే నామినేషన్ వేయించి అధికారికంగా ఖరారయ్యేందుకు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. సర్పంచ్‌గా ఎంపికైన అభ్యర్థి ఇరుపార్టీల నాయకులకు పున్నేలు క్రాస్‌రోడ్డు వద్ద బార్ అండ్ రెస్టారెంట్‌లో మందుపార్టీ ఇచ్చాడు. ఉప సర్పంచ్ అభ్యర్థికి, టీఆర్ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. మాట మాట పెరిగింది. పిడిగుద్దులు గుద్దుకొని చొక్కాలు, పాయింట్లు చినిగిపోయేలా కొట్టుకున్నారు. దీంతో రెండు పార్టీలు విడిపోయి మామునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చిందని ఇరు పార్టీల నాయకులు మదన పడుతున్నారు.

4 జిల్లాలు 414 పంచాయతీలు



ఉమ్మడి కరీంనగర్‌లో 84 కొత్త పంచాయతీల్లోనూ ఫైట్

కరీంనగర్, ప్రభన్యూస్ బ్యూరో : పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి కరీంనగర్‌లోని నాలుగు జిల్లాల్లో 1211 గ్రామపంచాయతీలు ఉండగా మొదటి విడతలో 414 గ్రామాల్లో ఎన్నికలు జరగనున్నాయి. నాలుగు జిల్లాల పరిధిలో కొత్తగా ఏర్పడ్డ పంచాయతీలలో మొదటి విడతలో 84 పంచాయతీలకు ఎన్నికలు తొలిసారి జరుగుతున్నాయి. వీటిలో కరీంనగర్ జిల్లాలో 14, జగిత్యాలలో 29, పెద్దపల్లిలో 27, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 14 కొత్త పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మొదటి విడత ఎన్నికలు జనవరి 21నుండగా 7న నోటిపికేషన్ విడుదల చేస్తారు. సోమవారం నుంచే నామినేయన్ల స్వీకరిస్తారు. 9 వరకు నామినేషన్లు స్వీకరించి 10 తేదీన పరిశీలిస్తారు. 11న ఉపసంహరణ ఉంటుంది. జనవరి 21న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుంది, ఆ తరువాత లెక్కింపు ప్రారంభించి ఎన్నికల ఫలితాలను విడుదల చేస్తారు. పంచాయతీ ఎన్నికల్లో తొలిసారిగా నోటా గుర్తును కూడ ప్రవేశపెడుతున్నారు. గిరిజనులకు రిజర్వు కాబడ్డ గ్రామ పంచాయతీలతోపాటు జనాభా తక్కువ ఉన్న పంచాయతీలలో, ఆదర్శ గ్రామాలలో ఏకగ్రీవ ఎన్నిక కోసం ఎమ్మెల్యేల నుంచి మండల, గ్రామ స్థాయి నేతల వరకు ప్రయత్నిస్తున్నారు. వారి ప్రయత్నాలు మొదటి విడతలో ఏమేరకు ఫలిస్తాయో జనవరి 9 న తేలుతుంది.

- కరీంనగర్ జిల్లాలో మొత్తం 313 గ్రామపంచాయతీలు ఉండగా మొదటి విడతలో మొత్తం 97 గ్రామాలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఇందులో చొప్పదండి మండలంలోని 16 గ్రామాలు, గంగాధర మండలంలోని 33 గ్రామాలు, కరీంనగర్ రూరల్ మండలంలోని 17 గ్రామాలు, రామడుగు మండలంలోని 23 గ్రామాలు, కొత్తపల్లి మండలంలో 08 గ్రామాలకు ఎన్నికలు నిర్వహిస్తారు.
- పెద్దపల్లి జిల్లాలో మొత్తం 263 పంచాయతీలు ఉండగా మొదటి విడతలో 106 గ్రామపంచాయతీలకు, 962 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. ఇందులో మంథని మండలంలోని 34, ముత్తారం మండలంలోని 14, కమాన్ పూర్ మండలంలోని 9, రామగిరి లోని 16 , పాలకుర్తి మండలంలోని 19, అంతర్గాం మండంలోని 14 గ్రామ పంచాయతీలలో నామినేషన్ల స్వీకరణ నేటి నుంచి ప్రారంభం కానుంది.
- జగిత్యాల జిల్లాలో మొత్తం 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి, మూదటి విడతలో 131 గ్రామ పంచాయతీలకు 1146 వార్డులకు నామినెషన్లు స్వీకరిస్తారు. జిల్లాలోని బీర్‌పూర్ మండలంలోని 15 గ్రామాలు, బుగ్గారంలోని 11, ధర్మపురిలోని 25, సారంగాపూర్ 18, రాయికల్ మండలంలోని 32, వెల్గటూరు మండలంలోని 30 గ్రామ పంచాయతీలలో నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది.
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొత్తం 255 గ్రామపంచాయతీలు ఉన్నాయి, మొదటి విడతలో 80 పంచాయతీలకు, 722 వార్డులకు మొదటి విడతలో ఎన్నికలు జరుగుతాయి. రుద్రంగి మండలంలోని 10 గ్రామాలు, చందుర్తిలోని 19, వేములవాడలోని 11, వేములవాడ రూరల్ లోని 17, బోయినపల్లిలోని 23 గ్రామాలలో తొలివిడత ఎన్నికలు జరుగుతున్నాయి.



పంచాయతీ ఫిర్యాదులకు ప్రత్యేక సెల్

ఈసీ కార్యదర్శి అశోక్ కుమార్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా తలెత్తే వివాదాలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్టు ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ తెలిపారు. ఆఫీస్ సమయాలతోపాటు అదనంగా రాత్రి 9నుంచి ఉదయం 9గంటలవనకూ ఈ సెల్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు తెలిపారు.

ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు చేయదలిచినవారు 040-29802895 నంబర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులకు తగు చర్యల నిమిత్తం తెలియచేయనున్నట్టు ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



సర్పంచ్ చదువుకోవాలా?

ప్రజా ప్రతినిధులు చదువుకోవాలా? చదువుకున్న వారే ప్రజా ప్రతినిధులుగా ఉండాలా? పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలంటే కనీస విద్యార్హత తప్పనిసరా? చదువు లేని వారు.. సర్పంచులుగా పని చేయలేరా? గ్రామాభివృద్ధికి చదువుకున్న సర్పంచు ఉంటేనా సాధ్యమవుతుందా? ప్రభుత్వ పథకాలను, ప్రజల అవసరాలను తెలుసుకోవడానికి విద్యాగంధం ఉండాల్సిందేనా? ఇలాంటి ప్రశ్నలు శాసనకర్తలనూ వేధించాయి. నిజానికి అక్షరాస్యత అన్ని రంగాల్లోనూ ఆవశ్యమే! చదువుకొని ఉండడం అన్ని వేళలా ఉపయోగమే! కానీ, సువిశాల భారతదేశంలో ఎంతో కాలంగా విద్యాసుమాలకు దూరంగా ఉన్న మన పల్లెటూళ్లలో కనీస విద్యార్హతను పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే వారికి విధించడం ఎంత వరకు సబబు అనే ప్రశ్న జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. దీనిపై రాజ్యాంగ నిర్మాత బాబా సాహేబ్ అంబేద్కర్ ఏమన్నారో ఒకసారి చూద్దాం.

1928లో భారత్‌ను సందర్శించిన సైమన్ కమిషన్‌కి అప్పుడే బీఆర్ అంబేద్కర్ ఒక మెమోరాండం సమర్పించారు. పరిపాలన సంబంధమైన బాధ్యతలు నిర్వహించేవారు తప్పనిసరిగా చదువుకొని ఉండాలని వాదించే వారు రెండు తప్పులు చేస్తున్నారని అంబేద్కర్ ఆ మెమోరాండంలో పేర్కొన్నారు. నిరక్షరాస్యులు తప్పనిసరిగా తెలివి తక్కువ వారేనని అనడం మొదటి తప్పుగా ఆయన పేర్కొన్నారు. చదువుకున్నవారు తెలివితేటల విషయంలో చదువులేని వారికన్నా అత్యధికులని భావించడం రెండో తప్పని అంబేద్కర్ స్పష్టం చేశారు. మంచి రాజకీయనాయుడంటే నిజాయితీగా, బాధ్యతాయుతంగా సామాన్య ప్రజలతో మమేకమయ్యే అర్హత ఉండడం కీలకమని, సమస్యలు వచ్చినప్పుడు వాటిని ఎదుర్కొనే తెలివితేటలు, పరిష్కారాలు చూపగలిగే సత్తా ఉండాలంటారు.

రాజస్థాన్‌లో రివర్స్ సీన్!

వసుంధర రాజె ప్రభుత్వం రాజస్తాన్ పంచాయతీలకు ఎన్నికయ్యే వారికి కనీస అర్హత విధించారు. పంచాయతీలకే కాకుండా పురపాలక సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలంటే చదువుకొని ఉండాలనే నిబంధన తెచ్చారు. పంచాయతీ, పురపాలక సంస్థలకు పోటీ చేసేవారు పదో తరగతి పాసై ఉండాలని, సర్పంచుగా పోటీ చేసేవారు ఎస్సీ, ఎస్టీ అయితే అయిదు వరకు, మిగిలిన వారు ఎనిమిది వరకు చదివి ఉండాలి. అయితే గెహ్లాట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఈ చదువు నిబంధనను ఎత్తేసింది. రాజస్థాన్ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యపై పలు విమర్శలు వచ్చాయి. విద్యావంతులకే ఎన్నికల్లో అవకాశం కల్పించే నిబంధనను ఎత్తేసిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరోగమన మార్గంలోకి వెళ్లిందనే విమర్శలు వెల్లువెత్తాయి. చదువుకున్న వారికే ఎన్నికల్లో పోటీ చేసే అర్హత ఉండాలని వాదించారు. అయితే 2015లో రాజె ప్రభుత్వం పంచాయతీ, పురపాలక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారికి విదార్హతలు తప్పనిసరి అని చట్టం తీసుకొచ్చినప్పుడూ, దానిపైనా విమర్శలు వచ్చాయి. అయితే అదే ఏడాది హరియాణ ప్రభుత్వం కూడా ఇలాంటి నిబంధనలే తీసుకొచ్చింది.

నేరస్థులు కాకుండా ఉంటే చాలు!

ఇక రాజ్యాంగం ప్రకారం ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలవడానికి ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదు. రాష్ట్ర మంత్రిగా లేదా కేంద్ర మంత్రిగా పని చేయడానికి కూడా విద్యార్హతలతో సంబంధమే లేదు. ఇప్పటికీ ప్రపంచ నిరక్షరాస్యుల్లో 35 శాతం మంది భారత్‌లోనే పోగుపడిన నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా విద్యావంతులే అయి ఉండాలన్న నిబంధన ఎంత మాత్రం సరికాదనే వాదనలూ ఉన్నాయి. దళితులు, మహిళల విషయంలో నిరక్షరాస్యత మరీ ఎక్కువగా ఉంది. విద్యావంతులే పోటీ చేయాలన్న నిబంధన వీరికి గుదిబండగా మారుతుందని అంటున్నారు. చదువుకోకపోయినా.. తమ ప్రాంత సమస్యలు, అవసరాల గురించి, సామాజిక స్థితిగతుల గురించి వీరి జ్ఞానాన్ని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదనే వారూ ఉన్నారు. అక్షరాస్యత కన్నా.. నేరస్థులు చట్టసభలకు ఎన్నిక కాకుండా మరింతగా కఠిన నిబంధనలు అమలు చేస్తే ప్రజాస్వామ్య సౌధానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందనే భావన వ్యక్తమవుతోంది.



ఎన్.టి.ఆర్. కథానాయకుడులో వెంకటేశ్వర స్వామిగా బాలకృష్ణ



అఖిల్

మిస్టర్ మజ్ను హార్ట్ బ్రేక్ సాంగ్

అఖిల్ అక్కినేని కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం మిస్టర్ మజ్ను. వెంకీ అట్లూరి దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర సినీచిత్ర, ఎల్ఎల్‌పి పతాకాలపై బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. కాగా చిత్రీకరణ పూర్తికావచ్చిన ఈ చిత్రం మిగిలిన పనులు పూర్తిచేసి, ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు తీసుకువి వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించి ఏమైనదో...పలుకు మరచినట్టు...పెదవికేమైనదో...టైటిల్ సాంగ్‌ను విడుదలచేయగా...అద్భుతమైన స్పందన లభించినట్లు చిత్రబృందం తెలియజేసింది. కాగా ఈ చిత్రంలోని హార్ట్ బ్రేక్ సాంగ్ నాలో నీకు...నీలో నాకు ఇక సెలవేనా...ప్రేమ కానీ ప్రేమ వదులుకుంటున్నా...అంటూ సాగే సాహిత్యాన్ని ఆదివారం విడుదల చేసినట్లు వారు తెలిపారు. అఖిల్ అక్కినేని సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నాగబాబు, ప్రియదర్శి, జయప్రకాష్, హైపర్ ఆది తదితరులు ముఖ్య తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: ధనుష్, పాటలు: శ్రీమణి, సినిమాటోగ్రఫీ: జార్జ్ సి.విలియమ్స్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: అవినాష్ కొల్లా, కొరియోగ్రఫీ: శేఖర్.



కైరా అద్వాని

బాలీవుడ్

బాద్‌షా షారుక్‌ఖాన్ కొత్త చిత్రానికి సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి. భారీ అంచనాల మధ్య భారీ బడ్జెట్‌తో

కొత్త చిత్రం పనిలో

రూపొందిన జీరో చిత్రం ఆయనకు నిరాశనే మిగిల్చింది. ఆశించినంతగా ఆ చిత్రం బాక్సాఫీసు వద్ద కలెక్షన్లను రాబట్టలేకపోయింది. ఈ నేపథ్యంలో తన కొత్త చిత్రంతోనైనా ఆయన ప్రేక్షకాభిమానులను మెప్పించాలని అనుకుంటున్నారు. ప్రస్తుతం బయోపిక్‌ల ట్రెండ్ నడుస్తున్న సంగతి వేరుగా చెప్పనక్కరలేదు. వివిధ భాషలకు చెందిన ప్రముఖ నటీనటులు బయోపిక్‌లు చేసేందుకు మొగ్గుచూపుతున్న నేపథ్యంలో షారుక్‌ఖాన్ కూడా రాకేష్‌శర్మ బయోపిక్‌లో నటించేందుకు సన్నద్ధమవుతున్నారు. అంతరిక్షంలో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా రాకేష్‌శర్మ అందరికీ సుపరిచితమే. మొదట ఈ చిత్రానికి సారే జహాసే అచ్చా అనే టైటిల్‌ను ఈ చిత్రానికి అనుకున్నా...ఇప్పుడు దానిని సెల్యూట్‌గా మార్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. అనురాగ్ బసు దర్శకత్వం వహించనున్న ఈ చిత్రాన్ని రోనీ స్క్రూవాలా, సిద్ధార్థ్‌రాయ్‌కపూర్ సంయుక్తంగా నిర్మించబోతున్నారు. ఇదిలావుండగా...ఈ చిత్రంలో షారుక్ ఖాన్ సరసన ఫాతిమా సనా షేక్‌ను ఎంపిక చేసేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్లు బాలీవుడ్ వర్గాల భోగట్టా. గతంలో దంగల్, థగ్స్ ఆఫ్ హిందుస్థాన్ వంటి సినిమాలలో ఫాతిమా సనా షేక్ నటించిన సంగతి తెలిసిందే. మరోవైపు ఫాతిమా కూడా ఇలాంటి సినిమాలలో అవకాశం రావడం అరుదు అని...ఆ అవకాశం నాకు లభిస్తే అంతకంటే కావాల్సింది ఇంకేముంది అని అంటోందట..




ఫాతిమా సనా షేక్

బన్ని సరసన?

బాలీవుడ్ భామలు టాలీవుడ్‌లో నటించడం కొత్తేమీ కాదు. కాకపోతే ఎప్పుడో ఓ సినిమాలో నటించి... మళ్లీ బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉంటుంటారు. అయితే కైరా అద్వాని ఇందుకు భిన్నంగా తెలుగులో వరుస సినిమాలకు పచ్చజెండా ఊపుతోంది. మహేష్‌బాబు సరసన భరత్ అనే నేను చిత్రంలో కథానాయికగా నటించడం ద్వారా టాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన ఆమె అంతకుముందు కొన్ని బాలీవుడ్ సినిమాలు చేసింది. తెలుగులో నటించిన తొలి చిత్రమే ఘన విజయం సాధించడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. అయితే ఆ సినిమా విడుదలకు ముందే రామ్‌చరణ్ సరసన వినయ విధేయ రామ చిత్రంలో నటించే అవకాశాన్ని అందిపుచ్చుకుంది. సంక్రాంతికి విడుదల కానున్న ఆ సినిమా కూడా తన కెరీర్‌ను మరింత మలుపు తిప్పుతుందని కైరా ఎంతో నమ్మకంగా ఉంది. ఇప్పుడు ఆ రెండో సినిమా విడుదల కాకమునుపే ఇంకో భారీ సినిమాలో ఆమెకు అవకాశం లభించినట్లు పరిశ్రమలో వినిపిస్తోంది. అల్లు అర్జున్ సరసన నటించే అవకాశం ఆమెను వెతుక్కుంటూ వచ్చిందని...దీంతో ఆమె క్రేజ్ మరింతగా పెరగనుందని అంటున్నారు.

నా పేరు సూర్య... చిత్రం తర్వాత నూతన చిత్రం కోసం అల్లు అర్జున్ కొంత గ్యాప్ తీసుకున్నారు. ఎవరి దర్శకత్వంలో ఆయన నటించనున్నారనే అంశానికి ఎట్టకేలకు తెరపడింది. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించబోతున్నారన్న వార్త వెలువడగానే...ఆయన సరసన కథానాయిక ఎవరన్న అంశంపై కైరా అద్వాని అయితే బావుంటుందన్న ఆలోచన చిత్రబృందానికి వచ్చిందని అంటున్నారు. ఆ మేరకు కథానాయికగా ఆమెను ఎంపిక చేసేందుకు సంప్రదింపులు జరుపుతున్నారట. గీతా ఆర్ట్స్, హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించబోయే ఈ చిత్రం షూటింగ్ ఈ నెల లోనే ఆరంభం కానుంది.

నెలాఖరుకు సూపర్ 30



హృతిక్ రోషన్

బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ నటిస్తున్న కొత్త చిత్రం సూపర్ 30. వికాస్ బాల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విద్యావేత్త ఆనంద్ కుమార్ జీవిత కథతో ఈ సినిమా తెరకెక్కింది. పాట్నా నగరానికి చెందిన ఆనంద్...సూపర్ 30 అనే కార్యక్రమం ద్వారా అత్యంత ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ఎంపిక చేసి వాళ్లకు ఐఐటీ ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటి దాకా సూపర్ 30 ద్వారా ఎందరో పేద విద్యార్థులు ఐఐటీలో ప్రవేశం పొందారు. ప్రపంచంలో ఎందరినో ఆలోచింపజేసింది ఆనంద్ కుమార్ కృషి. సమాజం పట్ల ఆయనకున్న సేవాదృక్పథం ఇప్పుడు బాలీవుడ్‌ను ఆకర్షించింది. ఈ నేపథ్యంతోనే సూపర్ 30 రూపొందింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సూపర్ 30లో నటించడంపై హృతిక్ స్పందిస్తూ....మన జీవితాల్లో అత్యంత గొప్ప విషయం సేవ. సమాజానికి, మన తోటి మనుషులకు సాయం చేయడం అనేది అత్యుత్తమం. నా పిల్లలకు ఇదే విషయాన్ని చెప్పాలని ప్రయత్నిస్తుంటాను. రేపు నేను వాళ్లకు ఇవ్వబోయే అసలైన ఆస్తి సేవా దృక్పథమే అనుకుంటాను. ఈ సామాజిక సేవ మన చుట్టూ సానుకూల వాతావరణాన్ని ఏర్పరుస్తుంది. తద్వారా ప్రపంచాన్ని మార్చే శక్తినిస్తుంది. అన్నారు. ఈ నెల 25న సూపర్ 30 విడుదలకు సిద్ధమవుతోంది.

వండర్ వుమెన్ అవ్వాలని ఉంది...!

హాలీవుడ్‌లో సూపర్ హీరో చిత్రాలంటే కథానాయకులే గుర్తొస్తారు. తొలిసారి ఓ నాయికను సూపర్‌హీరోగా చూపిస్తూ రూపొందిన చిత్రం వండర్ ఉమెన్. డీసీ కామిక్స్ రచన ఆధారంగా దర్శకుడు పాటీ జెన్‌కిన్స్ ఈ చిత్రాన్ని రూపొందించారు. వార్నర్ బ్రదర్స్ సంస్థ పంపిణీ చేసిన వండర్ ఉమెన్..ప్రపంచ వ్యాప్తంగా వసూళ్లు కొల్లగొట్టింది. పెట్టుబడికి ఏడింతల లాభాలను తీసుకొచ్చింది. ఈ చిత్ర స్ఫూర్తితో మరింతమంది హాలీవుడ్ నాయికలు సూపర్‌హీరో చిత్రాల్లో నటించాలని కోరుకుంటున్నారు. తాము సూపర్ హీరోలు అవ్వాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇలాంటి వాళ్లలో ముందుగా స్పందించింది రాచెల్ వైజ్. మమ్మీ చిత్రాలు చూసిన వాళ్లంతా ఈ నాయికను అభిమానిస్తారు. ఈ నాయిక ప్రస్తుతం సూపర్ హీరో కావాలనుకుంటోంది. ఈ విషయంపై రాచెల్ మాట్లాడుతూ...చిన్న చిత్రాలు చేసే ఉద్దేశంలో నాలో ఉన్నా...భారీ చిత్రాల్లో భాగమయ్యేందుకు ఆత్రుతగా ఉన్నాను. నాయిక ప్రధాన చిత్రాలు చేయాలనే ఆశ ఎక్కువగా కలుగుతోంది. ఎవరైనా అవకాశం ఇస్తే సూపర్ హీరోగా నటిస్తాను. వండర్ వుమెన్ చూశాక అలాంటి చిత్రాన్ని చేయాలనే కోరిక పెరిగింది. అని చెప్పింది.

షారుక్ ఖాన్



రాచెల్ వైజ్

నదియా నటన హైలైట్‌గా దేవి

గతంలో కథానాయికగా పేరు తెచ్చుకున్న నదియా ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టుగా ముఖ్యపాత్రలలో మెరుస్తున్న సంగతి తెలిసిందే. రీఎంట్రీలో దృశ్యం, అత్తారింటికి దారేది వంటి సినిమాలు ఆమెకెంతో పేరు తెచ్చిపెట్టాయి. తెలుగుతో పాటు తమిళ ప్రేక్షకులకు సుపరిచితమైన ఆమె ప్రధాన పాత్రలో నటించిన తిరక్కు వరతకయ అనే తమిళ చిత్రం ఇప్పుడు తెలుగులో దేవి పేరుతో అనువాదమైంది. మహిళా దర్శకురాలు తులసీదాస్ దర్శకత్వం వహించారు. కె.కె.ఆర్. క్రియేషన్స్ పతాకంపై కె.ప్రియభారతి సమర్పణలో కర్రి సత్యనారాయణరెడ్డి, కె.కృష్ణ, సబ్బిళ్ళ వెంకట్‌రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ నెలాఖరులో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇందులో నదియా స్పెషల్ సి.బి.ఐ. అధికారిగా నటించింది.. సస్పెన్స్, క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో సాగే చిత్రమిది. ఓ మర్డర్ మిస్టరీని ఛేధించే క్రమంలో పరిశోధన అధికారిగా నదియా అద్భుతమైన నటనను కనబరిచింది. హారర్ సన్నివేశాలు, గ్రాఫిక్స్ హైలైట్‌గా నిలుస్తాయి. పాత్రధారులతో పాటు దర్శక, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు సైతం అంతా మహిళలే రూపొందించిన ఈ చిత్రం తమిళంలో మంచి విజయాన్ని సాధించింది. ఇలాంటి చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించాలన్న సదుద్దేశ్యంతో మేం అనువదించాం. ఆద్యంతం ఆసక్తిదాయకంగా సాగే ఈ చిత్రంలో ఐదు పాటలున్నాయి అని చెప్పారు. ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో కోవై సరళ, ఇనియా, శోభికామోహన్ తదితరులు నటించగా...ఈ చిత్రానికి మాటలు: శ్రీసాయి, పాటలు: కల్లూరి శేఖర్, సంగీతం: ఎం.జి.శ్రీకుమార్, కెమెరా: సంజీవ్ శంకర్.



క్రీడాప్రభ

30 ఏళ్ల తర్వాత భారత్‌కు సిరీస్

ఆస్ట్రేలియా ఎదురీత

ఆసీస్ బ్యాట్స్‌మెన్‌ను నిలువరించిన భారత్ బౌలర్లు

- తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకే ఆలౌట్
- ఫాలో ఆన్ ఆడుతూ 6/0







చివరి టెస్ట్‌లో ఆస్ట్రేలియా ఓటమిని తప్పించుకోవడానికి ఎదురీదుతోంది. ఫాలో ఆన్ ఆడుతూ.. ఇంకా 316 పరుగుల వెనకబడ్డది. ఆటకు నేడు చివరిరోజు కావడంతో ఆస్ట్రేలియా ఓటమి తప్పించుకోవడానికి వికెట్లను కాపాడుకుంటూ చివరికంటా నిలిస్తే... మ్యాచ్ డ్రా అవుతుంది. లేకపోతే ఆసీస్ ఇన్నింగ్స్ ఓటమిని ఎదుర్కొంటుంది. ఈ టెస్ట్ డ్రా అయినప్పటికి సిరీస్ భారత్ వశమవుతుంది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2-1 లీడ్‌లో ఉంది. ఈ టెస్ట్‌ను గెలిచి ఆసీస్ సిరీస్‌ను డ్రా చేసుకుందామన్న ఆశలకు భారత బ్యాట్స్‌మెన్, బౌలర్లు గండికొట్టారు. ఆస్ట్రేలియాపై తొలి టెస్ట్‌ను ఆడుతున్న కుల్దీప్ యాదవ్ 5 వికెట్లు పడగొట్టి ఆ జట్టు పతనాన్ని శాసించాడు.

సిడ్నీ: నాలుగో టెస్ట్ ఆటకు వరుణుడు అడ్డంకిగా మారాడు. నాలుగోరోజైన ఆదివారం కూడా వెలుతురు సరిగాలేకపోవడం, రాత్రంతా వర్షం కారణంగా మైదానం చిత్తడిగా మారడంతో మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఆసీస్ తన తొలి ఇన్నింగ్స్ ఓవర్ నైట్ స్కోరు 236/6తో బ్యాటింగ్ కొనసాగిస్తూ.. 300 పరుగులకు ఆలౌటయింది. దీనితో ఆస్ట్రేలియా ఫాలో ఆన్ ఆడాల్సి వచ్చింది. కుల్దీప్ 5/99 వికెట్లు తీసి ఆసీస్ బ్యాటింగ్‌ను కూల్చడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగో రోజు ప్రారంభించగానే భారత్ కొత్త బంతిని తీసు కుంది. కమిన్స్ 25(44బంతులు, ఫోర్లు-6)ను ఆట ప్రారం భించిన కొద్ది సేపటికే షమీ క్లీన్ బౌల్డ్ చేయడంతో క్రీజులోకి మిచెల్ స్టార్క్ వచ్చాడు. అనంతరం ప్రమాదక రంగా మారు తున్న హ్యాండ్స్‌కోంబ్ 37(111 బంతులు, ఫోర్లు-5)ను బుమ్రా అద్భుతమైన బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు. నాథన్ లియాన్ బ్యాటింగ్‌కు వచ్చాడు. లియాన్ ఐదు బంతులు ఎదుర్కొని పరుగులేమీ చేయకుండానే కుల్దీప్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యుగా వెనుదిరిగాడు. చివరి బ్యాట్స్ మన్‌గా హేజిల్‌వుడ్ క్రీజులోకి వచ్చాడు. హేజిల్‌వుడ్ 21(45 బంతులు, ఫోర్లు-2) పరుగులు చేసి కుల్దీప్ బౌలింగ్ బౌలింగ్ లో ఎల్బీడబ్ల్యుగా ఔట్ కావడంతో ఆస్ట్రేలియా డీఆర్ఎస్ కోరింది. డీఆర్ఎస్‌లో హేజిల్‌వుడ్ ఔటయినట్లు తేలడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 300 పరుగుల వద్ద ముగిసింది. హేజి ల్‌వుడ్, మిచెల్ స్టార్క్‌లు కలిసి 10 వికెట్ భాగస్వామ్యానికి 42 పరుగులు జోడించారు. భారత్ కన్నా ఆస్ట్రేలియా ఇంకా 322 పరుగులు వెనకబడ్డది. భారత్ బౌలర్లలో షమీ 2/58, బుమ్రా 1/62, జడేజా 2/73, కుల్దీప్ 5/99 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా ఫాలో ఆన్ ఆడుతూ టీ సమయానికి వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా సొంత గడ్డపై ఫాలో ఆన్ ఆడటం 30 ఏళ్ల తర్వాత చోటుచేసుకుంది. ఆసీస్ చివరిసారిగా 1988లో ఫాలో ఆన్ ఆడింది. వెలుతురు సరిగా లేకపోవడంతో ఆస్ట్రేలియన్ బ్యాట్స్‌మెన్ మైదానం వీడారు. అనంతరం పలు దఫాలుగా పరిస్థితిని సమీక్షించిన అంపైర్లు చివరికి మిగిలిన ఆటను కూడా రద్దు చేయడంతో నాలుగో రోజు ఆట ముగిసింది. వర్షం, వెలుతురు సరిగా లేకపోవడంతో ఆదివారం కేవలం 25.2 ఓవర్ల పాటే ఆట సాగింది. ఆసీస్ 316 పరుగుల ట్రయల్స్‌లో ఉం ది. మార్కస్ హ్యారిస్ 2 పరు గులు, ఉస్మాన్ ఖవాజా 6 పరు గులతో క్రీజు లో ఉన్నారు. నాలుగు టెస్టుల ఈ సిరీస్‌లో భారత్ రెండు ఆస్ట్రేలియా ఒక టెస్ట్ గెలిచాయి. 2-1తో ఆధిక్యంలో ఉన్న భారత్ చివరి టెస్ట్‌ను గెలిచినా, డ్రా చేసినా.. సిరీస్ భారత వశమవుతుంది. అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్ 31 పరుగులు తేడాతో గెలువగా, పెర్త్‌లో జరిగిన రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా 146 పరుగుల తేడాతో విజయం సాధించింది. మెల్‌బోర్న్‌లో జరిగిన మూడో టెస్ట్‌లో భారత్ 137 పరుగులు తేడాతో గెలుపొందింది.

ఆసియా ఖండం వెలుపల భారత్ తొలి ఇన్నింగ్స్ అత్యధిక లీడ్‌లు

సంవత్సరం	దేశం	స్టేడియం	లీడ్	మ్యాచ్ ఫలితం
2006లో	వెస్టిండీస్‌పై	గ్రాస్ ఐస్‌లెట్	373 పరుగులు	డ్రా
2002లో	ఇంగ్లండ్‌పై	లీడ్స్	355 పరుగులు	గెలుపు
2016లో	వెస్టిండీస్‌పై	నార్త్ సౌండ్	323 పరుగులు	గెలుపు
2018-19	ఆస్ట్రేలియాపై	ఎస్‌సీజీ	322 పరుగులు	మ్యాచ్ కొనసాగుతోంది
2007లో	ఇంగ్లండ్	ఓవల్	319పరుగులు	డ్రా
2016లో	వెస్టిండీస్	కింగ్‌స్టన్	304 పరుగులు	డ్రా

స్కోరు బోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: మార్కస్ హ్యారిస్ (బి) రవీంద్ర జడేజా 79, ఖవాజా (సి)పుజారా (బి) కుల్దీప్ యాదవ్ 27, మార్నస్ లాబుస్‌చాగ్నె (సి) రహానే(బి) షమీ 38, షువాన్ మార్ష్ (సి) రహానే (బి) రవీంద్ర జడేజా 8, ట్రావిస్ హెడ్ సి అండ్ బి కుల్దీప్ యాదవ్ 20, పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (బి) బుమ్రా 37, టిమ్ పైన్ (బి) కుల్దీప్ యాదవ్ 5, పాట్ కమిన్స్ (బి) షమీ 25, మిచెల్ స్టార్క్ నాటౌట్ 29, నాథన్ లియాన్ ఎల్బీడబ్ల్యు (బి) కుల్దీప్ 0, జోష్ హేజిల్‌వుడ్ ఎల్బీడబ్ల్యు (బి) కుల్దీప్ 21, ఎక్స్ట్రాలు 11 మొత్తం 300 ఆలౌట్ (104.5 ఓవర్లు)

భారత్ బౌలింగ్: మహ్మద్ షమీ 19-2-58-2, జస్ప్రీత్ బుమ్రా 21-5-62-1, రవీంద్ర జడేజా 32-11-73-2, కుల్దీప్ యాదవ్ 31.5-6-99-5, హనుమ విహారి 1-0-2-0.

రెండో టెస్ట్‌లో పాక్‌పై దక్షిణాఫ్రికా విజయం

2-0తో సిరీస్‌లో ఆధిక్యం

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాలో పర్యటిస్తున్న పాకిస్తాన్ ఆతిథ్య దేశంతో ఆడిన రెండో టెస్ట్‌లో పరాజయం పాలైంది. ఆదివారం ఆటకు నాలుగోరోజే ఫలితం వచ్చింది. దక్షిణాఫ్రికా విజయానికి కావలసిన 41 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో పాక్‌ను ఓడించింది. మూడు టెస్టుల సిరీస్‌లో ఇంకా ఒక టెస్ట్ ఆడాల్సి ఉండగానే.. దక్షిణాఫ్రికా రెండింటిలో గెలిచి సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. చివరి టెస్ట్ 11న ప్రారంభం కానుంది. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా, పాకిస్తాన్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులకే ఆలౌట్‌కాగా, దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగులు చేసింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ 294 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీనితో దక్షిణాఫ్రికాపై 41 పరుగుల ఆధిక్యాన్ని మాత్రమే పొందింది. నాలుగో ఆదివారం దక్షిణాఫ్రికా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించి వికెట్ నష్టపోయి 43 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ థ్యూనిస్ డి బ్రుయాన్ 4 పరుగులు చేసి ఔట్‌కాగా, హషీం ఆమ్లా 2 పరుగులు చేసి రిటైర్డ్ హార్ట్‌గా వెనుదిరిగాడు. ఓపెనర్ డీన్ ఎల్గర్ 24 పరుగులు, కెప్టెన్ డు ప్లెసిస్ 2 పరుగులతో నాటౌట్లుగా మిగిలారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు డు ప్లెసిస్ దక్కించుకున్నాడు.

సంక్షిప్త స్కోర్లు: పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్: 177 రెండో ఇన్నింగ్స్: 294
దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 431, రెండో ఇన్నింగ్స్ 43/1

కోహ్లి కింగ్‌డమ్‌లో విశేష బ్యాట్స్‌మెన్ పుజారా

- ఆసీస్ క్రికెట్ దిగ్గజం ఇయాన్ చాపెల్



సిడ్నీ: ప్రస్తుత సిరీస్‌లో చటేశ్వర్ పుజారా మూడు సెంచరీలు చేసి ఆస్ట్రేలియాపై భారత్ ఆధిక్యం సాధించడంలో కీలక భూమిక పోషించాడని ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ అన్నాడు. కోహ్లి కింగ్‌డమ్ (జట్టు)లో పుజారా పలు ప్రత్యేకతలున్న విశేష ఆటగాడన్నాడు. పుజారా ఒంటిచేత్తో ఆసీస్ బౌలర్లను తలవంచేలా చేశాడు. అంతేకాక, తన జట్టు బౌలర్లు కిల్లర్ బంతులను వేసేందుకు దారిని నిర్మించాడని చాపెల్ ఆదివారం ఈఎస్‌పీఎన్ క్రిక్ ఇన్ఫోకిచ్చిన ఇంటర్వ్యూలో ప్రశంసించాడు. భారత్ తొలిసారిగా ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ గెలుస్తున్నందున కోహ్లి కెప్టెన్సీని కూడా ప్రశంసించాడు. భారత క్రికెట్లో కోహ్లి కింగ్.. పుజారా అతనికి విశ్వాసపాత్రుడిగా రాణిస్తున్నాడు. కోహ్లి కింగ్‌డమ్‌లో అనేక ప్రత్యేకతలున్న బ్యాట్స్‌మన్ పుజారా. ఈ సిరీస్‌లో భారత్‌కు చాలా మంచి అవకాశాలు లభించాయి. వాటిని అందిపుచ్చుకుని భారత్ విజయ పథాన సాగుతోంది. పుజారా శక్తివంతమైన ఆటగాడిగా ప్రత్యర్థి బౌలర్లను లెక్కచేయకుండా ఏకాగ్రతతో ముందుకు దూసుకుపోయే ఆటగాడు. ఇలాంటి ప్రత్యేకలతో భారత్ జట్టుకు ప్రధానంగా మారాడు అని చాపెల్ పేర్కొన్నాడు. పుజారా ఆస్ట్రేలియాలో ఒక సిరీస్‌లో మూడు సెంచరీలు చేసి 1977-78లో ఇదే ఫీటు సాధించిన దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్ సరసన నిలిచాడన్నాడు. పుజారా ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఏడు ఇన్నింగ్స్‌లు ఆడి 521 పరుగులు చేశాడు. 1827 నిమిషాలు క్రీజులో ఉండి 1258 బంతులను ఎదుర్కొన్నాడు.

ఆసియా కప్‌లో భారత్ శుభారంభం

- థాయ్‌లాండ్‌పై 4-1తో గెలుపు
- మెస్సీ అత్యధిక గోల్స్ రికార్డును అధిగమించిన ఛెత్రీ



అబుదాబి: ఎఎఫ్‌సి ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో భారత్ శుభారంభం చేసింది. సునీల్ ఛెత్రీ నేతృత్వంలోని జట్టు థాయ్‌లాండ్‌పై 4-1తో విజయం సాధించింది. ఆదివారం జరిగిన గ్రూప్ ఎ పోటీలో థాయ్‌లాండ్‌ను ఓడించి చరిత్ర సృష్టించింది. ఆసియా కప్‌లో 1964 తర్వాత ఆసియా కప్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లో గెలవడం ఇదే ప్రథమం. ఆసియా కప్ టోర్నీల్లో ఛెత్రీ పాల్గొనడం ఇది రెండోసారి. కాగా తన కెరియర్లో ఇది 105వ మ్యాచ్. ఈ మ్యాచ్‌లో చేసిన గోల్స్ అన్నీ ఛెత్రీవే కావడం విశేషం. ఆట ప్రారంభం నుంచే ఇరు జట్లు దూకుడును ప్రదర్శించాయి. పరస్పరం గోల్‌పోస్ట్‌లపై దాడులు చేసుకున్నాయి. ఆట 27వ నిమిషంలో భారత్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను ఛెత్రీ గోల్‌గా మలచి జట్టుకు 1-0 ఆధిక్యాన్ని సాధించి పెట్టాడు. అనంతరం థాయ్‌లాండ్ పుంజుకుని ఆట 33వ నిమిషంలో గోల్ చేసింది. ఆ జట్టు కెప్టెన్ తిరాసిల్ దగ్గ తన సహచర ఆటగాడు తీరతాన్ బన్‌మథాన్ అందిచిన పాస్ సెంటర్ ఆఫ్ ద బాక్స్ వద్ద తలతో అందుకుని హెడర్ షాట్‌గా గోల్ పోస్ట్‌లోకి పంపి స్కోరును 1-1తో సమం చేశాడు. ఆట 46వ నిమిషంలో ఆశిక్ కురినియన్ అందించిన పాస్‌ను సెంటర్ ఆఫ్ బాక్స్‌నుంచి శక్తివంతమైన కిక్‌తో గోల్ పోస్ట్‌లోకి పంపి భారత్‌కు 2-1 ఆధిక్యానిచ్చాడు. ఆట 68వ నిమిషంలో ఉదాంత సింగ్ అందించిన పాస్‌ను అనిరుధ థాపా అందుకుని అద్భుతంగా గోల్ చేయడంతో భారత్ 3-1 లీడ్‌కు వెళ్లింది. ఆట 80వ నిమిషంలో సబ్‌స్ట్యూట్‌గా మైదానంలోకి వచ్చిన జెజె లాల్‌పెక్లువా, హాలిచరన్ లాలాజరి అందించిన పాస్‌ను గోల్ చేయడంతో భారత్4-1తో తిరుగులేని ఆధిక్యాన్ని పొందింది. 34 ఏళ్ల ఛెత్రీ తన అంతర్జాతీయ 67వ గోల్‌ను చేసి అర్జెంటీనా సూపర్ స్టార్ లయోనిల్ మెస్సీ రికార్డును అధిగమించాడు. మెస్సీ 128 మ్యాచుల్లో 65 గోల్స్ చేయగా, ఛెత్రీ 105 మ్యాచుల్లో 67 గోల్స్ చేశాడు. ప్రపంచంలో అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాడిగా పోర్చుగల్‌కు చెందిన సూపర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో (154 మ్యాచుల్లో 85 గోల్స్) తొలి స్థానంలో ఉన్నాడు. గ్రూప్ ఎలో ఆడే రెండు మ్యాచుల్లో ఏదో ఒక మ్యాచ్‌ను డ్రా చేస్తే భారత్ నాకౌట్‌కు చేరుకుంటుంది. భారత్ 10న యూఏఈతో, 14న బహ్రెయిన్‌తో తలపడనుంది. నాలుగో ఆసియా కప్‌ను ఆడుతున్న భారత్ ఇప్పటివరకు 11 మ్యాచులు ఆడగా మూడు మ్యాచులు గెలిచింది. 1964 ఎడిషన్లో రెండు మ్యాచులను సొంతం చేసుకుంది. 1984 ఎడిషన్లో భారత్ మూడు మ్యాచులు ఓడి ఒక డ్రా చేసుకుంది. 2011లో ఆడిన మూడు మ్యాచుల్లోను ఓడింది. సోమవారం యూఏఈ, బహ్రెయిన్ మధ్య జరిగిన మరో గ్రూప్ ఎ పోటీ 1-1తో డ్రాగా ముగిసింది. గ్రూప్ బి పోటీలో జోర్డాన్ 1-0తో ఆస్ట్రేలియాపై గెలిచింది.

హంటర్స్ జోరు



అహ్మదాబాద్: పీబీఎల్ టోర్నీలో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్ 4-3 తేడాతో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌ను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో బి ఇసారా- ఇహెచ్ వాన్(హంటర్స్) 15-9, 15-4తేడాతో రాంకిరెడ్డి- సిక్కిరెడ్డి(అహ్మదాబాద్)ను ఓడించారు. పురుషుల సింగిల్స్‌లో డి లీయు(అహ్మదాబాద్) ట్రంప్‌మ్యాచ్‌గా ఆడి 15-13, 15-9తో చిట్టబోయిన(హంటర్స్)ను ఓడించింది. రెండో పురుషుల సింగిల్స్‌లో అక్సెల్‌సెన్(అహ్మదాబాద్) 15-11, 13-15,15-8 తేడాతో కాలిజో(హంటర్స్)పై గెలిచింది. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు (హంటర్స్) ట్రంప్ మ్యాచ్‌గా ఆడి 15-14, 12-15, 15-14 తేడాతో గిల్‌మోర్(అహ్మదాబాద్) ను ఓడించింది. పురుషుల డబుల్స్‌లో బి ఇసారా- కెఎస్ రాంగ్(హంటర్స్) 15-14, 11-15, 15-10 తేడాతో రెజినాల్డ్- రాంకిరెడ్డి(అహ్మదాబాద్) జోడీని ఓడించారు. మరో మ్యాచ్‌లో ఢిల్లీపై పుణె గెలిచింది.

ఢిల్లీపై పుణె గెలుపు

మరో మ్యాచ్‌లో పుణె 7 ఏసెస్ 6-0 పాయింట్ల తేడా ఢిల్లీ డాషర్స్‌ను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ట్రంప్ మ్యాచ్‌గా (వి ఇవనోవ్- ఎల్ హెచ్ జేర్‌ఫెల్డ్ట్) ఎంచుకున్న పుణె 2-1తో జొంగ్‌జిత్- కొసెట్స్కయ(ఢిల్లీ)ని ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్(పుణె) 2-0 తేడాతో సి సేన్‌పై గెలిచాడు. రెండో పురుషుల సింగిల్స్‌లో లీవర్‌డెజ్(పుణె) 0-2తో సుగియార్తో(ఢిల్లీ) చేతిలో పరాజయం పాలైంది. పురుషుల డబుల్స్‌లో సిబియవో- ఎం జొంగ్‌జిత్(ఢిల్లీ) ట్రంప్ మ్యాచ్‌గా ఆడి ఎం బోయి- సి.షెట్టి(పుణె) చేతిలో 1-2తో ఓడిపోయింది. మహిళల సింగిల్స్‌లో మారిన్(పుణె) 2-0 తేడాతో కొసెట్స్కాయను ఓడించింది.

కోహ్లి సేన అద్భుతం చేస్తోంది

మాజీ కెప్టెన్ వెంగ్‌సర్కార్



ముంబై: ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్‌లో భారత జట్టు పైచేయి సాధించడాన్ని మా జీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌స ర్కార్, మాజీ క్రికెటర్ ప్రవీణ్ ఆమ్రే ప్రశంసించారు. ఆదివారం వీరిద్దరు మీడి యాతో మాట్లాడారు. నాలు గు టెస్టుల సిరీస్‌లో భారత్ 2-1తో లీడ్‌లో ఉండి సిరీస్‌ను 3-1 చేజిక్కించుకోవడా నికి ముందుకు సాగుతోంది. ప్రస్తుత భారత జట్టు అద్భుత ఆటను ప్రదర్శించింది. ఆస్ట్రేలియాను వారి సొంత గడ్డపై ఓడించడం గొప్ప మైలురాయి. ఇప్పటివరకు భారత్ ఈ ఘనతను సాధించలేదు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు 1948లో ప్రారంభమైన తర్వాత ఈ తరహా ప్రదర్శన ఎప్పుడు జరగలేదు అని వెంగ్ సర్కార్ అన్నాడు. ఆదివారం 25వ ఇంటర్ హాస్పిటల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వెంగ్‌సర్కార్ అనంతరం మీడియాతో మాట్లాడాడు. 'విరాట్ కోహ్లి నేతృత్వంలోని జట్టు అద్భుత విజయమిది. పర్యాటక జట్లకు ఆస్ట్రేలియా పరిస్థితులు కఠినంగా ఉంటాయి. కాని భారత జట్టు ఈ పరిస్థితులకు అనుగుణంగా మారింది. ప్రతీ జట్టు విదేశాల్లో ఏవిధంగా రాణిస్తుందన్నదాన్ని బట్టి ఆ జట్టు ఖ్యాతి పెరుగతుంది. కోహ్లి సేన ఈ ఖ్యాతిని అందుకుని మనకు గర్వకారణంగా నిలిచింది' అని వెంగీ చెప్పాడు. వెంగ్‌సర్కార్ గత భారత జట్టులో టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్, 116 టెస్టులు ఆడి 6868 పరుగులు చేశాడు. వెంగీ ఖాతాలో 17 సెంచరీలు, 35 అర్ధసెంచరీలున్నాయి. 129 వన్డేల్లో 3,508 పరుగులు చేశాడు. ఇందులో ఒకసెంచరీ 23 అర్ధ సెంచరీలున్నాయి. బుమ్రా ప్రపంచంలోని బెస్ట్‌ఫాస్ట్ బౌలర్లలో ఒకడు అని వెంగ్‌సర్కార్ ప్రశంసించాడు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రవీణ్ ఆమ్రే మాట్లాడుతూ.. భారత బౌలర్లలో అద్భుత ప్రతిభ ఉన్న బౌలర్‌గా బుమ్రాను ప్రశంసించాడు. ఒక సిరీస్‌లో గెలవడానికి జట్టు సమష్టిగా ఆడాల్సి ఉంటుంది. ప్రస్తుతం అదే జరుగుతోంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో ఒక యూనిట్‌గా రాణిస్తున్నాము అని ప్రవీణ్ తెలిపాడు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.